ISSN 0971-278X

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 462
వెల : రూ.25/-
సెప్టెంబర్ 2023



ఆఖరి చెట్టును కూడా కొట్టేసిన తర్వాత....

తుట్టతుది నదిని కూడా విషతుల్యం చేసేశాక....

చిట్టచివర చేపను కూడ పట్టేశాక....

అప్పుడు గుర్తిస్తావు నువ్వు డబ్బును తినలేమని!

జనసాహితి ప్రచురణ

కవిత

# జలియన్ వాలాబాగ్‌లో వసంతం

హిందీ మూలం : *సుభద్రా కుమారి చౌహాన్* తెలుగు అనువాదం : *డా।। వెన్నా వల్లభరావు*

**ఇక్కడ** కోకిలలుకాదు, కాకులు గోలచేస్తున్నాయి కావ్ కావ్ మంటూ
నలనల్లని పురుగులు తుమ్మెదలుగా భ్రమ కల్పిస్తున్నాయి.

మొగ్గలు కూడా సగంవిచ్చి, చిక్కుకుపోయాయి ముళ్లలో
మొక్కలు, పువ్వులు ఎండిపోయాయి, వాడిపోయాయి.

పరిమళంలేని పుప్పొడి చెరగని మరకలా గడ్డకట్టుకుపోయింది
అవును! అందమైన ఈ పూదోట నెత్తురుతో తడిసిపోయింది.

ఓ వసంతమా! అలాగని నువ్వు రావటం మానకు, నెమ్మదిగా రా,
ఇది శోకస్థలి, ఇక్కడ శబ్దం మాత్రం చెయ్యొద్దు సుమా!

గాలైతే వీచనీ, కానీ మెలమెల్లగా ప్రసరించనీ,
దుఃఖపు నిట్టూర్పుల్ని నువ్వుఎగరేసుకుపోవద్దు!

కోకిలలు కూయనీ, కానీ విలాప రాగంలో వాటిని పాడనీ,
తుమ్మెదలు ఝుంకారాలు చెయ్యనీ, దుఃఖ గాథ వినిపించనీ.

పుష్పాలు వెంట తీసుకురా! మిక్కిలి అందంగా లేనివేసుమా
పరిమళం కూడా మితంగా, మంచుతో కొద్దికొద్దిగా తడిచి ఉన్నవే.

నువ్వు వచ్చి కానుక సమర్పించే భావాన్ని మాత్రం ప్రకటించకు
స్మృత్యర్థం పూలు మాత్రం కొన్నిక్కడ చల్లి వెళ్ళు కడుశ్రద్ధగా.

లేతవయసు పసిపిల్లలు మరణించారిక్కడ తుపాకీ గుళ్ళకు బలై,
మొగ్గలు కొన్ని తీసుకువచ్చి కుమ్మరించు ఇక్కడ వారికోసం.

ఆశలు నిండిన హృదయాలెన్నో ఛిద్రమయ్యాయి,
ప్రీతిపాత్రమైన కుటుంబాలెన్నో దేశం నుండి వేరయ్యాయి.

అరవిరిసిన మొగ్గలు కొన్ని ఇక్కడ సమర్పించి వెళ్ళు
వారిని జ్ఞాపకం చేసుకుని అశ్రు తుషారాలు వర్షించు.

విలవిలా తన్నుకుని నేలకొరిగారు వృద్ధులు తుపాకీ గుళ్ళు తగిలి,
ఎండిన పువ్వులు కొన్ని కురిపించు నువ్వు వారికి నివాళిగా.

నేను చెప్పినవన్నీ చెయ్యి, కానీ అక్కడ శబ్దం మాత్రం చెయ్యొద్దు,
ఓ వసంతమా! జ్ఞాపకముంచుకో ఇది శోకస్థలి, నువ్వు నెమ్మదిగా రా!

జనసాహితి ప్రచురణ

47 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

462

సంపుటి : 47

సంచిక : 02

సెప్టెంబర్ 2023

*website :* **www.prajaasaahithi.com**

## ఈ సంచికలో...


| | | | | |
|---|---|---|---|---|
| ముఖచిత్రం | : | ఆదివాసీలను అడవుల నుండి గెంటివేతపై – కార్టూన్ | అంతర్జాలం నుండి | ..... 01 |
| రెండవ అట్ట | : | జలియన్ వాలాబాగ్‌లో వసంతం (కవిత) | – డా॥ వెన్నా వల్లభరావు | ..... 02 |
| మూడవ అట్ట | : | ఒడువని ముచ్చట (కవిత) – కందుకూరి అంజయ్య, గుర్రం జాషువా పద్యం | | ..... 35 |
| నాల్గవ అట్ట | : | భగత్‌సింగ్ లేఖ | | ..... 36 |
| సంపాదకీయం | : | సామ్రాజ్యవాద కార్పొరేట్ల గుప్పెట్లో పర్యావరణం; ఆదివాసీ జీవన విధ్వంసం!! | | ..... 05 |
| కథ | : | వధువు కావలెను | – పేపకాయల ప్రసాద్ | ..... 07 |
| వాణిజ్య ప్రకటన | : | శ్రీ ప్రతిభ కాలేజ్ | | ..... 06 |
| కరపత్రం | : | ఆదివాసీ చట్టంపై – పిడిఎస్‌ఓ | | ..... 10 |
| వ్యాసాలు | : | మహోన్నత తెలంగాణా సాయుధ పోరాట చరిత్ర.... | – జె.జె. సంయుక్త | ..... 12 |
| | : | గద్దర్ పాట వెనక కథ | – తాడి ప్రకాశ్, లెల్లె సురేశ్ | ..... 24 |
| చారిత్రక పత్రం | : | రెడ్ ఇండియన్ల నాయకుడు ఇచ్చిన సమాధానం | | ..... 15 |
| ధారావాహిక | : | దేశ విభజన వస్తువుగా సాహిత్యం (13) | | |
| | | బాప్సీ సిధ్వా నవల 'బీటలువారుతున్న భారతదేశం' | – కొత్తపల్లి రవిబాబు | ..... 17 |
| జాతీయ అక్షరయోధులు | : | నాగార్జున్ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | ..... 22 |
| స్పందనలు | : | బడిపిల్లల మెదళ్ళలోకి ఎక్కించబడుతున్న.... | – హరిబాబు | ..... 20 |
| | : | "Hand Book of Combating Stereo Types" పై | – ఒ. మనస్విని | ..... 27 |
| కవితలు | : | సిహెచ్. రమణచారి (**16**); దీర్ఘకవిత : శీలా సుభద్రాదేవి (**11**); వెన్నావల్లభరావు (**19**); సత్య భాస్కర్ (**23**); రఘుపాత్రుని శ్రీనివాసరావు (**26**); కొత్తపల్లి రవిబాబు (**32**) | | |
| పాట | : | పి. మోహనరావు (**31**) | | |
| వివిధ | : | ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (**09**); కృతజ్ఞతలు (**14**) వర్తమాన సాహిత్య సాంస్కృతిక సామాజికాంశాలు (**04, 26, 29, 30** ); చైతన్యవాహిని (**32**) ఈ పుస్తకాలు అందాయి (**23, 33**) | | |
| సంతాపాలు | : | కామ్రేడ్ గద్దర్ (**21**), జహీరుద్దీన్ ఆలీఖాన్ (**28**) | | |


**ప్రధాన సంపాదకుడు : కొత్తపల్లి రవిబాబు ఫోన్ : 9490196890** E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి
జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి
**30-7-6,** అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,
దుర్గాఅగ్రహారం, విజయవాడ – **520002.**
ఫోన్ : **70759 57010** prajasahithi1977@gmail.com

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 0971-278X

LIBRARY OF CONGRESS
LCCN
94903393

*రచనలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి
ప్లాట్ నెం. **59,** రాధాకృష్ణ నగర్ కాలనీ
ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,
శ్రీకాకుళం – **532001**
ఫోన్ : **78936 97469** prajasahithi1977@gmail.com

'ప్రజాసాహితి'
కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు
"అకౌంట్ నెం.
**0680101004936**
**IFSC No. CNRB0000680**
**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**
మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు
1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

## మలయాళీ రచయిత్రి, సంఘసంస్కర్త
# దేవకి నీలాయం గోదె మరణం

**ఆమె** కేరళ నంబూద్రి బ్రాహ్మణ స్త్రీ. ఈ స్త్రీలను అంతర్జనం అంటారు. అంటే బయటి సమాజంలోకి రాకుండా ఇళ్ళల్లోని చీకటి కొట్లలో మగ్గుతూ నోరు తెరవకుండా సొంత వ్యక్తిత్వం లేకుండా బతికేవారు అని అర్థం. దేవకి 6 జులై 2023న త్రిశూర్‌లో తన 95వ ఏట మరణించారు. ఆమె 1928లో జన్మించారు.

కేరళలోని నంబూద్రి బ్రాహ్మణులు పరమ ఛాందసులు. సంకుచిత మనస్కులు. ఇతర ఆలోచనావిధానాలను తమ దరికి చేరనీయరు. పితృస్వామిక సంస్కృతి ప్రకారం స్త్రీలు బయట కనపడకూడదు – వారు చదువుకోకూడదు. జ్ఞానవంతులు కాకూడదు.

తాను తన సమాజంలో ప్రత్యక్షంగా చూసిన స్త్రీల అణచివేతను దేవకి ధిక్కరించారు. నంబూద్రి బాల వితంతువులు అత్తగారి ఇళ్ళల్లో వెట్టిచాకిరీ చేసే బానిసలుగా వుండటాన్ని ఖండించారు. 1940 చివర, 1950 ప్రారంభ సంవత్సరాలలో యోగక్షేమ సభ ఆధ్వర్యాన ఆమె అంతర్జన సమాజాన్ని స్థాపించారు. ఆ తర్వాత దాన్ని కమ్యూనిస్టు పార్టీలో విలీనం చేశారు.

ఆ సమాజం ద్వారా వితంతు వివాహాలు, విద్య, ఉద్యోగాలను మహిళా లోకంలో ప్రోత్సహించారు. ఆమె తన జ్ఞాపకాలు 'విత్ నో రిగ్రెట్స్' అనే పుస్తకం ద్వారా తెలియ చేశారు. 'మారుతున్న కాలం' (Changing Time) అనే పుస్తకంలో మహిళల దీనస్థితి మారాలనీ, మహిళలు చదివే, రాసే ధైర్యం సంపాదించాలనీ తెలియచేశారు.

నంబూద్రి కుటుంబాలలో స్త్రీలు చీకటి కోణాలపై వెలుగును తన రచనల ద్వారా ప్రసరింపచేశారు.

## సామాజిక కార్యకర్త, రచయిత
# అచ్యుత్ యాజ్ఞిక్ మరణం

**గుజరాత్‌కు** చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త అచ్యుత్ యాజ్ఞిక్ తన 77వ యేట 4 ఆగస్టు 2023న మరణించారు. అహమ్మదాబాద్‌కు చెందిన యాజ్ఞిక్ 1 ఫిబ్రవరి 1946న జన్మించారు.

ఆయన దళితులకు, ఆదివాసీలకు, అణచివేతకు గురవుతున్నవారందరికీ గత ఆరు దశాబ్దాలుగా మిత్రుడు, సన్నిహితుడు. 1974 నాటి నవ నిర్మాణ సమితి ఉద్యమంలో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు. 1981లో, 1985లో అగ్రవర్ణాలు జరిపిన రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమంలో దళితుల పక్షం వహించారు. ఆయన తొలిదశలో లోహియా ఆలోచన ప్రభావంలో వుండేవారు. చాలాకాలం పాత్రికేయులుగా పనిచేశారు. 'గుజరాత్ సమాచార్' పత్రికలో 10 ఏళ్ళు వున్నారు. 'గుజార్ భారతి'కి సంపాదకత్వం వహించారు. సూరత్ నుండి వెలువడిన 'అర్థాత్' పత్రికకు ఆయన సంస్థాపక సంపాదకుడు. ఇ.పి. డబ్ల్యులో పనిచేశారు. 1980లో జర్నలిజం వదిలేశారు.

ఢిల్లీలోని లోకాయత్ ప్రాజెక్టువారి 'అభివృద్ధి పొందుతున్న సమాజాల అధ్యయన సంస్థ'కు సమన్వయకర్తగా వున్నారు అహమ్మదాబాద్ కేంద్రంగా అట్టడుగు వర్గాల ఉద్ధరణ లక్ష్యంగా ఏర్పడిన SETUకు గౌరవ కార్యదర్శిగా పనిచేశారు. నర్మదా డామ్ వ్యతిరేక ఉద్యమంలో, 1991–92 నాటి అయోధ్య హింసాకాండ నిరసనలో, 2002 గుజరాత్‌లో ముస్లిముల ఊచకోత నిరసనలో, అనేక నిజ నిర్ధారణ కమిటీలలో ఆయన క్రియాశీలంగా పాల్గొన్నారు. గుజరాత్ రాష్ట్ర PUCLకి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు.

600 సంవత్సరాల చరిత్ర కల్గిన అహమ్మదాబాద్‌పై సాధికారకమైన గ్రంథాన్ని రచించారు. అనేక విదేశీ విశ్వవిద్యాలయాలలో ప్రసంగించారు. రామజన్మభూమిపై అశిష్‌నందితో కలిసి 1995లో ఆయన రాసిన పుస్తకాన్ని ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ ప్రెస్ ప్రచురించింది.

సంపాదకీయం

# సామ్రాజ్యవాద కార్పొరేట్ల గుప్పెట్లో పర్యావరణం; ఆదివాసీ జీవన విధ్వంసం!!

**ఆగస్టు** 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా వున్న ఆదివాసీల హక్కులను రక్షించడానికి, వారి వైవిధ్య భరితమైన సంస్కృతులను, భాషలను, అపురూపమైన వారి కళలను, సామాజిక భాగస్వామ్యాన్ని గౌరవించడానికి నిర్ణయించుకున్న ముఖ్యదినం అది. అంతేకాకుండా, వారి కష్టాలను, సమస్యలను అర్థం చేసుకొని పరిష్కరించడానికి, వాళ్ళకు అడవిపైనా, అక్కడ భూమిపైనా వున్న హక్కులను కాపాడటానికీ ఈ ప్రపంచ ఆదివాసీదినాన్ని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 1994 డిసెంబర్లో ప్రకటించింది. 1982లో జెనీవా కేంద్రంగా ఆదివాసీ పరిరక్షణ కార్యకర్తల సమూహపు ఆలోచన ఫలితంగా ఈ ఆదివాసీదినం ఉనికిలోకి వచ్చింది.

ప్రపంచవ్యాప్తంగా 5000 రకాల వైవిధ్యభరితమైన నాగరికతలు, సంస్కృతులు 7000 పైగా ఆదివాసీ భాషలు ఉన్నాయి. కానీ అవి అతిత్వరితంగా అదృశ్యమౌతున్నాయి.

ప్రపంచంలో ఆదివాసి జనాభా ఐదు శాతం వున్నారు. ప్రపంచ పేదలలో ఆ ఆదివాసీలు 15% ఉన్నారు.

ఆగస్టు 2, 2023 తేదీన జరిగిన CONSULTATIVE COMMITTEE ON ENVIRONMENT AND CLIMATE సమావేశం ఆధారంగా చేసుకుని అదే రోజు భారత ప్రభుత్వం – 2006 నాటి అటవీ సంరక్షణ బిల్లును సవరిస్తూ, ఆ సవరణ బిల్లును నాటకీయంగా మూజువాణి ఓటుతో ఆమోదించింది. అంతేకాకుండా – అంతకుముందే ఆగస్టు ఒకటో తారీఖున – జీవవైవిధ్య సవరణ బిల్లును కూడా తూతూ మంత్రంగా ఆమోదించారు. ఈ రెండు చట్టాల సహాయంతో అటవీసంరక్షణ పేరుమీద, జీవవైవిధ్య పరిరక్షణ పేరు మీద, ఆదివాసీ తెగల వల్లే అడవులు, పర్యావరణం నాశనమవుతున్నాయి అనే సాకుతో, ఆదివాసీలను అడవుల నుంచి ఖాళీ చేయించే ప్రక్రియకు మార్గం సుగమం చేసుకున్నారు. 2023 సెప్టెంబర్‌లో సామ్రాజ్యవాద దేశాలతో కలిసి ఏర్పడిన గ్రూపు 20 (జి20) "వాతావరణ మార్పులు, పర్యావరణం" అనే అంశంపై ఢిల్లీలో జరగబోయే శిఖరాగ్ర సమావేశానికి ముందుగా ఈ రెండు బిల్లులు చట్టరూపం పొందటాన్ని గమనించాల్సిన అంశం. నేతి బీరలో నెయ్యెంతో – ఈ చట్టాలలో ఆదివాసి రక్షణ అంతే.

చరిత్రను పరిశీలిస్తే, భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ – సామ్రాజ్యవాద దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా మొట్టమొదట ఉద్యమ పోరాటాలు చేసింది ఆదివాసీలే. భారతదేశంలో ఈ అడవుల విధ్వంసం అన్ని రంగుల జండాల ప్రభుత్వాల హయాములలోనూ కొనసాగుతూ వస్తోంది. 30 ఏళ్ల ప్రపంచీకరణ ఈ అటవీ విధ్వంస ప్రక్రియను వేగవంతం చేసింది. ఇటీవల ఏడు ఎనిమిది సంవత్సరాల కాలంలో ఆ విధ్వంసం మోడీ నాయకత్వంలో వేగంతో పాటు ఫాసిస్టు తరహా నిరంకుశ ధోరణిని కూడా సంతరించుకుంది. ఫాసిస్టు తరహా దాడులతో, మతతత్త్వ పోకడలతో, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ప్రయోజనాలకు దాసోహం అంటూ ఆదివాసీ తెగలను ఈనాడు ఊచకోత కోస్తున్నారు. ఆనాడు నూతన ఆర్థిక విధానాలకు పచ్చ జెండా ఊపిన పీవీ నరసింహారావు ప్రభుత్వ విధానాలకు కొనసాగింపే నేటి ఈ చట్టాల పరిణామం.

"అడవి మనది కాదంట / కొండా మనది కాదంట / గూడు మనది కాదంట / గుండె మనది కాదంట" అనే 1980ల నాటి జనం పాట పాలకుల అటవీ విధాన స్వభావాన్ని ఎత్తిపట్టింది. 1991లో ప్రపంచ బ్యాంకుతోనూ, అంతర్జాతీయ ద్రవ్యనిధితోనూ చేసుకున్న ఒప్పందాలు విడిచిన బాణం లాంటివని, వెనక్కి తిరిగి రావని తేల్చి చెప్పేసారు ఆనాటి ప్రధాని పీవీ నరసింహారావు. వాటి దుష్ఫలితాలు జన జీవితంలో కనిపించినప్పుడు "నేను కిటికీలు తెరిచాను – ఇప్పుడున్న ప్రభుత్వం తలుపులు కూడా విరిచింది" అని చిత్తశుద్ధి లేకుండా తప్పుకుపోయాడు.

1793 శాశ్వత భూమిశిస్తు విధానం ఫలితంగా ఆదివాసీలు భూములను కోల్పోయారు. ఆకలి చావులకు గురయ్యారు. వలసలు, విస్తాపన సృష్టించిన ఒక భయంకరమైన జీవన విధ్వంసం కారణంగా 1855లో సంతాల్ ఆదివాసీల తిరుగుబాటు చోటు చేసుకుంది. అది 1956 వరకు బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాలలో కొనసాగుతూనే ఉంది. 1922 నుంచి 1924 వరకు మన్యం ప్రాంతంలో జరిగిన రంప తిరుగుబాటును అణచివేసి అల్లూరిని బూటకపు ఎన్‌కౌంటర్ చేశారు. 1945 నుంచి 47 వరకు జరిగిన వర్లీ ఆదివాసి తిరుగుబాటు మహారాష్ట్రలో థానే, పూణే, నాసిక్, జల్‌గాన్, నగర్ జిల్లాలకు వ్యాపించింది. వెట్టిచాకిరికి, అప్పులు – వడ్డీల పీడనకు వ్యతిరేకంగా బెంగాల్ బీహార్ అడవుల్లో ఆదివాసులు తీవ్రంగా పోరాడారు. దక్కన్ ప్రాంతంలో గోండు తెగ ఆదివాసీలు కొమరం భీం నాయకత్వంలో సామ్రాజ్యవాదానికి, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాయుధ తిరుగుబాటు చేశారు. ఈ అటవీ ఆర్థిక సాంస్కృతిక సామాజిక విధ్వంసానికి వ్యతిరేకంగా బిర్సా ముండా లేవనెత్తిన కీలక ప్రశ్న – ఎవరిదీ అడవి? 1899–1900లలో రాంచీ ప్రాంతంలో – "ఉల్‌గులాన్" ఉద్యమమై తిరుగుబాటు బాట పట్టింది. వలస పాలనకు, భూస్వామ్య

వ్యవస్థకు, వ్యతిరేకంగా ఆదివాసుల మౌలిక హక్కుల కోసం జరిగిన సాయుధ పోరాటం అది. అక్కడ కూడా 1778 నాటి అటవీ చట్టమే ఆదివాసుల విధ్వంసానికి కారణమైంది. అదే వరుసలో – నక్సల్‌బరీ ప్రభావంతో, శ్రీకాకుళం తూర్పు కనుమల్లో గిరిజన రైతాంగ సాయుధ పోరాటం మారుమోగింది. దాని ప్రభావంతో 1/70 చట్టాన్ని పాలకులు తీసుకువచ్చినప్పటికీ, దాన్ని అమలుపర్చుకోవటానికి కూడా నేటికీ ఆదివాసీలు పోరాడాల్సి వస్తుంది. 50 ఏళ్ళకు పైగా సాగుతున్న గోదావరి లోయలోని కొండమొదలు, పార్వతీపురం ఏజెన్సీ ప్రాంత దుగ్గేరు ఆదివాసీల ఉద్యమాలు వాటికి కొనసాగింపే! అడవులను బోడులు చేసి పర్యావరణ విధ్వంసాన్ని సృష్టించేది పాలక దోపిడీ మూకలు, వారి ఏజెంట్లయితే, వాటిని సంరక్షించేది ఆదివాసీలు, వారి హక్కులకై పోరాడే ఉద్యమాలే అని గడిచిన చరిత్ర రుజువు చేసింది.

లాటిన్ అమెరికా దేశాల అడవుల్లో, ఆసియా దేశాల అడవుల్లో – అమెరికా సామ్రాజ్యవాదం అక్కడి సహజ వనరులను, సామాజిక సంపదలను, శ్రమ శక్తిని, అపారమైన భూమిని కొల్లగొట్టడానికి క్రూరంగా జరిపిన దారుణ మారణకాండను జాన్ పెర్కిన్స్ రాసిన ఒక "దళారీ పశ్చాత్తాపం" మన కళ్లకు కడుతుంది. ఇటీవలే అమెరికాలోని గుత్త పెట్టుబడిదారుల వాణిజ్య ప్రయోజనాల కోసం అపారమైన అమెజాన్ అటవీ ప్రాంతాన్ని దోచిపెట్టటానికి అక్కడ ఉన్న ఆదివాసీల జీవితాలను విధ్వంసం చేస్తూ విచక్షణారహితంగా అమెజాన్ అడవులను తగలబెట్టడం చూసాం. ప్రపంచానికి ఊపిరితిత్తుల వంటి అమెజాన్ అడవులను సర్వనాశనం చేస్తున్న అమెరికా సామ్రాజ్యవాదమే రుద్రాక్ష పిల్లి లాగా పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ అంటూ ప్రపంచ వేదికల మీద నీతులు చెబుతోంది.

కృత్రిమంగా తయారు చేయలేని సారవంతమైన భూమిని, లక్షల ఏళ్ల పరిణామ క్రమంలో రూపొందిన భూగర్భంలోని ఖనిజ సంపదను, ప్రకృతి సహజ వనరులను విచక్షణారహితంగా కొల్లగొట్టాలనే దురాశతో, మూడో ప్రపంచ దేశాల ప్రభుత్వాలను కీలుబొమ్మల్లా ఆడిస్తూ తన ఏకకేంద్రక ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి అమెరికా సామ్రాజ్యవాదం కుట్ర పన్నుతోంది. పర్యవసానంగా పాదాల కింద తమ నేలను కోల్పోతున్న అడవి బిడ్డలు, పేదరికం, ఆకలి పేగులతో నకనకలాడుతున్నారు. ఈ కొత్త చట్టాల వల్ల, కాశ్మీర్‌లో లాగానే భూమి గుత్త పెట్టుబడిదారులకు ధారాదత్తమవుతుంది. మణిపూర్ ఆదివాసీ తెగలపై ప్రభుత్వమే రేపెట్టిన మరణ హోమం మనం కళ్ళ ఎదుట చూస్తూనే ఉన్నాం. మణిపూర్ కొండలలో అడవులలో నిక్షిప్తమై ఉన్న అపురూపమైన ఖనిజ సంపద కోసం దేశ పాలకవర్గాలు మతతత్త్వంతో సాగిస్తున్న అకృత్యాలు కడుపులో పేగుల్ని కలచివేస్తున్నాయి.

"ఒక సమాజం మొత్తం గానీ, ఒక యావత్తు దేశంగానీ, లేదా భూమిపై ఉన్న మొత్తం సమాజాలన్నీ కలుపుకున్నా గానీ – వారు భూమికి యజమానులు కారు. కేవలం ఆ భూమిపై గల వనరులను వినియోగించుకోవడం, దాని ప్రయోజనాలు పొందడం మాత్రమే వారు చేయాలి. తమ తరువాతి తరాలకు భూమిని మరింత మెరుగైన స్థితిలో అప్పజెప్పడం వారి బాధ్యత!" అని ఈ ప్రపంచాన్ని మార్చే పోరాట తాత్వికతను అందించిన కార్ల్‌మార్క్స్ అన్నారు.

"భూమి నాది అన్న భూమి ఫక్కున నవ్వు!!" అన్నాడు మన వేమన.

పర్యావరణ పరిరక్షణకూ, ఆదివాసీల హక్కుల భద్రతకు – పెద్ద ఎత్తున ప్రతిఘటన పోరాటాలు వెల్లువెత్తాలి. వాటికి మద్దతుగా సాహితీ సాంస్కృతిక ఉద్యమ పోరాటం పదునెక్కాలి!! **28-08-23**



కథ

# వధువు కావలెను

– పేపకాయల ప్రసాద్

**థౌజండ్** స్కైషాట్లు, తారాజువ్వలు ఆ రాత్రివేళ ఆకాశాన్ని వింత వింత కాంతులతో, శబ్దాలతో నింపేస్తున్నాయి. తొమ్మిది గంటల ముహూర్తం కావడంతో ఒక పక్కన భోజనాలు, మరో పక్కన పెళ్లి – చాలా సందడిగా ఉంది ఆ ప్రాంతం.

పెళ్లి వేదికకి ఒకవైపు ప్రధాన పురోహితుడు, అతనికి తోడుగా వచ్చిన మరో పంతులు కూర్చుని ఆర్భాటంగా తంతు నడిపిస్తున్నారు.

రెండు వీడియో కెమేరాలు వేదికకి రెండడుగుల దూరంలో సెట్ చేసేసి, మరో రెండు కెమెరాలతో వేదిక పైన వధూవరులకు దగ్గరగా కూర్చుని, అక్కడ ఏం జరుగుతుందో ఎవరికీ కనబడనంతగా మూసేసారు షూటింగ్ కుర్రాళ్ళు.

కొత్త దంపతుల ముఖాల నిండా తెల్లటి స్నో స్ప్రే చేసి తమ సరదా తీర్చుకునే అవకాశం కోసం మండపంలో మిగిలిన కొద్ది ఖాళీలో స్నేహితులు నిలబడిపోయారు.

థౌజండ్ వాట్స్ కెమెరా లైట్ల వేడికి మండపంలో ఉన్న వాళ్లందరికీ ఒంట్లో నుంచి పొగలొచ్చేస్తున్నాయి.

పెళ్లి చూద్దామని కూర్చున్న వాళ్ల తలల మీదుగా జోరీగలాగ రొద చేస్తూ ఆ వేడుకని షూట్ చేస్తోంది డ్రోన్ కెమెరా.

వధూవరుల చుట్టూ క్రిక్కిరిసి పోయి, మండపాన్ని అన్ని వైపులా మూసేసిన జనం మధ్య నుంచి పెళ్లిని ప్రత్యక్షంగా చూసే అవకాశం లేకపోయిందని చిరాకుపడుతూ ఎల్.ఇ.డి. స్క్రీన్ల మీదే సిద్ధి, గణేశ్‌ల పెళ్లిని చూస్తున్నారు ఓపికపట్టి పెళ్లికి వచ్చిన పెద్దలు.

“ఒరే బాబూ మేళాలు.. రెడీగా ఉండాలి.. గట్టి మేళం....” పంతులుగారి హెచ్చరిక విని వాద్యాల వాళ్ళు సిద్ధపడుతున్నారు.

పురోహితుడి చేతి నుంచి అందుకున్న తాళిని సిద్ధి మెడలో కట్టబోతున్నాడు గణేశ్.

“అరేయ్ గణేశ్.... లెగు. ఇప్పటికే లేటు.. తొమ్మిది గంటలకల్లా రాంపురంలో ఉండాలి. దుర్ముహూర్తం రాకముందే పిల్లని చూసొద్దాం”. త్వరగా లెగాలి..

“అదేంటి బావా! నేను నీతో వచ్చేస్తే ఈ పెళ్లికూతురు ఏమవ్వాలి?” బావ వైపు కోపంగా చూసాడు గణేశ్.

మే నెల ఎండ చుర్రుమంటోంది. “ఏ పెళ్లి కూతుర్రా సన్నాసీ..” అంటున్నాడు గణేశ్ బావ శ్రీధర్.

“ఏంటీ ఇదంతా కలా! ఎంత మంచి కలో.. ఈ కల నిజమయ్యే రోజు ఎప్పుడొస్తుందో..” బద్ధకంగా ఒళ్ళు విరుచుకుంటూ అనుకున్నాడు గణేశ్.

★ ★ ★ ★

ముఖ్యమైనవాళ్ళంతా రాంపురం వెళ్లి అమ్మాయిని చూసి వచ్చారు. రాంపురం గణేశ్ పెద్దమ్మగారి ఊరు.

గణేశ్ పేరున ఊళ్ళో రెండెకరాల పొలం ఉంది. సంవత్సరం మొత్తం పనిచేసి, రెండు నెల్ల జీతాన్ని ట్యాక్సుగా వెనక్కి కట్టేసే తన బావ శ్రీధర్ లాగా గవర్నమెంటు జాబ్‌చేసే కంటే బిజినెస్ చేసుకోవడమే నయం అనుకున్నాడు గణేశ్. అందుకే, చదివిన బి.టెక్.ని పక్కనపెట్టి ప్రైవేటుగా చిన్న ఉద్యోగం చేస్తున్నాడు.

ఐదారు లక్షల రూపాయలు బయటవాళ్లకి వడ్డీలకి ఇచ్చాడు. సంపాదించుకునే తెలివితేటలు పుష్కలంగా ఉన్నాయి.

అతనికి తన పుట్టింటివైపు బంధువుల సంబంధం కుదిర్చితే తమ బంధుత్వం ఇంకా బలపడుతుందని ఆశపడింది గణేశ్ పెద్దమ్మ.

పెళ్లిచూపులైన రెండు రోజుల తర్వాత వాట్సాప్‌లో రిప్లై వచ్చింది.

“పిల్ల ఇంకా చదువుకుంటాననంటోంది. ఇప్పట్లో పెళ్లి చేయం..” అని ....

అప్పటికే పాతిక సంబంధాలకి వాట్సాప్‌లో వివరాలు పంపి, అమ్మాయిల తల్లిదండ్రులు డిమాండ్ చేసిన క్వాలిటీస్ లేక.. మోస్ట్ రిజెక్టెడ్ లిస్టులోకి ఎక్కేసిన ముప్పయ్యేళ్ల ముదురు బేచిలర్ గణేశ్‌కి రాంపురం వాళ్ళ మాటల్లో నిజం లేదని తెలిగ్గానే అర్థమైంది.

“అబ్బాయి – ఎట్లీస్ట్ సచివాలయం ఉద్యోగం చేసేవాడైనా ఫర్వాలేదు. గవర్నమెంటు ఎంప్లాయ్ అయ్యుండాలి..ట!” అసలు కారణం పెద్దమ్మ చెప్తే తెలిసింది.

వరుడికి గుణం లేకపోయినా ఫర్లేదు సాఫ్ట్వేరో, గవర్నమెంటు జాబో ఉంటే చాలనుకునే పిచ్చి పట్టింది జనాలకి...

నాలుగేళ్ల నుంచి ఒక్క జాబ్ నోటిఫికేషన్ రాలేదు. సాఫ్ట్వేర్ దిగ్గజాలని పేరున్న బడా సంస్థలే ఉద్యోగాలు పీకేసి, ఉద్యోగుల్ని ఇళ్లకి పంపేస్తున్నాయి.

నా చదువు చూసి ఇప్పటికిప్పుడు సాఫ్ట్వేర్ కంపెనీలోనో, గవర్నమెంటు ఆఫీసులోనో నాకెవడు ఉద్యోగం ఇస్తాడు అనుకుని నిట్టూర్చాడు గణేశ్.

జీతం డబ్బులతో అప్పులు తీర్చుకుంటూ, అదృష్టం బాగుండి డీ.ఏ. పెరిగినప్పుడు – ఎర్న్డ్ లీవు కేష్ అయినప్పుడు మాత్రమే చిన్నచిన్న సరదాలు తీర్చుకొనే గవర్నమెంటు జాబు వాళ్ళంటే ఈ జనాలకి ఎందుకింత మోజు!

అయినా... రిటైర్మెంట్ పెన్షన్ లేకుండా పోయిన తర్వాత ఇంకా గవర్నమెంటు జాబుకి వేల్యూ ఏముందో?! అర్థం కాలేదతనికి.

★ ★ ★ ★

“బాబు గురించి, మీ కుటుంబం గురించి అక్క చెప్పిందండీ. ఫోటోలు, జాతకం కూడా పంపించింది.

“26 పాయింట్లు వచ్చాయి.. ఇద్దరికీ బాగుంటది” అన్నారు పంతులుగారు.

"మా పాప గ్రేస్ సచివాలయం పోస్టుల్లో సెలక్టయింది. కాని అందులో గ్రోత్ ఉండదని, గ్రూప్స్‌కి ప్రిపేర్ అవుతోంది. బాబుకి ప్రభుత్వ ఉద్యోగం లేకపోయినా ఫర్లేదు...."

కాని ....

"అబ్బాయి గుడికి వెళ్తాడని...."

ఫోన్‌లో అవతలివైపు నుంచి మాట్లాడుతున్న స్త్రీ గొంతు కాసేపు మూగవోయింది.

"ఆఁ.. వెళ్తాడు. అయితే.." ఆశ్చర్యంగా అడిగాడు శ్రీధర్.

"ఏంలేదు.... మేం దేవుణ్ణి నమ్ముకున్నాం. అబ్బాయి చాలా బాగున్నాడు. మీ సంబంధాన్ని వదులుకోడం ఇష్టం లేక.... గ్రేస్ కూడా ఇప్పటికిప్పుడు పూజలు అలవాటు చేసుకోలేనంటోంది...."

నసిగింది ఫోన్లోని వాయిస్.

"మాలో పెళ్లంటేనే పెద్దపూజ. అసలు సంసార జీవితం మొదలయ్యేది కూడా అలాంటి తంతుతోనే. అది కుదరదంటే ఎలాగ? పెళ్లయితే అదే అలవాటవుతుంది లెండి...మాకేం మతం పట్టింపులు పెద్దగా లేవు. అమ్మాయిని చూసుకోవడానికి ఎపుడు రమ్మంటారు?" అడిగాడు శ్రీధర్.

"అది కాదండి. మా పాపకి పూజలంటే కష్టం.. బాబు కన్వర్ట్ అవుతాడేమోనని.. అతనికెలాగూ ఎంతోకొంత ప్రాపర్టీ ఉంది కనుక.. గవర్నమెంటు ఉద్యోగం చేయకపోయినా ప్రాబ్లం లేదు. జాతకాలు కూడా కలిసాయి.. ఇద్దరికీ ఈడూ జోడూ బాగుంటుంది... మీ వాళ్లకి నచ్చితేనే.. ఏదో ఒక విషయం చెప్పండే...." అటు తిప్పి, ఇటు తిప్పి అసలు పాయింటుకొచ్చింది పిల్లతల్లి.

వాళ్లకి కుర్రాడు నచ్చాడు. కోరి వచ్చిన సంబంధం. కాని .... "సఖా సప్తపదా భవ" అనుకుంటూ అమ్మాయి సప్తపదిని, ఇక్కడి ధర్మాన్నీ పాటించదు. అబ్బాయి మాత్రం ఆమె వెనుక నడిచి వాళ్లు చెప్పినచోట పెళ్లి ప్రమాణాలు చేయాలా! పెళ్లయ్యాక బెండింగ్ కాదు. బెండ్ అయిన తరువాతే పెళ్లన్న మాట! అయ్యో! ఈ సంబంధం కూడా పోయినట్టే అనుకున్నాడు శ్రీధర్ ఫోన్ కట్ చేస్తూ...

★ ★ ★ ★

"పెళ్లి వయసంతా పోతుందంటే నన్నేం చేయమంటారు?"

"ఏమీ చేయొద్దు. వచ్చినప్పుడల్లా రూపాయలు మాత్రం వదుల్చుకోపో." మాటలు బయటికి వినబడుతున్నాయి.

"ఛీ వీళ్లకెప్పుడూ ఈ పెళ్లిగోలే...."లో గొంతుకతో విసుక్కుంటూ ఇంట్లోకి అడుగు పెట్టాడు శ్రీధర్.

ఆ యింటి వైపు చూస్తే ఇంకో మేచ్ వెతకమంటారన్న భయంతో నెల్లాళ్ళుగా తప్పించుకు తిరుగుతున్నాడు శ్రీధర్. ఆరోజు వాళ్ళతో పని ఉండటంతో అక్కడికి రాక తప్పలేదు.

పల్లెల్లో మంత్రసానుల వ్యవస్థ పూర్తిగా పోయినా.. పెళ్లిళ్లు కుదిర్చే పేరమ్మలు మాత్రం ఇంకా అక్కడక్కడా మిగిలి ఉన్నారు.

"మీ కోపాన్నంతా నా మీద చూపిస్తే ఎలాగ? ఈయన అదురుష్టం ఏంటో!

"ఇటు జూస్తే అటు కుదుర్చేసుకునే వారు ఇదివరకు పెళ్లిళ్లు.

"జాతకాలు సూటవ్వకపోతే నేనేం జేయనండీ.." పేరమ్మ నిలదీసింది.

"ప్రోలాడు వాళ్లలాగ, చాగల్నాడు వాళ్లలాగ వెయ్యి కేజీల స్వీటు, ఊరగాయలూ, కోళ్ళు, మేకలూ సారెగా పంపాలని మేం గొంతమ్మ కోర్కెలేం కోరలేదు గదా.."

పేరమ్మ వాక్ప్రవాహానికి అడ్డు తగిలింది గణేశ్ తల్లి.

"మీరు సారెలు అడిగినా.. అడగకపోయినా ఆడపిల్లలేరమ్మా!?

"ఓ పక్కన చదువుకుంటున్న పిల్లల్ని వీధుల్లోను, స్కూళ్ల దగ్గర కుదురుగా ఉండనివ్వటం లేదని.. ఆళ్లతో పడలేక పెద్దమనిషయితే చాలు పెళ్లి చేసేస్తున్నారు మీవోళ్లు.

"ఈయనకి జూస్తే ముప్పయి జొరబడి పోయింది.

"ఆ చదూకునే పిల్లల్లోనే ఎవరో ఒకర్ని ముడెట్టేద్దామంటే.. వయసు తేడా ఎక్కువ. ఈడూజోడూ బాగోదు!

"ఎవరో జ్యోతిష్కుడి మాటలు పట్టుకుని ఫలానా దిక్కు నించి వస్తేనే సంబంధం కలుస్తాదంటారు మీరు! అలా దిక్కుల కేసి చూస్తా యిన్నేళ్లూ కాలం గడిపేసారు.

"సొంత కులాల్లో ఆడపిల్లలకి కరువొచ్చాక పాలెం కమ్మోరూ, పాటి మీది రెడ్లూ కూడా మీవోళ్లనే పెళ్లి చేసుకుంటున్నారు. కొన్నాళ్లకి ఆళ్లలాగే మీరూ బయటి సంబంధాలు చేసుకోవాల్సిందే...."

పేరమ్మకి కడుపు మండినట్టుంది. అనాల్సిన మాటలన్నీ అనేసి బయటికి వెళ్లి పోయింది.

పేరమ్మ అన్న మాటలకి నిర్ఘాంతపోయి అలా చూస్తూ ఉండిపోయింది గణేశ్ తల్లి.

★ ★ ★ ★

వందేళ్ల పంచాంగం, జాతక శిరోమణి, ధర్మసింధు లాంటి పెద్ద పుస్తకాలతో సగం నిండిపోయిన టేబుల్, ఆ వెనుకవైపు రివాల్వింగ్ చెయిర్‌లో ఖరీదైన వేషంలో ఓ మనిషి, అద్దాల కబోర్డులూ, వాటి నిండా ఏవో పుస్తకాలు, విజిటర్స్ కోసం గదిలో వేసిన కుర్చీలు.... "దైవజ్ఞ శ్రీ" ఆఫీసులో కనిపించిన ఏర్పాట్లు చూసి తనేమన్నా కార్పోరేట్ కంపెనీ ఆఫీసులోకి వచ్చానా అనుకున్నాడు శ్రీధర్.

జాతకంలో దోషాలకి పరిహారం చేయిస్తే బాగుంటుందని ఎవరో అనడంతో ఆ రోజు పనుల్ని పక్కన పెట్టి మరీ అక్కడికి వెళ్లాడతను.

ఈ ఆఫీసుకి తగ్గట్టుగానే దైవజ్ఞశ్రీ ఫీజులూ ఉంటాయేమో అనుకుంటూ బ్యాగులో నుండి గణేశ్ జన్మకుండలిని పైకి తీసాడు.

దైవజ్ఞశ్రీని కలిసేందుకు వచ్చిన వారు ఒకొకరుగా కుర్చీలు మారి ముందుకు వెళుతున్నారు.

"వాస్తు కదా.... అర్వణం చూడాలి.... ప్రస్తుతం మీ జన్మనక్షత్రంతో పనిలేదు. రాజేశ్ కదా... య వర్గు – కుబేరస్థానం ఉత్తరం. నార్త్ ఫేసింగ్ ఉన్నది తీసుకోండి...." దైవజ్ఞ శ్రీ సజెషన్...

అంగీకార సూచకంగా తలూపి టేబుల్ పైనున్న పంచాంగంలో ఓ పెద్దనోటు పెట్టి అక్కడినుంచి వెళ్లిపోయాడు ఓ మధ్య వయస్కుడు.

ఆ తర్వాతి వాళ్లలో చాలామంది కాలసర్ప దోషాలు, కుజదోషాలు, అష్టమ శని .. ఇంకా ఏవేవో సమస్యలంటూ వచ్చినవాళ్లే.. భారీగా పరిహారాలు, దానాలు, శాంతులు, దక్షిణలు, ప్రదక్షిణాలు.. చెప్పి, నెక్స్ట్‌అపాయింట్మెంట్ డేట్స్ ఇచ్చి, వాళ్లని పంపేసాడు దైవజ్ఞ శ్రీ.

ఇప్పుడాయన చేతిలో రెండు జాతక చక్రాలున్నాయి! పొంతన సరిపోతేనే మేచింగ్ విషయంలో ముందుకు వెళ్తామని, వచ్చే ముహూర్తాల్లోనే పెళ్లి పెట్టుకుంటామని చెప్పారు ఆయన ముందున్నవాళ్ళు.

ఊఁఉ.... సప్తమం.... బాగుంది కానీ అష్టకూటం..

"16 పాయింట్లే వచ్చాయి.... త్రిజ్యేష్ఠ కూడాను.. పెళ్లి చేయకూడదు!" కాసేపు ఏవో లెక్కలు వేసాక పెదవి విరిచేసాడు దైవజ్ఞశ్రీ.

"మా వాడు జ్యేష్ఠుడు కాడు కదండీ? ఈ అబ్బాయి కంటే ముందు ఒకరు పుట్టి పోయారు...!

లగ్గాలేమో శ్రావణంలో పెట్టుకుందాం అనుకుంటున్నాం.... "ఆయనకి వివరించే ప్రయత్నం చేసింది ఆడమనిషి. ఆమె కాస్త వ్యవహార జ్ఞానం ఉన్న దానిలా కనబడుతోంది.

"అలాగే పెట్టుకోండి.... ఫోండి...." దైవజ్ఞశ్రీ చేతిలోని కాగితాలు మరుక్షణంలో విసురుగా కింద పడ్డాయి .

జనం మెదళ్లలో జాతకాల పిచ్చి ముదిరిపోవడానికి కారణమేంటో అక్కడున్న కాసేపట్లోనే అర్థం అయింది శ్రీధర్‌కి.

''జీవితమంతా బ్రతకాల్సిన ఇంటి విషయంలో నామనక్షత్రాన్ని చూసి, ఆ జీవితాన్ని ఎవరితో పంచుకుంటామో వారిని ఎంచుకోవటంలో మాత్రం జన్మరాశిని చూడాలా? ఇంతకంటే అహేతుకం ఉండదు కదా" అనుకున్నాడు అతడు.

ఇలాంటివాళ్ళు క్రియేట్ చేసినవే కదా "వధూవర గుణమేళన్" యాప్‌లు, వివాహ పొంతన పాయింట్లు ....శాస్త్రం చదవకుండానే శ్రీధర్‌కి తత్త్వం బోధపడింది.

తమ బిడ్డ చేయి అందుకునే కుర్రాడికి సంసారాన్ని గుట్టు చప్పుడు కాకుండా నడుపుకునే స్థితి, మంచి గుణం ఉంటే సరిపోతుందనుకునే మనుషులు, రెండువైపుల కుటుంబాల సంప్రదాయం బాగుంటే చాలనుకుని, మహా అయితే పేరు బలాలు చూపించి, పెళ్లికి ముహూర్తం పెట్టే మనుషులు పోయారు.

అబ్బాయికి లక్షల రూపాయల జీతం వచ్చే ఉద్యోగం లేదని, జాతకాలు నప్పడంలేదని బంగారం లాంటి సంబంధాల్ని కాదను కుంటున్నారు ఇప్పటి తల్లిదండ్రులు. ఇదో వింత సామాజిక పరిణామం.. అనుకున్నాడు.

ప్రభుత్వం మారినప్పుడల్లా జీవితం రకరకాలుగా మారిపోయి, నెల జీతమైనా టైంకి వస్తుందో రాదో తెలియని ప్రభుత్వ ఉద్యోగుల వెనకాల కాపురం చేయడానికి కూడా ఖాళీలేని సాఫ్ట్వేర్ ఇంజినీర్ల వెనకాల కోట్ల విలువ జేసే భూముల్ని, బంగారాన్ని కట్నంగా ముట్టజెపుతామని.... పరుగులు తీస్తున్న తల్లిదండ్రుల అమాయకత్వం గుర్తొచ్చి నవ్వుకున్నాడు.

అవసరమైతే వెయ్యి అబద్ధాలు చెప్పి అయినా ఓ పెళ్లి చేయమని మన పెద్దలు చెప్తే, వేల అపనమ్మకాలు పుట్టించి ఇలాంటి ఎందరో దైవజ్ఞశ్రీలు మొత్తం వ్యవహారాన్ని చెడగొడు తున్నారని అర్థమైంది శ్రీధర్‌కి.

చిన్న చిన్న ఆరోగ్య సమస్యల్ని భూతద్దంలో చూపించి, భయపెట్టి డబ్బులు లాగేసే కార్పోరేట్ ఆసుపత్రుల్లా కనిపించింది దైవజ్ఞశ్రీ ఆఫీసు! బయట ఎదురు చూస్తున్న వాళ్లంతా అతని కళ్ళకి మానసిక రోగుల్లా కనబడ్డారు!

ఐదువందలో వెయ్యో ఫీజు కట్టి, ఓ పనికిమాలిన సలహాని కొనుక్కోకముందే కనువిప్పు కలిగిందనుకుని అక్కడి నుంచి వేగంగా బయటపడ్డాడు శ్రీధర్. ✺

## ముప్పై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

### సంపుటి : 17, సంచిక : 2, సెప్టెంబర్ 1993

**"డంకెల్** దొరగారూ! మీకు శ్రమ దేనికి? అందర్నీ, అన్నిటినీ కట్టి తీసుకొచ్చానుగా!" – అనే పి.వి. డైలాగుతో డంకెల్‌కి వ్యతిరేకంగా అఖిల భారత రైతుకూలీసంఘాల సదస్సు కోసం పంజాబ్‌లో రూపొందించిన పోస్టర్ ముఖచిత్రంగా ఈ సంచిక వెలువడింది. భారత కార్మికవర్గం తన చారిత్రక కర్తవ్యం నెరవేర్చటంలో భాగంగా సెప్టెంబర్'93 నెలాఖరున లక్నో పట్టణంలో మతోన్మాదానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న సదస్సుకు సంఘీభావంగా 'సామ్రాజ్యవాదం – మతోన్మాదం' అనే సంపాదకీయాన్ని రాశారు. డా॥ బాలగోపాల్ ప్రసంగవ్యాసం 'డంకెల్ ముసాయిదా నేపథ్యం'ను, డా॥ కేతవరపు వెంకట్రామయ్య రాసిన 'విశ్వనాటక రంగం – గురజాడ', డా॥ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి రాసిన 'సంకీర్ణ పాత్ర గిరీశం' వ్యాసాలను ప్రచురించారు. "సావిత్రి సాహిత్య జీవితం – సమీక్ష"ను కాత్యాయనీ విద్మహే రాశారు. కాలువ మల్లయ్య రాసిన 'ప్రశ్నించే తరం' కథనూ, ఉత్పల్ దత్‌ను స్మరించుకుంటూ డా॥ ప్రభాత్ రాసిన "సామాజిక స్పృహ గల నటుడు ఉత్పల్‌దత్" వ్యాసాన్నీ ప్రచురించారు. తరతరాల రాయలసీమ – 'కదలిక' పత్రిక కరువు సమస్యల ప్రత్యేక సంచికను "రాయలసీమ సమస్యలపై ఎన్ సైక్లోపీడియా' అంటూ కొత్తపల్లి రవిబాబు పరిచయం చేశారు. 'కవితలు' శీర్షికలో బొప్పల్లి ప్రేమ్‌చంద్ రాసిన "పదును", చల్లా రామఫణి రాసిన "అంకురార్పణ", శీలా వీర్రాజు రాసిన 'నిజాయితీ లేనివాళ్ళం' కవితలను ప్రచురించారు. ఎ. చలపతి రాసిన 'డంకెల్ మాకొద్దురో' పాటనూ, అందుకున్న కొత్త పుస్తకాల శీర్షిక 'స్వీకారం'నూ సి. చంద్రశేఖర్ అజాద్ నిర్వహిస్తున్న 'పిల్లల ప్రపంచం', జనసాహితి కార్యక్రమాల 'చైతన్యవాహిని'ని ప్రచురించారు. రెండవ కవరు పేజీ మీద మిత్ర రాసిన 'మతం మత్తు' పాట, మూడవ కవరు పేజీలో నిశితాసి రాసిన "ఇప్పుడైనా మేలుకో" కవిత, సుంకర రాసిన 'బెంగాల్ కరవు' పాట ప్రచురించారు.

1/8 డెమ్మీలో 76 పుటలు; వెల : రూ.5/– ✺

# చట్ట సవరణలు కావివి... ఆదివాసీల మనుగడనే ప్రశ్నార్థకం చేసే మృత్యు ఘంటికలు!

## ఆదివాసీలను పణంగా పెట్టి, పర్యావరణాన్ని విధ్వంసం చేసి, దేశ సంపదను కార్పోరేట్లకు కట్టబెట్టే చట్ట సవరణలను వ్యతిరేకించండి!

### పోరాడుతున్న ఆదివాసీలకు అండగా నిలుద్దాం! పర్యావరణాన్ని కాపాడుకుందాం!!

*మిత్రులారా!*

భూమండలం వేడెక్కి, పర్యావరణం దెబ్బతిని ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకుంటున్న వర్తమానంలో అడవుల్ని కాపాడుకొని, విస్తీర్ణం పెంచుకోవాల్సిన సమయంలో... సంపూర్ణ రక్షణలతో కఠినమైన అటవీ చట్టాలు ఎంతో అవసరం. అందుకు విరుద్ధంగా కార్పొరేట్లకు మేలు చేసేందుకు లొసుగులతో కూడిన ప్రమాదకరమైన బిల్లులను ఈ వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి, ఆమోదించింది. ప్రజలతో, పర్యావరణంతో ఎలాంటి సంబంధం లేకుండా కార్పొరేట్ శక్తులు అడవినీ, అటవీ సంపదను లూటీ చేసేందుకు వీలుగా మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ చట్ట సవరణలను పరిశీలిస్తే...

**అటవీ సంరక్షణ (సవరణ) చట్టం :**

ఈ సవరణ చట్టం ప్రకారం రైల్వే లైన్లు, జాతీయ రహదారులు, పైపులైన్లు, భద్రతాపరమైన సదుపాయాలు, రక్షణ శిబిరాలు, వైర్‌లెస్ స్టేషన్లు, వంతెనలు, ఎకోటూరిజం, సఫారీ పార్కులు, తదితర ప్రాజెక్టులు నియంత్రణా నిబంధనలు పాటించినవసరం లేదని మినహాయింపు యిచ్చారు. దేశ సరిహద్దు రేఖ నుంచి 100 కి.మీ వరకు ఉన్న భూములను ఎటువంటి ఆంక్షలు లేకుండా కార్పొరేట్లకు బదలాయించవచ్చు. అంటే హిమాలయాలు, ట్రాన్స్ హిమాలయాలు, ఈశాన్య రాష్ట్రాలను లక్ష్యంగా చేసుకొనే ఈ ప్రతిపాదనలు చేశారు. ఇటువంటి ప్రాజెక్టులు చేపట్టేచోట ముందస్తు అనుమతులు ఉండాలని, వినియోగించే అటవీ భూమికి నష్టపరిహారం చెల్లించాలని, ప్రత్యామ్నాయ భూములలో అడవుల పెంపకం చేపట్టాలని గత నిబంధనలు నిర్దేశిస్తున్నాయి. ఈ నిబంధనల కారణంగా భారీ ప్రాజెక్టుల డెవలపర్స్ తమకు కేటాయించిన భూములను పూర్తిగా వినియోగించలేకపోతున్నారని, మౌలిక వసతులను కల్పించలేక పోతున్నారని అందుకే తాము చట్ట సవరణ చేశామని కేంద్ర ప్రభుత్వం చెప్తుంది. ఇప్పటికే 2020లో చేసిన “పర్యావరణ ప్రభావ అంచనా నిబంధనల” నుండి ఈ ప్రాంతాలకు మినహాయింపు ఇచ్చేశారు. అలాగే అటవీ ప్రాంతాలను ఇతర ప్రయోజనాలకు వాడుకోవాలంటే గత నిబంధనల ప్రకారం గ్రామసభ అనుమతి తప్పనిసరి. అటవీ భూముల బదలాయింపు జరగాల్సి వచ్చినప్పుడు ముందుగానే అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం ఆదివాసీలకు దక్కవలసిన ప్రయోజనాలను స్థానిక కలెక్టర్లు సమకూర్చాలి. ఈ సవరణ చట్టంలో ఈ నిబంధనలను తొలగించారు. గ్రామ సభలకు ఉన్న హక్కులను, అటవీ రక్షణ చట్టాలను తుంగలో తొక్కారు.

**గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ చట్టం :**

ఈ సవరణ చట్టం గనులు, ఖనిజాల క్రమబద్ధీకరణను నీరు గారుస్తుంది. వాస్తవానికి ఈ చట్టం పరిధిలో ఖనిజాల అన్వేషణ క్రమం కొన్ని కఠినమైన పరిస్థితుల్లో మినహా తవ్వడం, డ్రిల్లింగ్ చేయడం వంటి విధ్వంసకర చర్యలను నిషేధిస్తుంది. అయితే, సవరణ తీసుకువచ్చిన తర్వాత, ప్రాథమిక సర్వే క్రమంలో గుంటలు, కందకాలు తవ్వడం, డ్రిల్లింగ్ చేయడం, ఉపరితలం పైన తవ్వకాలు వంటివి అనుమతించ బడ్డాయి. అటవీ ప్రాంతాల్లో ఈ తరహా అన్వేషణ ప్రాజెక్టులను ప్రారంభిం చేందుకు ఇకపై అటవీ అనుమతులు తప్పనిసరి కాదు. మన దేశంలో ఖనిజ సంపద పెద్ద మొత్తంలో అటవీ ప్రాంతాల్లో వుందన్నది అందరికీ తెలిసిన విషయమే. ఇలా చట్టాల్లో మార్పులు తీసుకురావడంతో, ఏ కార్పొరేట్ సంస్థ అయినా అటవీ ప్రాంతం లేదా ఆ ప్రాంతంలో నివసించే ప్రజలతో సంబంధం లేకుండా పూర్తిస్థాయి విధ్వంసక అన్వేషణను ప్రారంభించవచ్చు. అలాగే ఈ సవరించిన చట్టం లిథియం, కోబాల్ట్, నికెల్, పొటాష్, తగరం, ఫాస్ఫేట్ వంటి వ్యూహాత్మక ఖనిజాలకు సంబంధించి హక్కులను కేంద్రీకృతం చేసింది. అదనంగా బంగారం, వెండి, రాగి, తదితరాలతో సహా 29 ఖనిజాలకు ప్రత్యేక తవ్వకాల లైసెన్సులను జారీ చేసే అధికారాన్ని కొత్త చట్టం కేంద్ర ప్రభుత్వానికే కట్టబెట్టింది. ఆరు లోహాలు–లిథియం, బెరీలియం, నియోబియం, టైటానియం, టాంటాలమ్, జిర్కోనియమ్‌లను ‘ఆటోమేటిక్ మినరల్స్’ జాబితా నుండి తొలగించారు. వాటి కోసం గనుల తవ్వకాలు, అన్వేషణ చేపట్టేందుకు ప్రయివేటు సంస్థలను అనుమతించారు. ఖనిజాల సగటు అమ్మకం ధర (ఎఎస్పి) లెక్కింపు నుండి వివిధ సుంకాలు, లెవీలను (గనుల వెలుపల ధర) కొత్త చట్ట నిబంధనలు మినహాయిస్తున్నాయి. ప్రయివేటు పెట్టుబడులను ఆకర్షించేందుకు, అలాగే ఈ రోజుల్లో బాగా డిమాండ్ ఉన్న లిథియం వంటి లోహాలతో పాటూ సహజ వనరులను లాభదాయకమైన రీతిలో దోపిడీ చేసేందుకు వీలు కల్పించడమే ఈ కొత్త చట్ట సవరణ ఉద్దేశ్యంగా ఉంది.

**జీవ వైవిధ్య (సవరణ) చట్టం :**

ఈ సవరణ చట్ట ప్రకారం ఆయుష్ ప్రాక్టీషనర్లను చట్టపరిధి

నుండి మినహాయించారు. ఇదంతా కలిసి కార్పోరేట్ ఔషధ సంస్థల ప్రయోజనాలకు అవసరమయ్యే రీతిలో వృక్ష, జంతు జాలాన్ని అడ్డూ అదుపు లేకుండా దోచుకోవడానికి మార్గాన్ని సుగమం చేస్తుంది. అలాగే విదేశీ కంపెనీలు, విదేశీ భాగస్వామ్యం కలిగిన సంస్థలు, విదేశీ పెట్టుబడులు జీవవైవిధ్య వనరులను వినియోగించుకునేందుకు మార్గం సులభతరం చేశారు. జీవవైవిధ్య వనరులను ధ్వంసం చేసే వారికి లక్ష రూపాయల నుంచి రూ. 50 లక్షల వరకు జరిమానా, అయిదేళ్ల వరకు జైలు శిక్ష విధించాలని 2002 నాటి జీవ వైవిధ్య చట్టం చెబుతోంది. కానీ, ప్రస్తుతం జైలు శిక్షను పూర్తిగా తొలగించి, జరిమానాను రూ. 10 లక్షలకు పరిమితం చేశారు.

ఎఫ్ఎస్ఐ 2021 నివేదిక ప్రకారం.. అటవీ ప్రాంతంలో 60 శాతం, దట్టమైన అడవుల్లో 73 శాతం 218 జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిని ఆదివాసీ జిల్లాలుగా వర్గీకరించారు. అవి ఈశాన్య, తూర్పు, మధ్య భారతంలో ఉన్నాయి. ఆ ప్రాంతాలు, భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్ల ద్వారా ప్రత్యేక రక్షిత ప్రాంతాల కింద నమోదయ్యాయి. వాటిలో అనేక జిల్లాలు సంపద్వంతమైన ఖనిజాలు, నీటి వనరులకు కూడా నెలవుగా ఉన్నాయి. అందుకే ఈ జిల్లాల్లో గనులు, విద్యుత్, జలవనరుల ప్రాజెక్టులకు అటవీ భూములు ఎక్కువగా మళ్ళించబడ్డాయి. ఇప్పటికే 10 కోట్ల మంది ఆదివాసులను నేషనల్ పార్కులు, అభయారణ్యాలు, టైగర్ జోన్స్, రిజర్వు ఫారెస్ట్‌ల పేరిట, మైనింగ్ లీజుల పేరిట, సౌర విద్యుత్ జోన్ల పేరిట అడవి నుండి తరిమివేసే చర్యలు మొదలయ్యాయి. ఆదివాసుల జీవితాలతో ఆది నుంచి ఆటలాడుకుంటున్న పాలకులు చట్టాల సవరణ పేరుతో సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా నూతన చట్టాలు తయారు చేయడం ఆదివాసుల మనుగడకే కాదు, పర్యావరణానికి కూడా ప్రమాదమే. ఇప్పటికే అడవిని నరికి వేయడం వల్ల వాతావరణ మార్పులపై తీవ్ర ప్రభావం చూపి గతంలో ఎన్నడు లేనంతగా అకాల వర్షాలు, వరదలు, విపరీతమైన వేడి వంటి వాటితో ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉంది. ఇటువంటి సందర్భంలో విధ్వంసకర అభివృద్ధిని కొనసాగిస్తూ, ఆదివాసీల బ్రతుకుల్ని ఛిద్రం చేస్తూ, వారి జీవన మనుగడనే ప్రశ్నార్థకం చేసే విధానాలను పాలకులు అవలంభిస్తున్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం జాతుల మధ్య, తెగల మధ్య వైరాన్ని పెంచి అలజడి సృష్టించడమే కాకుండా, మణిపూర్ మంటల సాక్షిగా ఇటువంటి విద్రోహకరమైన, ప్రజా వ్యతిరేక బిల్లులను ఆమోదింప చేసుకున్నారు. ఏ ప్రభుత్వాలు చేయని విధంగా ఆదివాసీ బిడ్డను దేశ అత్యున్నత పదవి అలంకరించేలా చేశామని గొప్పలు చెప్తూ యిటువంటి మోసపూరిత విధానాలకు పాలకులు పూనుకుంటున్నారు.

మొత్తం మీద దేశంలోని అడవులు, గనులు, సహజ వనరులను అటవీ మాఫియా, కార్పొరేట్ శక్తులు, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం ఈ వినాశకర చట్ట సవరణలను చేసింది. ఈ చట్ట సవరణల రద్దుకై పోరాడుతున్న ఆదివాసీలకు సంఘీభావంగా నిలవాలని, దేశ సంపదను కాజెయ్యడానికి చూస్తున్న కార్పొరేట్, సామ్రాజ్యవాద శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని, పర్యావరణాన్ని కాపాడుకునేందుకు దేశభక్తియుత విద్యార్థులు, యువకులు నడుం బిగించాలని పిడిఎస్ఓ పిలుపునిస్తుంది.

**ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (PDSO)** ✺

దీర్ఘ కవిత

# రంగు వెలిసిన చిత్రం

– *శీలా సుభద్రాదేవి*

(*గత సంచిక తరువాయి....*)

**కానీ**
నాయకులంతా
ఒక్క విషయం గుర్తుంచుకోక తప్పదు
గుండెలకు సర్జరీలు చేసి
ఎన్ని ఆశల్ని గుప్పించినా
ఎన్నెన్ని పథకాల శుద్ధరక్తాన్ని
నరాలగుండా ఎక్కించుతామన్నా
ఒక్క సిట్టింగ్ డయాలసిస్‌తో
కొత్తతేజస్సు నింపుతామన్నా
రెప్పల్ని ఎత్తి పెట్టి కళ్ళనిండా
కోటికోటి కలల్ని రచించినా
చెవుల్లో జోరీగలై ఝుమ్మంటూ
వేనవేల వాగ్దానాల్ని రెపరెపలాడించినా
హోలు మొత్తంగా
ఓటరుదేవుళ్ళను భుజాలపై ఎత్తుకుని
ఊరూ వాడా ఊరేగించినా
ప్రజలెప్పుడూ వెర్రి వాళ్ళు కానే కారని
గత అనుభవాలు చెప్పకనే చెప్తూనే ఉన్నాయ్
జనం ఆలోచనలు మెదడు పొరల్లో
గుసగుసలాడుతూ కదుల్తూనే ఉంటాయ్
వాళ్ళ ఎంపికలు మనసుపేటికల్లో
భద్రంగా సీలు చేయబడే ఉంటాయ్
ఒకోసారి ఒక ఆశ తాత్కాలిక చలనమై
అలలా హృదయాన్ని తాకినా
ఒక్కక్షణం మనసు సంచలించినా
తొలినిర్ణయం మాత్రం సుస్థిరమే
దాన్ని పెళ్ళగించాలనుకోవటం అజ్ఞానమే
మళ్ళీమళ్ళీ బతుకు చిత్రాన్ని
తెలివిగల ఓటరెప్పుడూ
వెలిసి పోనివ్వడు సుమా
ఇది సత్యం ఇదే నిత్యసత్యం. **(సమాప్తం)** ✺

వ్యాసం

# మహోన్నత తెలంగాణా సాయుధ పోరాట చరిత్రను సెప్టెంబర్ -17కి కుదించాలని చూడటం ఆధునిక పెత్తందారీ లక్షణం

- జె. జె. సంయుక్త

**భారతదేశంలో** వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్న అనేక రైతాంగ పోరాటాల చరిత్రలో వీర తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక స్థానం వుంది. ప్రజల పక్షాన నిలిచే పోరాటశక్తుల కార్యాచరణకు ఇప్పటికీ పనికొచ్చే అనేక గుణపాఠాలు నేర్పిన పోరాటం అది. భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను, సాంస్కృతికోద్యమ పాత్రను చారిత్రక పోరాట అనుభవాల నేపథ్యంలో సమీక్షించేందుకు, శాస్త్రీయంగా పరిశీలించు కునేందుకు, వర్తమానంలో అన్వయించుకునేందుకు కావలసిన అనేక ఉద్యమానుభవాల గని ఈ పోరాటంలో వుంది. దేశంలో, తెలంగాణాలో అన్నిరకాలుగా సంక్షోభం పెరిగేకొద్దీ ఈ పోరాటాన్ని గురించి పాలకవర్గ పార్టీలు రకరకాల చారిత్రక వక్రీకరణలను, కొత్త భాష్యాలను ముందుకు తెస్తున్నాయి. సెప్టెంబర్ -17 అందులో ఒకటి.

ప్రజల జీవించే హక్కును కాలరాచి, వారిని బానిసలుగా చూసి, సహజంగా వారికి చెందాల్సినవేవీ చెందకుండా, అందకుండా అణచివేతకు దోపిడీ, పీడనలకు గురిచేసిన పాలకులు నిజాం పాలకులు. అటువంటి పీడకులపై సుదీర్ఘకాలం నిర్ణయాత్మకంగా సాగినదే తెలంగాణా రైతాంగ పోరాటం. బ్రతకటానికి కావలసిన కనీస అవసరాలు తీర్చుకోలేని దుర్భర స్థితిలోకి నాటి నైజాం నవాబుల పరిపాలన ప్రజలను నెట్టివేసింది. నిజాం దోపిడీ దౌర్జన్యాలకు, గ్రామాలలో అండగా వుంటూ తమ వాటా దోపిడీ సొమ్మును అనుభవిస్తూ ఆధిపత్యం వహించే ఆనాటి జాగీర్దార్లు, భూస్వాముల, దొరల, పటేళ్ల, పట్వారీల పీడన తెలంగాణా ప్రజలపై నిత్యం సాగింది. బలవంతంగా వసూలు చేసిన లెవీలకి, కప్పాలకు, వివిధ రకాల అణచివేతలకు వ్యతిరేకంగా సాగించిన మహోన్నతమైన పోరాటమే వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాటం. పాలక వర్గాలు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా ఊరూరా నేటికీ కనిపించే ఆనాటి అమరుల స్థూపాలు, ప్రజల్లో ఎర్రజెండాపై వున్న ప్రేమ, కొనసాగుతున్న ఎదురుతిరిగే చైతన్యం, ఆనాడు పోరాటంలో నిలిచింది శ్రామిక శక్తులేనని సాక్ష్యం చూపుతాయి. అయినప్పటికీ టీవీలలో, మీడియాలో సెప్టెంబర్ -17 చుట్టూ జరిగే పాలకవర్గ కిరాయి మేధావుల చర్చలు, ప్రకటనలు, రకరకాల అబద్ధపు ప్రచారాలను నిరంతరం ఎదుర్కోవాల్సిందే. పాలక వర్గపార్టీలతో గొంతుకలిపే అమ్ముడుపోయిన రచయితల రచనల్లోని డొల్లతనాన్ని, చారిత్రక అసత్యాల్ని ఎత్తిచూపి, వర్తమానంలో జరుగుతున్న దోపిడీ విధానాలను, పెరుగుతున్న ఆధునిక భూస్వామ్య పెత్తందారీతనాన్ని, సాంస్కృతిక పతన విలువల్ని ఎదుర్కోవాలి. ముఖ్యంగా తెలంగాణాలో ప్రజాసాహితీ సాంస్కృతిక రంగాలు ఈ దిశలో కృషిచేయాలి. ప్రజల మధ్య ఐక్యతను మిగలనీయకుండా చేయడంలో పాలకులందరూ ఒకే తీరులో సాంస్కృతిక ధ్వంసరచన సాగిస్తున్నారు. ప్రజల జీవితంలోని పుట్టుక, చావు, ఆహారం, ఆచారం మాట, ఆట, పాట, విద్య, విజ్ఞానం అన్నింటినీ కులం, మతం పరిధిలోకి కుదించి అత్యంత వికృత స్థితిలోకి దిగజారుస్తున్న పాలకుల క్షీణ సాంస్కృతిక విలువల్ని ఎండగట్టాలి. వీర తెలంగాణా పోరాటంలో ఏం జరిగింది అన్న చారిత్రక వాస్తవాల్ని పదే పదే కొత్త తరాలకు చెప్పుకుంటూ పోవాల్సిందే.

తెలంగాణా పోరాటానికి నాయకత్వం వహించిందీ, ప్రజలను పోరాటాలకు సన్నద్ధం చేసిందీ, నిర్మాణాత్మక కృషి సాగించిందీ నాటి కమ్యూనిస్టుపార్టీ అన్నది అసలైన చరిత్ర. విశాల ప్రజారాసులను పోరాటంలోకి సమీకరించే బాధ్యత ఆంధ్ర మహాసభ ద్వారా కమ్యూనిస్టు పార్టీ చేపట్టింది. ఆవిధంగా 'సంఘం' ప్రజల జీవితాల్లో భాగమై పోయింది. పార్టీ సంఘానికి వెన్నుముకగా నిలిచింది. వివిధ దశలలో రకరకాల పోరాట రూపాలను రూపొందించి ఆంధ్ర మహాసభ ద్వారా ప్రజలలోకి చేర్చే నిశ్చయాత్మక కృషి, ఎన్నో త్యాగాలు కమ్యూనిస్టు కార్యకర్తలు, నాయకులు చేశారు. కుల మతాల విభేదాలతో పోరాట ఐక్యతను దెబ్బతీయాలని అడుగడుగునా పాలకులు చేసిన ప్రయత్నాలను తిప్పికొడుతూ అందర్నీ కలిపి నడిపించే శ్రామికవర్గ చైతన్యంతో కమ్యూనిస్టు పార్టీ సాగించిన అంతర్గత కృషిని ఇప్పటికైనా సరైన తీరులో అంచనా కట్టాలి. ఆ అనుభవాలను ఉద్యమాల నిర్మాణ కృషిలో వినియోగించుకోవాలి. పార్టీ ఆనాటి పోరాట అవసరాలకు తగినట్టుగా నాయకత్వ కొరత ఉన్నచోటుకి అనేక ఇతర ప్రాంతాల నుంచి కార్యకర్తలను రప్పించి ప్రజల మధ్య నిలిపింది. పోరాట విషయాలను, ప్రాపంచిక దృక్పథాన్ని సాహిత్య, సాంస్కృతిక నిర్మాణ విభాగాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల మధ్యకు దేశమంతా చేరుస్తూ, పాలకుల కుట్రలను తెలుసుకొంటూ, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజలను పోరాటాలలోకి నడిపే కృషి చేసింది కమ్యూనిస్టు పార్టీ. ప్రజల మిలిటెన్సీకి అనుగుణంగా పెరుగుతూ వచ్చిన నిరంతర పోరాటాల ఫలితంగా గడీల నుండి జాగీర్దార్లు, వారికి ఊడిగం చేస్తూ వేల ఎకరాల భూములను అనుభవిస్తున్న భూస్వాములు నగరాలకు పలాయనం చిత్తగించారు. వారి కబ్జా కోరల్లో వున్న లక్షలాది ఎకరాల భూములను ఆంధ్ర మహాసభ ప్రజలకు పంచింది.

ఈ కాలంలోనే పోరాటం ప్రపంచ ప్రజలదృష్టిని ఆకర్షించింది. ఈ మహత్తర రైతాంగ పోరాట ఉధృతి దేశమంతా విస్తరించక ముందే నిజాంకి ఏదోఒక దారి చూపించడం కోసమే తన పాలకవర్గ నైజంతో నెహ్రూ ప్రభుత్వం నిజాంపై యుద్ధం ప్రకటించింది. నిజాంని గెలిచే పేరుతో ప్రజల సాయుధ పోరాటాన్ని అణచివేసేందుకు మిలటరీని దించింది. నిజాం కొద్దిరోజుల్లోనే లొంగిపోయినా అప్పటి హోంమంత్రిగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్‌తో సహా భూస్వామ్య వర్గాల రక్షకులంతా పోలీస్ మిలటరీ చర్య పేరుతో విశాల ప్రాంతపు ప్రజల పోరాటాన్ని క్రూరంగా అణిచివేస్తూ అనేక జిల్లాల్లో నిజాంని మించిన క్రూరత్వాన్ని ప్రజలపై చూపించారు. ప్రజలకు పంచిన వేలాది ఎకరాల భూమిని తిరిగి లాక్కొని జమీందార్లకి, భూస్వాములకు మళ్ళీ అప్పజెప్పించిన ఘనచరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిది.

1948 సెప్టెంబర్ 17న నిజాం స్టేట్ భారతదేశంలో అంతర్భాగం అయినట్లు ప్రకటించినా, జమీందారీ రద్దు చట్టం అమలులోకి వచ్చిన 1950 వరకు నిజాం నవాబునే అనధికార పాలకుడిగా, రాజ ప్రముఖుడిగా కొనసాగించారు. దాని తర్వాత కూడా వేల ఎకరాల భూమిపైన యాజమాన్య హక్కులు జమీందార్లకూ, భూస్వాములకు కట్టబెట్టింది నెహ్రూ ప్రభుత్వం. అప్పటినుండి 1950లో జమీందారీ వ్యవస్థ రద్దయినా 1956లో వ్యవసాయ భూమి సీలింగ్ చట్టం వచ్చేవరకూ భూమిపైన హక్కుదార్లుగా జమిందార్లు, భూస్వాములు వ్యవహరించారు. 1956 తర్వాత భూమి మీద హక్కు కోల్పోకుండా బినామీలు పుట్టు కొచ్చారు. 1956 తర్వాత ఈనాటికీ వారి వారసులు ఆ కొందరు భూములపై పెత్తనం చెలాయిస్తూనే ఉన్నారు. తెలంగాణాలో ఇప్పుడు భూతగాదాలన్నీ ఆనాటి పోరాటం ద్వారా అనుభవంలోకి వచ్చిన రైతుల న్యాయమైన హక్కులకు, పాలకులు కాగితాల్లో కల్పించిన అధికారిక హక్కులకు మధ్య జరుగుతున్న తగాదాలే. ఈనాటి ధరణి పోర్టల్ మోసాలకు పునాదులు ఆనాడే వున్నాయి.

ఈనాటికీ భూమి చాలా కీలకమైనదేనని ఒప్పుకుంటున్న భూమి సమస్యను "దున్నే వానిదే భూమి హక్కు" అనే నినాదంతో కష్టజీవుల్లోకి తీసుకువెళ్ళిన కమ్యూనిస్టు నాయకులూ, ఆ పోరాటంలో పాల్గొన్న ప్రజల మధ్య పాలకుల మధ్య స్పష్టమైన వర్గ విభజన రేఖ వుంది. ప్రయోజనాల సంఘర్షణ వుంది. బ్రిటీషు సామ్రాజ్యవాదుల నుంచి, భూస్వామ్యవర్గాల దోపిడీ పీడనల నుంచి ప్రజలను కాపాడుకునే విశాలమైన దేశభక్తియుత కార్యాచరణ, శ్రమజీవుల శాశ్వత విముక్తి మార్గంను కమ్యూనిస్టుపార్టీ ప్రతిపాదించింది. కనుకనే అంతటి నిర్బంధాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కమ్యూనిస్టులని పేరుచెప్పి వందలాదిమందిని కాల్చివేసిన కాలమది. వేలాదిమందిని అనేకరకాలుగా అరెస్టులు చేసి చిత్రహింసలు పెట్టారు. మరొక వైపు తెలంగాణా కమ్యూనిస్టులలోకి ఆలస్యంగా ప్రవేశించిన ధనిక రైతుల అండతో పోరాట విరమణకు దారులు వేయించారు. పార్టీ లోపల నెహ్రూ అనుకూల సంస్కరణవాద మాయాజాలాన్ని సృష్టించి వర్గపోరాటాన్ని పక్కదారిపట్టించే పన్నాగాలను కొనసాగించారు. శత్రువులెవరు? మిత్రవర్గాలేవి అన్న విభజనరేఖను చెరిపి వేసే వర్గ సంకర సంస్కరణవాద రాజకీయాలను ప్రజల్లోకి తెచ్చారు. తెలంగాణాలో అది రకరకాల అవతారాలు ఎత్తిన తీవ్రమైన రాజకీయ సాంస్కృతిక కాలుష్యమే నేడు మనముందున్నది. ఈ కాలుష్యాన్ని తొలగించుకుంటూ, అసలైన పోరాట సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చి ప్రచారంలో పెట్టాలి. అదే నేడు మనముందున్న కర్తవ్యం.

తెలంగాణా ప్రాంతంలో అనేక ప్రాంతాల పీడిత తాడిత ప్రజలు, మేధావులు, చైతన్యవంతమైన అన్నివర్గాల యువత, విద్యార్థులు పాల్గొని సాగించిన ఈ పోరాటాన్ని కొన్ని దశలుగా విభజించుకుని అర్థం చేసుకోవచ్చు. మొదటిది : 1921 నుండి 1947 సెప్టెంబర్ వరకు ఆంధ్ర మహాసభ నాయకత్వంలో ప్రజలను సాంస్కృతికంగా చైతన్యం చేసే కృషిని మొదటి దశగా భావించాలి. ఈ దశలో ప్రజలని చైతన్యపరిచే కృషి వివిధ రూపాల్లో సాగింది. ఇందులో గ్రంధాలయ ఉద్యమం ప్రముఖ మైనది. మరోప్రక్క అన్నిరకాల దోపిడీని వివరిస్తూ సాంస్కృతికంగా ప్రజలను సన్నద్ధం చేసే కృషి సాగించారు. పాటలు, పద్యాలు, నాటికలు, బుర్రకథలు వంటి ప్రజా కళారూపాల ద్వారా అప్పటి స్థితిగతులపై, జాతీయోద్యమంపై ప్రజలలో అవగాహన పెంచారు.

1947 సెప్టెంబర్ నుంచి 1948 సెప్టెంబర్ 17వరకూ సాగిన పోరాటకాలం రెండో దశ. ఈకాలంలో నైజాం ప్రభువుల, జాగీర్దార్ల నిరంకుశ పెత్తనాన్ని, దోపిడీని, హింసను ఎదుర్కొనేందుకు సాగిన పోరాటం. రజాకార్లు నవాబు ప్రభుత్వానికి అనుకూలంగా ఊళ్ళ మీదబడి స్త్రీలపై అత్యాచారాలు చేయటం, యువకులపై అరెస్టులు, దౌర్జన్యాలు, ఊళ్లని ధ్వంసం చేయటం, హత్యలు చేయడం, నెహ్రూ సైన్యంతో కలిసి చేసిన ఆగడాలు లెక్కలేనన్ని. పోలీసు చర్యకు వ్యతిరేకంగా ప్రజల్ని నిలిపేందుకు ఆయుధాలు సమకూర్చడం, వాటిని ఉపయోగించడంలో శిక్షణ ఇవ్వడం, రజాకార్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండి ఆయుధాలను ఉపయోగించే సామర్థ్యాలను ప్రజలకు నేర్పి పార్టీ పోరాటం సాగించిన ఈ దశ రెండోది.

అదే సందర్భంలో ఈ దౌర్జన్యాలన్నీ 'నవాబు'విగా చూపించి హిందువుల రక్షణ పేరుతో ఆర్యమహాసభలో కొందరి చేత నిజాం నవాబు మీద భౌతికంగా దాడిచేయించే పథకాలు అమలుచేశారు. హిందూ హీరోయిజాన్ని కొంత ముందుకు తెచ్చారు. ప్రజలకు సహజంగా దొరలపైన వుండే ఆగ్రహాన్ని నిజాం మతం పైకి మార్చి భూస్వాములకు, జమీందార్లకీ అనుకూలంగా పరిస్థితిని వుంచే ప్రయత్నం చేసింది ఆర్యసమాజం. "బండెనక బండికట్టి" పాటను భీంరెడ్డి దళంలో సభ్యుడు కామ్రేడ్ యాదగిరి, జెన్నారెడ్డి ప్రతాపరెడ్డికి వ్యతిరేకంగా ఆశువుగా కైకట్టాడు. అది నిజాము పైకి క్రమంగా ఎలా మారిందనేది ఇంకా పరిశీలించాల్సినదిగానే ఉండిపోయింది. ఇంకొక వైపు మజ్లిస్ సంస్థ ప్రతి ముస్లింనీ రాజుకు నిజమైన ప్రతినిధిగా చూపి ముస్లింలను నైజాం పాలకులకు అనుకూలంగా ఉండే ప్రయత్నం చేసింది. నాటి ఆంధ్ర మహాసభ నాయకులు ఈ విషయాన్ని గుర్తించి ప్రచారం చేయటంతో పాటు పోరాట చైతన్యాన్ని నింపి సంఘటిత పరచడం వల్ల పీడిత ప్రజల మధ్య విభజన వారు ఊహించనంత సాధ్యపడలేదు. కానీ స్థానిక భూస్వామ్య పెత్తందారీ వర్గాలు ప్రజలు తమపై ఎక్కుబెట్టిన పోరాటపు మొనను నిజాం మీదకు జాగ్రత్తగా మళ్ళించారా అనే ప్రశ్న ఎవరికైనా తలెత్తుతూ వుంటుంది.

తెలంగాణ ప్రజల పోరాటాల్లో ఎన్నడూ భాగస్వామ్యం లేని జనసంఘ్, స్వయం సేవకులతో సహా పాలక పార్టీలన్నీ తెలంగాణాలో జరిగిన ప్రజల పోరాటాలను, త్యాగాలను తక్కువ చేసి చూపేందుకు కాంగ్రెస్ లోపల ఉంటూనే కృషిచేశారు. అప్పుడూ ఇప్పుడూ పాలకులు ఎప్పుడైనా ప్రజలకు నాయకత్వం వహించిన నాయకులపై, వారిని నడిపించిన పార్టీ విధానాలపై చర్చ లేకుండా వ్యక్తుల సాహస కృత్యాలుగా పోరాటాలను చూపిస్తున్నారు. వివిధ సందర్భాలలో నాయకత్వం వహించిన ప్రజల్లోని తెగింపు గలిగిన ఆడ, మగ నాయకులను వారి కులాలకు, మతాలకు పరిమితం చేయ చూస్తున్నారు. తన భూమికోసం తెగించి కొట్లాడిన ఐలమ్మ వంటివారికి విగ్రహాలు నిర్మించి ఆయా కులాల ప్రజలను తమ ఓట్లుగా మార్చుకునేందుకు చూస్తున్నారు. మతాన్ని అగ్రభాగాన నిలిపి, వల్లభాయ్ పటేల్ యొక్క సమగ్ర కార్యాచరణ వల్లనే తెలంగాణాకి 1948 సెప్టెంబర్ 17న ఏడవ నిజాం అయిన మీర్ ఉస్మాన్ ఆలీ ఖాన్ పాలన నుండి, రజాకార్ల క్రూర చర్యల నుండి విమోచన జరిగినట్లు, అందుకే ప్రతీ సంవత్సరం తెలంగాణ విమోచనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని, నేటి తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా విమోచనా దినోత్సవాన్ని జరపాలని బిజెపి తెలంగాణ నాయకులు డిమాండు చేస్తున్నారు.

మరోపక్క కాంగ్రెసు నాయకులు తెలంగాణ విముక్తి దినోత్సవాన్ని ఇప్పటి పాలకులు జరపటం లేదని, తాము అధికారంలోకి వచ్చినప్పటి నుండీ తెలంగాణ విముక్తి దినోత్సవాన్ని అధికారికంగా జరుపుతామని ప్రకటిస్తూనే వున్నారు. అంటే పాలకవర్గం ఇప్పటి తన ప్రయోజనాలను విశాల ప్రజల ప్రయోజనాలుగా చూపుతున్నారు. ఇందుకోసం కవులను, కళాకారులను కోట్లాది రూపాయలు జీతాలిచ్చి పోషిస్తున్నారు. ఈ వాస్తవాలను అర్థం చేసుకోవటానికి తెలంగాణ ప్రజలకు ఎక్కువ కాలం పట్టలేదు. పాలకవర్గం కూడా ఈ విషయాన్ని గ్రహించింది. పోరాటాల పురిటిగడ్డగా మళ్ళీ తెలంగాణను ఇక్కడి కవులూ కళాకారులూ మారుస్తారనే విషయాన్ని గ్రహించిన నేటి నాయకులు వారికి అనేక పదవుల ఆశచూపి నోరు నొక్కే ప్రయత్నంలో వున్నారు. ప్రజలను సాంస్కృతికంగా పోరాటాలకు సన్నద్ధం చెయ్యాల్సిన శక్తులు ప్రజలని వొదిలి పాలక వర్గాలను స్తుతించే పనిలో నిమగ్నమయ్యారు.

అభివృద్ధి ఘనంగా జరుగుతుందని నేటి పాలకులు ప్రచార ఉద్యమాన్ని చేపట్టారు. అసలు అభివృద్ధి అంటే ఏమిటో ఎవరూ చెప్పరు. పెద్ద పెద్ద భవంతులు, వెడల్పాటి రోడ్లు, పెద్ద వంతెనలు, కంపెనీలు, తుమ్మితే ఊడిపోయే సేవారంగ ఉద్యోగ అవకాశాలు కల్పించే సామ్రాజ్యవాద కంపెనీలు చాలానే ఉండచ్చు. అభివృద్ధి అంటే ఇదేనని పాలకులు చేసే ప్రచారాన్ని ముందు ఎదుర్కోవాలి. ఇదేమని ప్రశ్నిస్తే అర్ధరాత్రి తలుపులు తట్టే పోలీస్ యంత్రాంగం ఓ పక్క, ప్రశ్నించే వ్యక్తులు నిశ్శబ్దంగా మాయమయి పోవటం మరోపక్క నిరంతరం జరుగుతూనే వుంది. విద్య, వైద్యం సామాన్య ప్రజలకు అందటం లేదు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు, ఉత్పాదక రంగాలకు అవకాశాలు లేవు.

ప్రశ్నించే గొంతుకలు ఐక్యం కాకుండా నిరంతర పర్యవేక్షణ. యువత రాజకీయాల్లోకి రాకుండా, ఒకవేళ వచ్చినా అధికార మోజులో వుండే పాలకపార్టీలలో వుండాలి తప్ప, ప్రజలను సాంస్కృతికంగా, ఆలోచనాపరులుగా మార్చే ఏ కృషి జరిగినా క్షణాల్లో పాలకులకు వ్యతిరేకంగా జరుగుతున్నట్లుగా భావింపజేసి గొంతు నొక్కివేయటం జరుగుతోంది.

కవులు, కళాకారులూ జరుగుతున్న మోసాన్ని గుర్తెరిగి ప్రచారంలోకి తెచ్చే లోగా వివిధ రకాల విచ్ఛిన్నాలు జరిగిపోతున్నాయి. ప్రజలను శాశ్వతంగా పాలకవర్గాల మీద ఆధారపడే కొనుగోలుదారులుగా, భిక్షకులుగా మార్చజూస్తున్నారు. కులాలవారీగా సమీకరణ తారాస్థాయికి చేరింది. కులాల, ఉపకులాల, ప్రాంతాల స్థానికత పేరుతో తిరోగమన భావజాలం, సంకుచితత్వాన్ని పెంచుతూ పోతున్నారు. ప్రజలను సాంస్కృతికంగా చైతన్యం గాకుండా, అసలైన వికాసం పొందకుండా అణచబడుతున్న తెలంగాణా ఆవిష్కరించబడుతున్నది.

అదే సందర్భంలో పోరాటాల గడ్డ మీద జరుగుతున్న మోసాన్ని గుర్తించిన కొందరు రచయితలు, కళాకారులూ నిరంతరం తమకృషి సాగిస్తూనే వున్నారు. ప్రజలకు వాస్తవాలు చెప్పే ప్రయత్నం నిరంతరం సాగుతూనే ఉంటుంది. తెలంగాణలో వున్న సహజవనరులపై కన్ను వేసిన దోపిడీ శక్తులు ఇక్కడి భూమి, నీరు, పంటలు, అన్నీ సామ్రాజ్యవాదుల కనుసన్నల్లోనే దోపిడీకి గురవుతున్న వాస్తవాలను అక్షరీకరిస్తున్నారు. తెలంగాణ ప్రజల ఆనాటి జీవన విధానాన్ని, పోరాట సాహిత్యాన్ని అర్థం చేసుకోవాలని అనేక రచనలను ఒకచోట చేర్చి వెలువరిస్తూనే ఉన్నారు. ప్రజల కళ్ళకు గంతలు కట్టే పాలకవర్గాల ప్రచారం నుండి ప్రజలని చైతన్య పరిచే సమిష్టి కృషి నిరంతరం సాగిస్తూనే వున్నారు. ఈ కృషి ఇంకా పెద్ద ఎత్తున జరగవలసిన స్థితి, గ్రామ గ్రామాన నిజాలు ప్రచారం చేయవలసిన అవసరం వుంది. ✺



# కృతజ్ఞతలు

**కవుతవరపు సుధాకర్ (46) రెండేళ్ళక్రితం ప్రమాదానికి గురై మెదడుకు సంబంధించిన అనారోగ్యంతో బాధపడుతూ 11-06-2023న మరణించారు. ఆయన తెనాలిలో లాయర్‌గా పనిచేశారు. సుధాకర్ తల్లితండ్రులైన సుశీల, మధుసూదనరావుగార్లు 'ప్రజాసాహితి'కి ఆప్తులు. మధుసూదనరావుగారు సుధాకర్ గుర్తుగా ఈ నెల సంచిక ప్రచురణకై కొంత ఆర్థిక సహాయం అందించారు. వారికి కృతజ్ఞతలు.**

**- ప్రజాసాహితి**

చారిత్రక పత్రం

# "నింగికీ నేలతల్లి ఆప్యాయతకూ వెల కట్టగలమా? మేము మట్టిలోనివాళ్ళం భూమి మాలో భాగం"

## రెడ్ ఇండియన్ల భూమి కొంటానని తెల్ల సైన్యాల అధిపతి ప్రతిపాదించినపుడు రెడ్ ఇండియన్ల నాయకుడు ఇచ్చిన జవాబు ఇది

*ఐరోపా నుంచి 'అమెరికా' వలస వెళ్ళిన వ్యక్తులు స్థానికుల్ని చంపేసి అక్కడి భూములను ఆక్రమించుకున్నారు. **1854లో** 'తెల్ల సైన్యాల ప్రధాన అధిపతి రెడ్ ఇండియన్లకు చెందిన విస్తృత భూములు కొంటానని, వాళ్ళ సంస్కృతిని కాపాడుకునేందుకు అందులో కొంత భాగం కేటాయిస్తానని ప్రతిపాదించాడు. దీనికి రెడ్ ఇండియన్‌ల నాయకుడు, సీటల్, ఇచ్చిన జవాబు పూర్తిపాఠం ఇది. ఆనాటికీ, ఈనాటికీ జీవావరణంపై అందమైన, లోతైన అవగాహన ఉన్న ప్రకటన ఇదే.* - సం॥

**నింగికీ,** నేలతల్లి ఆప్యాయతకూ వెల కట్టగలమా?

ఈ భావమే మాకు వింతగా ఉంది. గాలి ఘుమ ఘుమలు, నీటి తళతళలూ మా సొమ్ము కానప్పుడు వాటిని ఎలా కొంటారు? ఈ భూమిపైన అణువణువూ నా ప్రజలకు ఎంతో పవిత్రమయినది.

మెరిసే ప్రతి ఆకూ, ఇసుక తీరం, కారడవిలోని పొగమంచూ, మైదానంలో ఝుమ్మని పాడే ప్రతి పురుగూ నా ప్రజల అనుభవాల్లో, స్మృతుల్లో పవిత్రమైనవి. చెట్లలో ప్రవహించే జీవజలం రెడ్ ఇండియన్ల జ్ఞాపకాలను మోసుకెళుతుంటుంది.

తెల్లవాళ్ళు చచ్చిపోయి చుక్కల్లో కలిసినప్పుడు తాము పుట్టిన దేశాన్ని మరిచిపోతారు. అందమయిన ఈ పుడమి రెడ్ ఇండియన్లకు తల్లి వంటిది. అందుకే మావాళ్ళు చనిపోయినప్పటికీ ఈ మట్టిని మరిచిపోరు.

మేము మట్టిలోనివాళ్ళం, భూమి మాలో భాగం.

సువాసనలు వెదజల్లే పూలు మా చెల్లెళ్ళు. జింక, గుర్రం, డేగ మా తమ్ముళ్ళు. రాళ్ళ శిఖరాలూ, తోటల్లోని రసాలూ, గుర్రపుపిల్ల శరీర స్వేదం, మనిషీ – అన్నీ ఒకే కుటుంబంలోనివి.

మా భూములను కొంటానని వాషింగ్‌టన్ నుంచి ప్రధాన సైనికాధికారి కబురంపినప్పుడు మా శక్తికి మించింది అడుగుతున్నాడు. మా సుఖ జీవనానికి కొంత భూమిని మాకు కేటాయిస్తానంటున్నాడు.

మా భూమిని కొంటామన్న ప్రతిపాదనను పరిశీలిస్తాం.

అయితే ఇది అంత తేలిక కాదు. ఎందుకంటే ఈ భూమి మాకు ఎంతో పవిత్రమయినది.

ఏటిలోను, నదులలోనూ పారే నీరు ఉత్తి నీరు కాదు. మా పూర్వీకుల రక్తం. మా భూమిని మీకు అమ్మితే ఇది ఎంతో పవిత్రమయినదని మీరు గుర్తుంచుకోవాలి. ఈ భూమి పవిత్రమయినదని, నిశ్చలమైన చెరువు నీటిలో కనిపించే ప్రతి ఒక్క ప్రతిబింబం నా ప్రజల జీవితాలలోని జ్ఞాపకాలను, ఘటనలను చెబుతున్నాయని నేర్పించాలి.

నీటి గలగలలు తాతల గుసగుసలు.

నదులు మా తమ్ముళ్ళు. మా దప్పికను తీరుస్తాయి. మా పడవలను మోసుకెళతాయి, మా పిల్లలకు ఆహారాన్నిస్తాయి. మేము మీకు భూమిని అమ్మితే నదులు మా తమ్ముళ్ళని గుర్తుంచుకోవాలి, మీ పిల్లలకు నేర్పించాలి. వాటిని మీరు కూడా తమ్ముళ్ళుగా భావించి, తమ్ముడిని చూసినట్లు దయతో చూడాలి.

తెల్లవాళ్ళకి మా పద్ధతులు అర్థంకావని మాకు తెలుసు. రాత్రిపూట వచ్చి భూమి నుంచి తనకు కావలసింది తస్కరించుకుపోయే ఆగంతకుడు అతడు. అందుకనే అతనికి ఒక మడి ఎటువంటిదో ఆ పక్క మడి కూడా అటువంటిదే.

భూమి అతనికి సోదరుడు కాదు, శత్రువు. అందుకే దానిని జయించిన తరువాత ముందుకు సాగిపోతాడు.

తన తండ్రి సమాధి వెనుక ఉండిపోయినా అతనికి పట్టదు. తన పిల్లల నుంచి భూమిని దొంగిలిస్తున్నా అతనికి పట్టదు.

తన తండ్రి సమాధినీ, తన పిల్లల జన్మహక్కుని అతను మరిచి పోయాడు. తల్లినీ, భూమినీ, తమ్ముడినీ, ఆకాశాన్నీ కొనగల వస్తువులుగా, దోచుకోదగ్గ వస్తువులుగా చూస్తాడు. గొర్రెల్లానో, అందమైన పూల లాగానో వీటినీ అమ్మవచ్చని అనుకుంటాడు.

అతడి ఆశ భూమిని దిగమింగి ఎడారిని మాత్రం మిగులుస్తుంది.

మా పద్ధతులు మీ పద్ధతులకు భిన్నమయినవి.

మీ పట్టణాలు మా కళ్ళకు వికృతంగా కనపడతాయి. రెడ్ ఇండియన్లు అడవి మనుషులు కావటంవల్ల అర్థం చేసుకోలేకపోతున్నారేమో.

తెల్లవాళ్ళ పట్టణాల్లో నిశ్శబ్ద ప్రదేశం ఒక్కటీ లేదు. వసంతంలో కొత్త చిగురులు విచ్చుకునే శబ్దం, పురుగుల రెక్కల రెపరెపలు మీ పట్టణంలో ఎక్కడా వినపడవు.

నేను అడవి మనిషిని కావటంవల్ల అర్థం చేసుకోలేకపోతున్నానేమో.

పట్టణ రణగొణ ధ్వనులు కర్ణ కఠోరంగా తోస్తాయి. ఒంటరి పిట్టల కూతలనీ, రాత్రుళ్ళు కప్పల సంవాదాన్ని వినలేనప్పుడు మనిషి జీవితంలో ఇంకా ఏమి మిగిలింది? నేను అడవి మనిషిని నాకు ఇంతకు మించి అర్థం కాదు.

చెరువు ముఖం మీద వీస్తూ గాలి చేసే శబ్దం, మధ్యాహ్నం వర్షం పడిన తరువాత గాలి వచ్చే వాసన, పూల పరిమళాల్ని మోసుకొచ్చే గాలి మాకు ఎంతో ఇష్టమయినవి.

పశువు, చెట్టు, మనిషి ఒకే గాలిని పీల్చుకుంటాయి. మనిషి ఇతర జీవజాలంతో ఒకే గాలిని పంచుకుంటాడు. కాబట్టి గాలి మాకు ఎంతో పవిత్రమైనది.

తెల్లవాళ్ళకు తాము పీల్చేగాలి పట్టదు. చావటానికి సిద్ధంగా ఉన్న మనిషిలాగా దుర్వాసన అతనికి పట్టదు.

ఈ భూమిని మీకు అమ్మితే మాత్రం ఈ గాలి మాకు అమూల్యమైనదని, తాను ఊపిరి పోసే సకల ప్రాణికోటి ఆత్మను గాలి కలిగి ఉంటుందనీ మీరు గుర్తుంచుకోవాలి. మా తాతకు మొదటి ఊపిరి పోసిన గాలే అతని చివరిశ్వాసనూ గ్రహించింది.

మేము మా భూమిని అమ్మితే దానిని ప్రత్యేకంగా, పవిత్రంగా ఉంచాలి. పూల వాసనలతో మత్తెక్కిన గాలిని పీల్చుకోవటానికి తెల్లవాళ్ళు కూడా అక్కడికి రావచ్చు.

భూమి కొంటానన్న మీ ప్రతిపాదనను పరిశీలిస్తాం. అమ్మటానికి నిర్ణయించుకుంటే ఒక షరతు మాత్రం విధిస్తాం. ఈ భూమిపైన జంతువులను తెల్లవాళ్ళు తమ తమ్ముళ్ళుగా చూసుకోవాలి.

నేను అడవి మనిషిని నాకు ఇంతకు మించి మరో పద్ధతి తెలియదు.

రైల్లో పోతూ తెల్లవాళ్ళు కాల్చి చంపిన వందలాది గేదెల శవాలు మైదానంలో కుళ్ళిపోతుండటం నేను చూశాను.

గేదెలకన్నా పొగలుకక్కే ఉక్కు గుర్రాలు ఎలా ముఖ్యమయినవో నాకు తెలియదు.

జంతువులు లేకపోతే ఒక మనిషిలో మిగిలేది ఏమిటి? జంతువులన్నీ అంతరించిపోతే మనిషి ఆత్మ ఒంటరిదయి అతనూ చచ్చిపోతాడు.

జంతువుకి పట్టిన గతే అనతికాలంలో మనిషికీ పడుతుంది. అన్నీ ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి.

మీ పిల్లలు నించున్న భూమి మీ తాత ముత్తాతల అస్థికలతో ఏర్పడిందని నేర్పించాలి. మీ బంధువులతో పుడమి సంపన్నమయినదని చెపితే మీ పిల్లలు భూమిని గౌరవించటం నేర్చుకుంటారు.

భూమి మన తల్లి అని మేము మా పిల్లలకు నేర్పినట్లు మీరూ మీ పిల్లలకు నేర్పించండి.

భూమికి పట్టిన గతే సంతతికీ పడుతుంది. జీవజాల వలయాన్ని మనిషి సృష్టించలేదు. దాంట్లో అతను ఒక పోగు మాత్రమే. జీవజాలాన్ని ప్రభావితం చేసే అతని చర్యలు, చివరికి అతన్నీ ప్రభావితం చేస్తాయి.

తెల్లవాళ్ళ దేవుడు అతనితో స్నేహితుడిగా మెలుగుతాడు. అయితే అతను కూడా దీనికి మినహాయింపు కాదు.

అసలు మనందరం సహోదరులు అయి వుంటాం.

అదీ చూద్దాం.

మా దేవుడూ, మీ దేవుడూ ఒకటేనని మాకు తెలుసు. దీనిని తెల్లవాడు ఏదో ఒకరోజు గుర్తిస్తాడు. మా భూమిని సొంతం చేసుకోవాలనుకుంటున్నట్లు, దేవుడు మీ సొంతమని నువ్వు అనుకోవచ్చు. కానీ అది సాధ్యం కాదు. మానవాళికంతటికీ అతను దేవుడు. అందరినీ సమానంగా ప్రేమిస్తాడు.

ఈ భూమి దేవుడికి ఎంతో ఇష్టమయినది. భూమికి హాని చేయటమంటే సృష్టికర్తను అవమానించడంతో సమానం.

బహుశ ఇతర జాతులకన్నా ముందే తెల్లవాళ్ళు అంతరించిపోవచ్చు. నీ పక్కను మలినపరుచుకుంటే, ఒకరోజు నువ్వే ఆ దుర్గంధంలో ఊపిరాడక చచ్చిపోతావు.

దేవుడిచ్చిన శక్తితో మీరు ఇక్కడికి చేరుకోగలిగారు. ఏ ఉద్దేశంతోనో మీకు ఇక్కడి భూమి మీద, ప్రజలమీద ఆధిపత్యాన్ని ఇచ్చాడు. కాబట్టి మీరు అంతరించిపోతూ కూడా గొప్పగా వెలిగిపోతారు.

బర్రెలను ఊచకోత కోసినప్పుడు, గుర్రాలను మచ్చిక చేసినప్పుడు, అడవి మారుమూలలు మనిషి వాసనతో గుప్పుమన్నప్పుడు, కొండలు మాట్లాడే తీగలతో అల్లుకుని ఉన్నప్పుడు మాకు ఏమీ అర్థం కాదు. ఏ గమ్య సిద్ధికోసం ఇదంతా జరుగుతోందో మాకు తెలియటం లేదు.

చెట్ల గుబురులు ఏవీ? పోయాయి.

డేగలు ఏవి? పోయాయి.

జీవితం ముగిసింది. బతుకు పోరాట మొదలయ్యింది.

**– డిసెంబర్ 1991 'ప్రజాసాహితి' నుండి** ✷

కవిత

# జవాబుదారెక్కడ?

– సిహెచ్. రమణాచారి

మణిపూర్‌లో జరుగుతుంది
మారణ హోమం.
జాతుల మధ్యన ఆరని
అదో అగ్ని హోత్రం.
ట్రైబల్ హిల్స్ సంపదపై
కన్నేసిన కా...రే..లకు,
వెనుదన్నుగ నడుపుతున్న
రాజకీయ చాణిక్యం
అదను చూసి ఎగదోసిన
పెను ఆరనిమంట.
ప్రజల మాన హననాలకు
బీభత్సపు మరణాలకు
అంతేలే దిక్కడ.

కంచే చేను మేస్తున్నది
కాపుకు దిక్కెక్కడ?
రగులుతున్న చితిమంటకు జవాబు దారెక్కడ? ✷

## బాప్సీ సిధ్వా నవల

# 'బీటలువారుతున్న భారతదేశం (Cracking India)'

- కొత్తపల్లి రవిబాబు

**బాప్సీ** సిధ్వా పార్శీ జొరాష్ట్రియన్ దంపతులకు బొంబాయి ప్రెసిడెన్సీలోని కరాచీలో 11 అగస్టు 1938లో జన్మించారు. ఆమె కుటుంబం ఆ తర్వాత పంజాబ్ ప్రావెన్స్‌లోని లాహోర్‌లో స్థిరపడింది. ఆమె రెండవ ఏట పోలియో బారినపడ్డారు. దేశ విభజన కాలానికి (1947) ఆమెకు తొమ్మిదేళ్ళు. 1957లో ఆమె లాహోర్ విశ్వవిద్యాలయంలో బి.ఏ. పరీక్షలో ఉత్తీర్ణులయ్యారు. 19వ ఏట వివాహమాడి బొంబాయి వెళ్ళారు. ఐదేళ్ళ తర్వాత విడాకులిచ్చి, లాహోర్‌లో స్థిరపడి ఒక జొరాష్ట్రియన్ - నోషిర్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ముగ్గురు పిల్లలు. సిధ్వా కుటుంబం అమెరికాలోని హూస్టన్‌లో స్థిరపడింది. సిధ్వా అమెరికాలోని ఐదు విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకురాలుగా పనిచేశారు.

దేశ విభజన సృష్టించిన ఉత్పాతాన్ని బాప్సీ సిధ్వా 'ఐస్ కాండీమాన్' అనే నవలలో చిత్రించారు. ఇది 1988లో విడుదలైంది. ఆ నవలే 'క్రాకింగ్ ఇండియా' పేరుతో ఇండియాలో 1991లో ప్రచురింపబడింది. బి.బి.సి. 5-11-2019న విడుదల చేసిన 'బాగా ప్రభావితం చేసిన 100 నవలల' జాబితాలో ఇది ఒకటి. ఈ జాబితాను ఆరుగురు రచయితలు, విమర్శకుల బృందం తయారుచేసింది.

బాప్సీ సిధ్వా మహిళా హక్కుల కార్యకర్త కూడా. లాహోర్‌లో 'నిరుపేద స్త్రీల, బాలల హోమ్'కు కార్యదర్శిగా పనిచేశారు. మహిళల అభివృద్ధి కమిటీలో అప్పటి పాకిస్తాన్ ప్రధాని బెనజీర్ భుట్టోతో పాటు సభ్యురాలు.

సాహితీవేత్తగా ఆమె రాసిన నవలలన్నిటిలోనూ వలస భారత దేశంలో భారతీయుల జీవిత చిత్రణ, దేశ విభజన చరిత్ర, పార్శీ జాతివారి అనుభవాలు మొదలైనవి చూస్తాం. ఈ నవలలో పార్శీ జాతీయుడైన సేథీ కుటుంబంలోని ఎనిమిదేళ్ళ బాలిక లెన్నీ కేంద్రంగా కథ సాగుతుంది. నవలా రచయిత్రి బాల్యంలోనే పోలియో బారిన పడినట్లు లెన్నీ కూడా పోలియో బాధితురాలే. అక్కడక్కడా రచయిత్రి స్వీయ గాథలోని కొన్ని సన్నివేశాలు వున్నా, ఎక్కువభాగం కల్పిత సంఘటనలే నవలలో వున్నాయి. బాప్సీ సిధ్వా 9 ఏళ్ళ బాలికగా, వివిధ మతాలవారు సామరస్యంగా జీవించడమూ, 1947కు కొంచెం ముందూ, ఆ తర్వాత తనకు తెలిసినవారే మత ప్రాదిపదికన చీలిపోవడం, మత కలహాలు, సామాజికమైన ఒడిదుడుకులూ లాహోర్ నగరంలో ప్రత్యక్షంగా చూసారు. వాటిని స్వయంగా ఆ బాల్య దశలో అనుభవించారు. 'హరహర మహదేవ్', 'అల్లాహో అక్బర్', 'సత్‌శ్రీ అకాల్' అనే మత నినాదాలు చేసే గుంపులు లాహోర్ వీధుల్లో, రచయిత్రి నివసించే వారిస్ రోడ్డులో చేసిన అకృత్యాలు, ఇంటి పై అంతస్తులో నుంచి రచయిత్రి ప్రత్యక్షంగా చూసారు. వీరిది పార్శీ కుటుంబం గనుక వీరిపై దాడులు జరగలేదు. నవలలో సందర్భోచితంగా జొరాష్ట్రియన్ మతస్థులైన పార్శీ జాతివారి గురించి వివరాలు ఇచ్చారు. పర్షియా నుండి మన దేశానికి వచ్చిన వీరు ప్రపంచవ్యాప్తంగా 2 లక్షల మంది వుండగా, 70 వేలమంది ఇండియాలోనూ, 1800 మంది పాకిస్తాన్‌లోనూ వున్నారు.

ఈ నవలలోని పాత్రలు కొన్నిటిని ముందు పరిచయం చేసుకుందాం. సేథీ, సేథీ భార్య వీరి పిల్లలు, లెన్నీ (ఈ 9 ఏళ్ళ అమ్మాయి కథ చెబుతుంది). ఆది, ఆమె తమ్ముడు. ఏ పనైనా త్వరగా చేయగలిగే ఎలక్ట్రిక్ అత్త; ఆమె కొడుకు 'కజిన్', రోడా అనే గాడ్ మదర్, ఆమె భర్త; ఆమె చెల్లెలు; 'ఐస్ క్యాండీమాన్; ఇమాందీన్ వంట మనిషి ముస్లిం; ఆయన మనవడు దోస్త్ మహమ్మద్; ముదిమనవడు రాన్నా; చాకులు పదును పెట్టే పఠాన్ షర్బత్ ఖాన్; హరి, తోటమాలి; మోతీ, ముచ్చు. వారి కూతురు పాపూ - ఇల్లు వూడ్చే సేవకుల కుటుంబం; ఆయా (శాంత); హమీదా (కొత్త ఆయా); శంకర్ గీత దంపతులు; రోజీ, పెటీ, వారి సిక్కు తండ్రి, అమెరికన్ తల్లి, ఇన్‌స్పెక్టర్ జనరల్ రోజర్స్, ఆయన భార్య; ఆంగ్లో - ఇండియన్లయిన పెన్ దంపతులు - లెన్నీకి చదివే పనిలో సహాయం చేస్తారు; కల్నల్ బారూచా, వైద్యుడు - పార్శీల నాయకుడు - షేర్‌సింగ్, జూలో ఉద్యోగి మొదలగువారు. వీరిలో అన్ని మతాల వారు వున్నారు. కథాకాలం 1935-1947. 32 అధ్యాయాలుగా వున్న ఈ నవలకు నేపథ్యం వాస్తవ చరిత్ర.

పార్శీ మతస్థులైన సేథీ దంపతుల కూతురు లెన్నీ. ఆమె 2వ ఏటనే పోలియోకు గురౌతుంది. దానికి సర్జరీ చేయించి కట్లు కట్టించి మొత్తం మీద చాలవరకు నయం చేయిస్తారు. అప్పటికి ఆమెకు 9 ఏళ్ళు. అప్పుడే దేశాన్ని రెండు ముక్కలు చేశారు. ఆ విషయంపై పెద్దవాళ్ళు మాట్లాడుకునే మాటలు విని "దేశాన్ని ముక్కలు చేయగలరా ఎవరైనా? అలా ముక్కలు చేస్తే మా ఇల్లు ఎక్కడుంటుంది? మా ఇంటి ముందున్న వారిస్ రోడ్ కూడా ముక్కలైందా!" అనుకుంటుంది. లెన్నీ పోలియో వల్ల నడవలేదు గనుక రెండవ ఏట నుండీ ఆ అమ్మాయి సంరక్షణ చూసుకోడానికి ఒక ఆయాను నియమిస్తారు. ఆ ఆయా పేరు శాంత. ఆమెకు 18 ఏళ్ళు. అందంగా వుంటుంది. నవలంతా ఆమెను ఆయాగానే సంబోధిస్తారు. ఆమె స్వస్థలం అమృతసర్.

ఈ నవల మొదట 1988లో 'ఐస్ క్యాండీమాన్' అనే పేరుతో విడుదలైంది. ఈ ఐసు అమ్మే అతను ముస్లిం. పార్కులోనూ, జూలోనూ, వీధుల్లోనూ కొన్నాళ్ళు ఐసూ, మరికొన్నాళ్ళు వేర్వేరు వస్తువులు అమ్ముతుంటాడు. పిల్లలందరికీ సన్నిహితుడు. అలాగే శాంత సంరక్షణలో వున్న లెన్నీకి కూడా. ఇతడు మతపరమైన అల్లర్ల సమయంలో ముస్లిం గుంపులో చేరి శాంతను బలవంతంగా ఎత్తుకుపోతాడు. కథలో వున్న

ప్రాముఖ్యత బట్టి ఇతని పేరు రచయిత్రి నవలకు పెట్టారు. విభజనకు పూర్వం లాహోర్‌లో ముస్లిములు ఐస్ అంత తీయగా వుండేవారనీ, విభజనానంతరం మత సామరస్యత అదృశ్యమైందనీ, ఈ పాత్ర ద్వారా రచయిత్రి సూచనగా తెలియచేశారు. శాంత పాత్రను రచయిత్రి ఇండియాకు ప్రతీకగా వాడారు.

మత కలహాల చిత్రీకరణేగాక, నవలలో సమకాలీన సామాజిక, రాజకీయ సంఘటనల గురించి పాత్రల ప్రతిస్పందన కూడా రచయిత్రి అందించారు. కాంగ్రెస్‌పార్టీ చేబట్టిన ఉప్పు సత్యాగ్రహం, బ్రిటిష్ వ్యతిరేక పోరాట క్రమంలో రైలు పట్టాలపై స్త్రీల సత్యాగ్రహం, గాంధీ, నెహ్రూ, జిన్నాల అభిప్రాయాలు, సరోజినీ నాయుడు జిన్నా గురించి చేసిన వ్యాఖ్య, జిన్నా వయసుకన్నా 22 ఏళ్ళ పెద్దదైన ఆయన మొదటి భార్య పార్శీ అనీ, ఆమె మరణం గురించీ – ఇలా పలు విషయాల ప్రస్తావన ఈ నవలలో చూస్తాం.

ఒక ముస్లిం తన కూతురు పాలు తాగిన ప్రతిసారీ వాంతులు చేసుకుంటుంటే, డా॥ బరూచా దగ్గరకు చికిత్స కోసం వచ్చి ఆ విషయం చెబుతాడు. అది విన్న డా॥ బరూచా "వాంతులు ఎందుకవుతున్నాయో తెలియని మీవాళ్ళందరికీ పాకిస్తాన్ కావాలి! నీ ఇంట్లో పిల్లలకేం జరుగుతోందో తెలుసుకోలేనివాడివి దేశాన్ని ఎలా పరిపాలిస్తావు?" అని వ్యాఖ్యానిస్తాడు. ఈ డాక్టరే లెన్నీ కాలిపర్స్‌తో నడిచేట్లు చికిత్స చేస్తాడు. ఈ పోలియోని ఇండియాకు బ్రిటిష్‌వాడే తెచ్చాడని విమర్శిస్తాడు. ఈయన లాహోర్‌లోని పార్శీలకు నాయకుడు.

వంట చేసే ఇమాందీన్ గ్రామం పిర్‌పిండో. ఆయన మనవళ్ళనూ, ముది మనవళ్ళనూ చూడటానికి అక్కడకు వెళ్ళినప్పుడల్లా లెన్నీని కూడా తనతో తీసుకువెళ్ళేవాడు. గ్రామాల్లో ఇంకా హిందూ – ముస్లిం, సిక్కు – ముస్లిం తేడాలు రాలేదు. అందరం జాట్‌లం అనుకునేవారు. ఒకసారి వైశాఖీ పండగ సందర్భంగా అలా వెళ్ళిన లెన్నీ అక్కడ అకాలీల ప్రస్తావన వింటుంది. జగజీత్ సింగ్ అనే అకాలీ, పాకిస్తాన్ గనుక వస్తే ముస్లిములతోపాటు జీవించము అని ప్రకటించాడు. అకాలీ నాయకుడు తారాసింగ్ మాత్రం ముస్లిములను భయపడవద్దనీ, ఎక్కడివారక్కడే వుండమనీ, వదంతులు నమ్మవద్దనీ రేడియో ద్వారా ప్రకటించాడు. అప్పటికే ఆ గ్రామం నుంచి పాకిస్తాన్‌కు వెళ్ళదలచే ముస్లిములను మిలటరీవారి ట్రక్కులలోకి ఎక్కిస్తున్నారు. తరతరాలుగా ఇక్కడి వాతావరణంలో, ఇక్కడి రుతువులు, ఇక్కడి సూర్యోదయాలూ, ఇక్కడి ఇళ్ళూ, భూములూ వదలి వెళ్ళడం వారికి దుర్భరమైంది.

బీహార్లో ముస్లిముల ఊచకోత క్రమంగా బెంగాల్‌కు వ్యాపిస్తోంది. వీటికి వ్యతిరేకంగా గాంధీ నిరసన దీక్ష చేపట్టాడు. లాహోర్‌లో ఇన్‌స్పెక్టర్ జనరల్ రోజర్స్‌ను హత్యచేసి, శవాన్ని మురుక్కాలవలో పడేశారు. లెన్నీ ఇంటిప్రక్క వున్న వారిస్ రోడ్డులో ఊరేగింపులు, 'జైహింద్', 'పాకిస్తాన్ జిందాబాద్' నినాదాలతో సాగుతుంటాయి. ముస్లిములు, సిక్కులు ఆయుధాలతో వీధుల్లో తిరుగుతుంటారు.

"ముస్లిం పందులు పాకిస్తాన్ ఎలా తెస్తారో చూస్తాం. చివరి రక్తం బొట్టు వరకు పోరాడుతాం. లాహోరు ఎవరు విడిచి వెళ్తారో చూపిస్తాం" అంటూ హిందువులు, సిక్కులూ, మరోవైపు ముస్లిములు "హిందువుల రక్తంతో ఆడుకుంటాం హోలీ" అంటూ వీరంగం చేస్తున్నారు. తగలబడుతున్న ఢిల్లీగేట్, లాహోరీ గేట్, మోటీ దర్వాజా, గోపాల్ మండీ, మొలాండీ చౌక్ ప్రాంతాలను పిల్లలు దౌలత్‌రాం రెండంతస్తుల మేడపై నుండి చూస్తుంటారు. అప్పటికే దౌలత్‌రాం కుటుంబం ఆ ఇల్లు వదలి పారిపోయింది. అద్దెకుంటున్న శంకర్, గీత దంపతులు కూడా అదృశ్యమయ్యారు.

రాడ్‌క్లిఫ్ కమీషన్ దేశంలో నగరాలను పేకముక్కల్లా పంచి పెట్టింది. లాహోర్, సియాల్‌కోట్ పాకిస్తాన్‌కూ, అమృతసర్, పఠాన్‌కోట్ ఇండియాకు పంచాడు. లెన్నీ ఒక్క క్షణంలో పాకిస్తానీ అయిపోయింది. ఆగస్టు 11, 1947 లెన్నీ 8వ పుట్టినరోజు. వారిస్‌రోడ్‌లోని హిందూ కుటుంబాలవారందరూ మెహతాలు, మల్‌హోత్రాలు, గుప్తాలు వెళ్ళిపోయారు. లెన్నీ కుటుంబంలో రోజువారీ కార్యక్రమాల సరళి మారిపోయింది. క్వీన్స్ గార్డెన్ పార్కుకు వెళ్ళడంలేదు. మల్లయోధుని రెస్టారెంట్ బోసిపోయింది. ఇండియాలోని గురుదాస్‌పూర్ నుండి లాహోర్‌కి వచ్చిన ఒక రైలు నిండా ముస్లిముల శవాలున్నాయి. రెండు గోతాలనిండా కోసేసిన స్త్రీల స్తనాలున్నాయి!

వడ్డీ వ్యాపారి కృపారాం, కుటుంబ సభ్యులను ఢిల్లీ తరలించాడు. చివర్లో 900 బంగారపు నాణేల్ని ఇంటి గోడలో రహస్యంగా తాపడం చేశాడు. 'జూ'లో పనిచేసే షేర్‌సింగ్ చెల్లెలి భర్త అల్లర్లలో చనిపోతాడు. కత్తులు, చాకులు పదునుపెట్టే పఠాన్ షర్బత్ ఖాన్ వ్యాపారం బాగా సాగుతోంది.

తోటమాలి హరి ముస్లింగా మారాడు. సుంతి చేయించుకున్నాడు. హిమత్ ఆలీగా పేరు మార్చుకున్నాడు. మసాజ్ చేసే మాస్సూర్‌ను ఎవరో చంపేసి గోతాంలో కుక్కారు. కొందరు క్రిస్టియన్ మతం పుచ్చుకుని పేర్లు మార్చుకున్నారు. ఆయా (శాంత) అమృతసర్ బంధువుల దగ్గరకు వెళ్ళాలనుకుంటుంది. అప్పట్లో సినీగాయని నూర్జహాన్ పాడే బహుళ జనాదరణ పొందిన పాటలో రెండు చరణాలు ఆనాటి స్థితిని ప్రతిబింబించాయి.

"నా బాల్యమిత్రులారా! మమ్మల్ని మరువకండి!

మారిన ప్రపంచం మిమ్మల్ని చూసి నవ్వకుండా వుండేట్లు చూసుకోండి!"

మూడు నెలల కాలంలో లాహోర్‌కు 7 మిలియన్ల ముస్లిములు వలస వచ్చారు. 5 మిలియన్ల హిందువులు, సిక్కులు లాహోరు వదలి వెళ్ళారు. గతంలో హిందువులు, సిక్కులతో నిండి వుండే బీడన్‌రోడ్ ఇప్పుడు ముస్లిం శరణార్థులతో నిండిపోయింది. షాల్మి, గోవల్‌మండి ప్రాంతంలో కాలిపోయిన దుకాణాలు, ఇళ్ళ నుండి పొగలు వస్తూనే వున్నాయి. మోడల్ టౌన్‌లోని హిందువుల ప్రాసాదాలు తుడిచిపెట్టుకు పోయాయి. ఆ భవనాల్లో మిగిలిన ఖరీదైన వస్తువులను, కిటికీలు, తలుపులను లూటీ చేశారు. రోజీ, పీటర్స్ కాంపౌండ్ లూటీకి గురైంది. అది కలుపు మొక్కలతో నిండి వుంది. హిందూ డాక్టర్ ఇంటిని ముస్లిం కుటుంబం ఆక్రమించింది.

వంటమనిషి ఇమాందీన్ గ్రామం పిర్‌పిండోపైనా, మరో నాలుగు గ్రామాలపై సిక్కులు దాడిచేయగా, ఆ శరణార్థులు లాహోర్‌కు వస్తారు. అక్కడ ముస్లిం స్త్రీలను నగ్నంగా ఊరేగించడం, లైంగిక దాడి చేయడం, వారి శరీర అవయవాలను కోసివేయడం – మసీదులు, ఇళ్ళు తగుల

బెట్టడం లాంటి అత్యాచారాల ఫలితంగా బియాస్‌నది శవాలతో నిండిపోయింది.

ఒకరోజు, ముస్లిం గుంపు ఒకటి లెన్నీ ఇంటిపై దాడిచేస్తుంది. ఇంటి నామ ఫలకంపై శంకర్, సేథీల పేర్లు చూసి దాడి చేస్తారు. శంకర్ కుటుంబం ఖాళీ చేసి పోయిందనీ, సేథీలు పార్శీవారనీ, హిందువులు కాదనీ వంటమనిషి ఇమాందీన్ చెబుతాడు. అయితే తోటమాలి హరి ఎక్కడ అని అడుగుతారు. అతడు మతం మార్చుకుని హిమ్మత్ ఆలీ అయ్యాడని చెబుతాడు. మోతీ అనే ఊడ్చే పని మనిషి గురించి అడగ్గా ఆయన క్రిస్టియన్ మతం పుచ్చుకుని డేవిడ్‌గా మారాడని చెబుతాడు. చివరకు హిందూ స్త్రీ ఆయా (శాంత) ఏదని అడగ్గా ఆమె లాహోర్ వదలి వెళ్ళిపోయిందని చెప్పినా వారు నమ్మరు. ఐస్ క్యాండీమాన్, లెన్నీ దగ్గరకు వచ్చి ఆయాను రక్షిస్తాననీ, ఎక్కడ దాక్కుందో చెప్పమంటాడు. లెన్నీ చెప్పేస్తుంది. డాబామీదనో, గోడౌన్‌లో వుందని. వెంటనే తను చేసిన తప్పు తెలుసుకుని ఆయా అమృతసర్ వెళ్ళిందని అరుస్తుంది. కాని అప్పటికే ఐస్ క్యాండీమాన్, బుచ్చర్‌పైకి వెళ్ళి ఆయా (శాంత)ను పట్టుకొని తమతో బలవంతంగా తీసుకుపోతారు.

ఆయా గురించి అబద్ధం ఆడి, ఆమెను రక్షించలేని తన నిజం చెప్పిన నాలుకను మూడు రోజులపాటు రకరకాలుగా లెన్నీ శిక్షిస్తుంది. లెన్నీ పొరుగున వున్న హిందూ డాక్టరు ఇల్లు శరణార్థులకు ఆశ్రయంగా మార్చారు. హమీదా అనే అమ్మాయిని లెన్నీకి ఆయాగా కొత్తగా నియమించారు. ఇమాందీన్ గ్రామంపై సిక్కులు దాడిచేస్తే, ఆయన ముదిమనవడు రానా ముత్తాత పనిచేస్తున్న లెన్నీ ఇంటికి వస్తాడు. ఆ దాడి సందర్భంగా తన తాత తలను సిక్కులు నరికివేసిన దృశ్యాన్నీ, వారు చేసిన దురాగతాలను తెలియచేస్తాడు. సిక్కులు దాడి చేసినపుడు ఒక గదిలో అందరూ తలుపు లోపల గడి పెట్టుకుని వున్నపుడు పిల్లలు తమ కళ్ళ ఎదురుగుండా మనుషులు చనిపోవడం చూసి ఏడుస్తుంటే వారికి ధైర్యం చెబుతూ ఆ తాత దోస్త్ మహమ్మద్ అంటాడు – "ఏడవకండి! చనిపోవడం అంటే అంత కష్టమైన విషయమేమీ కాదు – తేనెటీగ కుట్టినంత నొప్పి వుంటుంది. అంతే!" రానా కథ అనే శీర్షిక పెట్టి, అతడు అనుభవించిన నరకాన్ని రచయిత్రి చాల వివరంగా పాఠకులకు కన్నీళ్ళు తెప్పించేలా రాశారు.

ఐస్ క్యాండీమాన్ బలవంతంగా అపహరించుకుపోయిన ఆయా (శాంత) లాహోర్‌లోనే ఒకరిద్దరకు సినిమా తారలాగా అలంకరించుకుని జట్కా బండిలో వెళ్తూ కనబడుతుంది. ఐస్ క్యాండీమాన్ ఆమెను మతం మార్చి ముంతాజ్ పేరు పెట్టి పెళ్ళి చేసుకుని, లాహోర్‌లో వేశ్యావాటికలో కాపురం బెడతాడు. ఇది తెలుసుకున్న గాడ్‌మదర్ లెన్నీతోపాటు వెళ్ళి శాంతతో మాట్లాడి వస్తుంది. తన వూరు అమృతసర్‌కు పంపించమని శాంత అడుగుతుంది. అపహరించిన మహిళలను తీసుకుని వచ్చి వారివారి కుటుంబాలకు అప్పచెప్పే సంస్థ ద్వారా శాంతను వేశ్యావాటిక నుండి బయటకు తెస్తారు. ఆమెను శరణార్థి శిబిరానికి పంపి అక్కడి నుండి అమృతసర్ పంపిస్తారు.

ఇంకా చాల వివరాలను, ఉపాఖ్యానాలను దేశ విభజన సమయంలో లాహోర్‌లో జరిగిన వివిధ సంఘటనలు తాను 8వ, 9వ ఏట చూసిన వాటిని లెన్నీ చెబుతుంది. ఇవన్నీ రచయిత్రి బాప్సీ సిధ్వా సొంత అనుభవాలే. ఆమె ప్రత్యక్షంగా చూసినవే. అంటే 9వ ఏటనాటి జ్ఞాపకాలను కొంత కల్పన కలిపి 40 ఏళ్ళ తర్వాత ఈ నవల రాశారు. ఆనాటి దారుణాలను కళ్ళకు కట్టినట్లు ఈ నవల చిత్రించింది.

వచ్చే సంచికలో : **చమన్ నహాల్ నవల 'ఆజాదీ'** ✵

కవిత

# చోటు లేదు

హిందీ : సచ్చిదానంద హీరానంద్ వాత్స్యాయన్ 'అజ్ఞేయ్' **(1911-1987)**

తెలుగు : వెన్నా వల్లభరావు

పట్టణాల్లో విధ్వంసం నెలకొంది
గ్రామాల్లో చోటులేదు
గుండెల్లో ప్రమాదపు శంఖాలు మ్రోగాయి
కాళ్ళకు దురాశపు రెక్కలు మొలిచాయి -

రక్షణ కోసం ఆక్రందనలు, శరణు కోసం అర్రులు
ఆగడంలేదు నడక
కాళ్ళు అలసి సొలసిపోయినా!
కలత చెందిన మనసులో ఒక ప్రశ్న
ప్రతిధ్వనిస్తోంది పదేపదే అదేపనిగా
బతికి బయట పడటం ఎలా?
పరువు ప్రతిష్ఠలు, గౌరవ మర్యాదల ధ్యాసేలేదు
ప్రాణాలు దక్కించుకోవడమే పరమావధి.

– అలహాబాదు, 23 అక్టోబరు

(మత కల్లోలాల మధ్య **1947** అక్టోబరు – నవంబరు నెలల్లో దేశ విభజనపై అజ్ఞేయ్ రాసిన **10** కవితలో ఇదొకటి. - సం॥) ✵

స్పందన-I

# భావి పౌరులైన బడిపిల్లల మెదళ్ళలోకి ఎక్కించబడుతున్న కుల దురహంకార, కుల విద్వేష విషం!

- హరిబాబు

**నాటి** సంఘ సంస్కర్తలయిన జ్యోతిరావుపూలే, ఇ.వి. రామస్వామి పెరియార్, రాజకీయ నాయకులైన మహాత్మాగాంధీ, అంబేద్కర్‌ల నుండి, నేటి దళిత అస్థిత్వవాద ఉద్యమకారుల వరకూ మన భారత సమాజంలో వ్రేళ్ళూనుకుపోయిన అగ్రకులదురహంకార పూరితమైన కులజాడ్యాన్ని అంతరింపజేయాలని, కులవిద్వేష రహిత సమాజాన్ని స్థాపించాలని ఎంతగానో, ఎన్ని రకాలుగానో నిరంతరం కృషి చేశారు. అయినా కులజాడ్యం పురివిప్పుతూ, అట్టడుగు కులాలవారిపై నిరాఘాటంగా పాశవిక హింసా, దౌర్జన్యాలు దేశమంతటా జరుగుతూనే వున్నాయి. ఇవి క్రమక్రమంగా తగ్గుముఖం పట్టి సమాజంలో శాంతి పెంపొందటానికి బదులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మనం చెప్పుకొంటున్న మన 'సభ్య', 'నాగరిక' అత్యాధునిక సమాజపు కపటత్వాన్ని యీ ఘటనలు బట్టబయలు చేస్తున్నాయి.

ఇటీవలనే మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఒక గిరిజనుడిపై, అగ్రకుల దురహంకారి ఒకరు మూత్రం విసర్జించి అవమానపరచటం, అనక ఆ నేరస్థుడిపై 'తక్షణమైన శిక్ష' విధించే రూపంలో, మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఆ నేరస్థుడి యింటిని పాక్షికంగా కూల్చివేసిన సందర్భంగా, ఆ అగ్రకుల నేరస్థుడికి చెందిన కులంవారంతా ఒక సభను నిర్వహించి, అతడికి అన్ని రకాలయిన ఆర్థిక, నైతిక మద్దతునిస్తామని బహిరంగంగానే ప్రకటించిన ఉదంతాన్నీ,

నిన్నటికి నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరిజిల్లాలో నేరస్థుడని అనుమానించిన పోలీసులు ఒక దళిత యువకుడ్ని కస్టడీలోకి తీసుకొని అతడ్ని పాశవికంగా చిత్రహింసలపాలు చేయటమేకాక, దాహంగా వుంది మంచినీళ్ళు యివ్వమని కోరిన ఆ దళిత యువకుడిని మూత్రం త్రాగమని చెప్పిన పోలీసు అధికారి దాష్టికాన్ని సమర్థించి, దానిని మరుగుపరచటానికి పోలీసు పాలనాధికారులు పలు ప్రయత్నాలు చేస్తున్న ఉదంతాన్నీ చూస్తుంటే భవిష్యత్తులో మన సమాజంలో సంభవించబోయే దారుణ పరిణామాలపట్ల భయం వేస్తోంది.

ఈ ఘటనలన్నీ ఒక ఎత్తైతే, ఆగస్టు 9న తమిళనాడు రాష్ట్రంలోని తిరునల్వేలి జిల్లాలోని నంగునేరి పట్నంలో దళిత బడిపిల్లలపై జరిగిన కులహింస దాడి ఘటన హృదయాన్ని కలచివేస్తోంది.

బడిలో తమతోపాటు చదువుకొంటున్న దళిత విద్యార్థులైన అన్నా చెల్లెళ్ళను అనునిత్యం కులవివక్షతాపూర్వకంగా వేధిస్తూండటంతో, ఆ వేధింపుల గురించి ఆ దళిత విద్యార్థులు ఫిర్యాదు చేయగా బడి యజమాన్యం మందలించింది. మందలింపులకు గురైన ఒక మధ్యంతర కులానికి చెందిన (ఒ.బి.సి. కులమైన దేవర్ కులానికి చెందిన) విద్యార్థులు ఆగ్రహం చెంది, నేరుగా ఆ దళిత విద్యార్థుల (అన్నా, చెల్లెళ్ళ) యింటిపైననే దాడిచేసి, వారిని తీవ్రంగా గాయాల పాలుజేశారు. ఈ ఘటనను చూస్తే, మన ప్రస్తుత సమాజంలో భావిపౌరులైన బడిపిల్లల మెదళ్ళలోకి అగ్రకుల దురహంకారపూరిత కులద్వేషపు కుల జాడ్య విషం ఎంతగా ఎక్కించబడుతుందో, భవిష్యత్తులో కూడా కుల సయోధ్యతో కూడిన శాంతియుత సమాజం నెలకొనే అవకాశాలు ఏవిధంగా మృగ్యం చేయబడుతున్నాయో బోధపడుతోంది.

పెరియార్ రామస్వామి బోధించి, తీవ్రంగా ప్రచారం చేసిన ఆర్యేతర, బ్రాహ్మణేతర సమాజ స్థాపనా సిద్ధాంతాల ప్రాతిపదికతో, గత ఐదున్నర దశాబ్దాలుగా 1967 నుండి ప్రభుత్వాధికారాన్ని నెరుపుతున్న ద్రవిడ - తమిళ రాజకీయ పార్టీల పాలనలోనే నాటి కీలవేన్మణి మారణహోమం జరిగింది. నాటినుండీ, నేటివరకూ నిరాఘాటంగా దళితులపై కుల దౌర్జన్యాలు, కులహింసలు జరుగుతూండటాన్ని బట్టి చూస్తే, సమస్య మరింత లోతుగా వుందని అర్థమవుతోంది.

నిరాస్థిపరులుగా చేయబడ్డ భూమిలేని, అధికారంలేని పేదలైన దళిత - అట్టడుగు కులాలవారి ప్రయోజనాలకోసం కాక, వారికి మద్దతుగా కాక ఆస్థిపర వర్గాలైన భూస్వామ్య, పెట్టుబడిదారీ వర్గాలుగా వున్న అగ్రకులాలవారితో సామరస్యంగా ద్రవిడ పార్టీలు (అధికార) మెలుగుతూ వుండటం, నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఆటవిక రూపమైన గ్రామాలను విభజించే లక్ష్మణ రేఖలు గీసే కుల వివక్షాపూరిత ఆచరణలను కొనసాగనీయటం, ఆయా ప్రాంతాల్లో కులజెండాలు ఎగురవేయటం, వివిధ కులాలవారు కుల జెండాల పోస్టర్లను గోడలపై అతికించటం, తమ పార్లమెంటరీ ఓటు రాజకీయ అవసరాలకు అనుగుణంగా రాజకీయ కుల గ్రూపులను సమీకరించటం లాంటి విధానాలు యీ కుల జాడ్యాన్ని, అగ్రకుల దురహంకారపూరిత కులహింసను తగ్గించలేకపోయాయి. అవి మరింతగా పెరిగి, పెచ్చరిల్లేటట్లు చేస్తున్న సామాజిక వాస్తవికతగా యీ పరిణామాన్ని అర్థం చేసుకోవలసి వస్తోంది.

బ్రాహ్మణవాదాన్నీ, మనుధర్మవాదాన్నీ, హిందూమత ఆచారాలను పాటించినట్లే కులజాడ్యాన్ని పాటించే ఆచరణలను వ్యతిరేకిస్తూ, దళిత అస్థిత్వవాద చొరవల పరిధి మేరకే జరపే కృషి చాలదని తెలుస్తుంది. యీ కుల విద్వేష, కుల జాడ్య ఆచరణలను, ధోరణులను సమర్థిస్తూ, అందుకు మద్దతుగా - పునాదిగా దృఢంగా వ్యవస్థాపితమై వున్న ప్రస్తుత భారతదేశపు అర్థఫ్యూడల్ వ్యవస్థను రాజకీయ పాలనాధికార వ్యవస్థనూ వ్యతిరేకించకుండా, యీ కుల అసమాన వ్యవస్థను విధ్వంసం చేయకుండా

కుల విద్వేషరహిత, కులజాడ్యరహిత సమాజాన్ని స్థాపించలేమన్న విషయాన్ని అర్థం చేసుకోవాలని నిరంతరం దేశంలో సాగుతున్న యీ కుల హింసా ఘటనలు హెచ్చరిస్తున్నాయి.

ఎటువంటి కావేష, ద్వేషాలూ, సెంటిమెంట్లూ లేకుండా, సంయమనంతో ఈ దారుణ సమస్యకు మరింత మెరుగైన పరిష్కార మార్గాలను గురించి ఆలోచించాల్సిన అవసరాన్ని కూడా యీ కులహింసా ఘటనలు హెచ్చరిస్తున్నాయి.

కేవలం అగ్రకులాలను నిందించటం, యిటువంటి దారుణ ఘటనలను తీవ్రంగా ఖండించే మేరకే పరిమితమవుతే, ఈ జరిల సమస్యను పరిష్కరించటం సాధ్యంకాదని అర్థమవుతోంది. స్వంత ఆస్తి ఆధారపూరితంగా, స్వంత ఆస్తి రాజకీయ అధికారాల రక్షణే పరమ లక్ష్యంగా వున్న మన ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సామాజిక వ్యవస్థ నిర్మూలన వైపు ఆలోచించాల్సిన తక్షణ అవసరాన్ని యీ దారుణ కులహింసా ఘటనలు హెచ్చరిస్తున్నాయి. ✺

## ప్రజాసాంస్కృతికోద్యమ యోధుడు

# కామ్రేడ్ గద్దర్ మరణానికి జనసాహితి సంతాపం



**గద్దర్** (గదర్ అంటే తిరుగుబాటు అని అర్థం) అనే పేరుతో ప్రజాకళా రంగంలో ప్రాచుర్యం సంపాదించిన వాగ్గేయకారుడు గుమ్మడి విఠల్‌రావు మెదక్‌జిల్లా తూప్రాన్‌లో లచ్చుమ్మ, శేషయ్య దంపతులకు 1949లో జన్మించారు. నిజామాబాద్, హైదరాబాద్‌లలో విద్యాభ్యాసం చేసి 1975 వరకు కెనరా బ్యాంకులో ఉద్యోగం చేశారు. 1975లో ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తికాలం సాంస్కృతిక కార్యకర్తగా వామపక్ష ఉద్యమాలలో కొన్ని దశాబ్దాలపాటు పనిచేశారు. తన 74వ యేట గుండె ఆపరేషన్ చేయించుకుంటూ 06-08-2023 మధ్యాహ్నం హైదరాబాదులో మరణించారు.

తన 50 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ ప్రయాణంలో మిత్రవర్గాలనే కాక శత్రు శిబిరంలోని వారిని కూడా ప్రభావితం చేసిన మన కాలపు కళాకారుడు ఆయన. అరుదైన ఒక ప్రజావాగ్గేయకారునిగా, శ్రామికవర్గం సానుకూలంగా స్వీకరించగల వేషధారణతో, పీడిత, తాడిత ప్రజల హృదయాలను తాకే సాహిత్య కళా, నృత్యప్రక్రియలతో, గాన కౌశలంతో, మాటల తూటాలతో వేలాది ప్రదర్శనలతో, కోట్ల ప్రజానీకాన్ని ఆకట్టుకున్న ఒక ప్రజాకళాకారుడిని తెలుగుజాతి కోల్పోయింది.

ప్రజల నుండి ప్రజలకు అనే కళా సంవిధానానికి కామ్రేడ్ గద్దర్ ఒక నమూనాగా నిలిచారు. తన సుదీర్ఘ ప్రజాఉద్యమ జీవిత కాలపు ప్రతి దశలోనూ, తాను నమ్మిన రాజకీయ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి కామ్రేడ్ గద్దర్ కృషి చేశారు.

జగిత్యాల జైత్రయాత్ర లాంటి వ్యావసాయక విప్లవ పోరాటకాలంలో రైతుకూలీ ప్రజాఉద్యమ కార్యకలాపాలలో, ఒక సాంస్కృతిక సైనికుడిగా మమేకమయ్యారు.

నూతన ప్రజాస్వామిక సాంస్కృతిక ఉద్యమానికి అత్యంత కీలకమైన భావజాలాన్ని ఆయన ప్రజలలోకి తీసుకువెళ్లారు.


భూస్వామ్య వ్యతిరేకమైన ప్రజాస్వామిక సంస్కృతిని, సామ్రాజ్యవాద వ్యతిరేకమైన జాతీయ సంస్కృతిని, తరతరాల మూఢవిశ్వాసాలకు వ్యతిరేకమైన శాస్త్రీయ సంస్కృతిని, మతోన్మాద పూరిత ఫాసిస్ట్ తరహా భావజాలానికి వ్యతిరేకంగా లౌకిక సంస్కృతిని విస్తరింపచేస్తూ, రాజ్యహింసకు వ్యతిరేకంగా ఆయన అలుపెరుగని కృషి సలిపారు. ఒక్క మాటలో, నేటి అర్థవలస అర్థఫ్యూడల్ వ్యవస్థ దోపిడీ పీడనల కాడి కింద అణగారిపోతున్న అశేష శ్రామిక జనావళితో పాటు, వారిలోని దళితుల, ఆదివాసీల, మహిళల విముక్తి కోసం ఆయన సాంస్కృతికోద్యమ కృషి కొనసాగింది.

తన మరణానికి ముందుదాకా ప్రభుత్వాలు మోపిన అనేక పదుల కేసులను, తన వెన్నెముకలో దూరిన తూటాను కామ్రేడ్ గద్దర్ మోస్తూనే ఉన్నాడు. 1997 ఏప్రిల్ 6న కామ్రేడ్ గద్దర్‌ను హత్య చేయడానికి జరిగిన క్రూరదాడిని నిరసిస్తూ రాజ్య హింసకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాపితంగా ప్రజాబందు జరిగింది. నాటినుండి ఎన్నో పార్టీల ప్రభుత్వాలు మారినా, నేటికీ హంతకులెవరో బయట పెట్టని పాలకులు, వారి రాజకీయ పార్టీలు, కామ్రేడ్ గద్దర్‌కు నివాళులర్పించటంలో వారి వారి ప్రయోజనాల కోసం పోటీలుపడ్డారు.

ప్రజా సాంస్కృతిక ఉద్యమ దృక్పథాన్ని పలుచన చేసే కొన్ని ధోరణులకు ఆయా కాలాలలో కామ్రేడ్ గద్దర్ గురైయ్యారు. వాటిపట్ల జనసాహితికి భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. నేటి చారిత్రక అవసరమైన నూతన ప్రజాస్వామిక సంస్కృతిని ముందుకు తీసుకువెళ్లడంలో ఆయన నిర్వహించిన విశిష్ట పాత్రను పరిగణనలో ఉంచుకుని కామ్రేడ్ గద్దర్ మరణానికి జనసాహితి తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తోంది. వారి భార్య విమల, కుమారుడు సూర్యకిరణ్, కుమార్తె వెన్నెలకు సానుభూతిని తెలియచేస్తోంది.


**జనసాహితి, 7-8-2023** ✺

## జాతీయ అక్షరయోధులు



# వైద్యనాథ్ మిశ్రా

**( 1911 - 1998)**



**18**

**సింగంపల్లి అశోక్‌కుమార్**

# నాగార్జున్

## సాహిత్యంలో సామ్యవాద వాస్తవికత దర్శన
## సాంఘిక,రాజకీయ వ్యంగ్య నిశిత విమర్శన
## పద్య,గద్యసేద్యుడు ప్రజారచయిత నాగార్జున్
## సామాజిక విముక్తి ఉద్యమ చైతన్య నిదర్శన

**'స్వాతంత్ర్య వృక్షపు వంగిపోతున్న కొమ్మవు నీవు-**
**ఇంకో పదేళ్లు నీవు బతికుంటే ఈ వృక్షం మరింత ఎండిపోయేది'**
**అంటూ జవహర్‌లాల్ నెహ్రూ మరణంపై రాయడం గొప్పనిర్భీతే కాకుండా అంతకు మించి గొప్పభవిష్యత్ దార్శనికతగా పలువురి ప్రశంసలందుకున్న నాగార్జున్ అసలు పేరు వైద్యనాథ్ మిశ్రా. భారతీయ హిందీ, మైథిలి,బెంగాలీ కవి, రచయిత, వ్యాసకర్త.**

చిన్నతనంలోనే తల్లిని కోల్పోవడం, తండ్రి ఆదరణ కరువు కావడంతో బంధువుల సాయంతో చదువుకుని నేడు సజీవంగాలేని సంస్కృతం, పాళీ, పాకృతం వంటి భాషలలో కూడా ప్రావీణ్యం పొందారు. బౌద్ధ మతం స్వీకరించి నాగార్జునగా పేరు మార్చుకున్నారు.

భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు తర్వాత అనేక సామూహిక మేల్కొలుపు ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1932-49 మధ్య బీహారులో రైతుల ఆందోళనకు నాయకత్వం వహించినందుకు బ్రిటిష్ ప్రభుత్వం నాగార్జున్‌ని అరెస్టు చేసి జైల్లో పెట్టింది.స్వాతంత్ర్యం తరువాత చాలా కాలం ఆయన బెంగాలీ వార్తాపత్రికలలో రాస్తూ జర్నలిజంలో ఉన్నారు.

1936లో లక్నోలో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన జరిగిన అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం తొలి మహాసభల ప్రభావంతో నాగార్జున్ రచనా వ్యాసంగం ప్రారంభించారు.

మార్క్సిస్టు భావజాలంతో లెనినిస్టు అన్వయంతో బలంగా ప్రభావితులయ్యారు. భారత రాజకీయాకాశంలో వసంత మేఘగర్జన నక్సల్‌బరీలో ఉరిమినప్పుడు, భోజ్‌పూర్‌లో రైతాంగ సాయుధ పోరాటం చెలరేగినప్పుడు స్పందించి స్వాగతం పలికారు. పీడిత ప్రజల జీవన్మరణ పోరాటచైతన్యంతో రచనలు చేశారు.సమకాలీన సామాజిక రాజకీయఅంశాలే వీరి కవితావస్తువు.

రైతు ఉద్యమాల అనుభవ నేపథ్యంలో సామ్యవాద వాస్తవికతను శక్తీకరించే నవలలు, చిన్న కథలు, యాత్రాకథనాలు, జీవిత చరిత్రలు రాశారు.'బలచన్మా, రతినాథ్‌కి చాచీ, పత్రాహిన్ నాగ్నాగాచ్, బాదల్ కో ఘిరాతే దేఖాహై, దుఖ్ మోచన' మొదలైనవి నాగార్జున్ అచ్చయిన ప్రసిద్ధ రచనలు. ప్రజాకవిగా గుర్తింపు పొందిన నాగార్జున్ మరో పేరు 'జనకవి'.

ఎమర్జెన్సీకి ముందు జయప్రకాశ్‌నారాయణ్ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. ఆ కారణంగా ఎమర్జెన్సీ కాలంలో11నెలలు జైలుశిక్ష అనుభవించారు. నాగభూషణ్ పట్నాయక్ ఉరిశిక్షపై కవితాగ్రహం ప్రకటించారు. వీరిపై 'ప్రజాసాహితి' ఓ విశిష్ట సంచిక వెలువరించింది.

1969లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు,1983లో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ భారత్ భారతి అవార్డు, 1983 సాహిత్య అకాడమీ ఫెలోషిప్ అందుకున్నారు.

వీరిపై సాహిత్య అకాడమీ మోనోగ్రాఫ్, ఏ.పి.బి.న్యూస్ డాక్యుమెంటరీ వెలువడ్డాయి.

'ఒక విశిష్టమైన రాజకీయ, సాంఘిక, ధార్మిక సాహిత్య వాతావరణం ప్రస్ఫుటమవుతున్న చైతన్యంతో రచయిత ప్రభావం పొందకుండా ఉండలేదు' అని ఉద్ఘాటించిన నాగార్జున్ 1911 జూన్, 30న బీహార్‌లోని దర్భంగా జిల్లా తరౌని గ్రామంలో జన్మించారు. 1998 నవంబరు, 5న స్వగ్రామంలో రక్తలేమితో ఉబ్బసంతో బాధపడుతూ మరణించారు.

కవిత

# మనుషులు కావాలి

– సత్య భాస్కర్

కార్పొరేట్ డైనోసార్ నోట 'హిందుత్వ' మంట
మొన్న గుజరాత్, నేడు మణిపూర్
ఆ మంటల్లో కాలిపోతున్నాయి!

ఇది 'కార్పొరేట్' తరహా పోడు వ్యవసాయం!
నీ కాళ్ళకింద ఖనిజాలున్నాయని తెలుస్తే చాలు
నిన్ను నిలువునా కాల్చేస్తారు!
నీ సాటివాడు నీతోడు రాకుండా
మతం, కులం, ప్రాంతం అంటూ
ఏదో ఒక మంట రగిలిస్తారు!

వాళ్ళ వ్యవసాయానికి
మానవ కళేబరాలే ఎరువు!
ఖనిజ సంపదల కొల్లగొట్టి
అంతస్తులకొద్దీ ఆస్తులుకూడగట్టుకోవడమేవాళ్ళపని!

ఈశాన్యం ఎక్కడో వుందని
వాళ్ళంతా మన వాళ్ళు కాదులే అని
మతిలేని మాటలు విని
పట్టించుకోకుండా వుంటే,
రేపు మన ఆవాసాలూ లేచిపోతాయి
మనంకూడా అలాంటి మంటల్లోనే కాలిపోతాం!

రాబందుల రెక్కల చప్పుడు ఇప్పటికే
మన రాష్ట్రంలోనూ వినబడుతోంది!
హిందుత్వ వైరస్ చాపకింద నీరులా పాకుతోంది!
ఆ డైనోసార్ రాకకోసం రంగం సిద్ధం చేయడుతోంది!
మనం నమ్ముకున్న పాలకులంతా
దానికి దాసోహం అంటున్నారు!

దాని మంటలు మనమీద విరుచుకు పడకముందే
మనమంతా మనుషులుగా ఏకం కావాలి!
మనిషంటే దానికి భయం!మానవత్వమంటే
దానికి వణుకు!ఐకమత్యంతోనే దాన్ని
గ్రహాంతరాలకు తరిమికొట్టగలం!!

అందుకున్నాం

**రక్షాబంధం : చారిత్రక పద్యనాటకం.** రచయిత : **చిట్టిప్రోలు వెంకటరత్నం**

అలెగ్జాండర్, పురుషోత్తముడుల మధ్య జరిగిన యుద్ధాన్నీ, వారిరువురి వ్యక్తిత్వాలను చిత్రిస్తూ చిట్టిప్రోలు కృష్ణమూర్తి 'పురుషోత్తముడు' పేరుతో ఎనిమిది ఖండాల చారిత్రక పద్యకావ్యం రచించారు. దీనికి 2008లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. ఈ కావ్యాన్ని కృష్ణమూర్తిగారి కుమారుడు వెంకటరత్నం పద్యనాటకంగా రూపొందించారు. దీనికి 'రక్షాబంధం' అని పేరు పెట్టారు. అపరిచిత యువతి చేత రక్షాబంధ నిబద్ధుడై ఆమె క్షేమం కోసం త్యాగం చేసిన పురుషోత్తమ చక్రవర్తి గాథ ఈ నాటక ఇతివృత్తం.

తెలుగు నాటకానికి వందేళ్ళ చరిత్ర వుంది. చారిత్రక, పౌరాణిక, సామాజిక ఇతివృత్తాలతో అనువాద, స్వతంత్ర నాటకాలు ఇప్పటికి వేలాదిగా వచ్చాయి. అయితే వీటిలో పద్యనాటకాలలో సుదీర్ఘమైన రాగాలాపనతో పద్యపఠనాన్ని భమిడిపాటి కామేశ్వరరావు తప్పు పట్టారు. ఆ తరువాత వచ్చిన సాంఘిక నాటకాలలో ఈ పద్యాల గొడవ తగ్గింది. ఒకనాడు గ్రామగ్రామాన పౌరాణిక, సాంఘిక నాటకాలు ప్రదర్శించే నాటక బృందాలుండేవి. ఈ నాటకాల పుస్తకాలు ప్రత్యేకించి ప్రచురించిన ప్రచురణ సంస్థలు వుండేవి. ఇప్పుడా ప్రదర్శనలు లేవు. ప్రచురణ సంస్థలూ లేవు. గుడ్డిలో మెల్లగా వివిధ పరిషత్తులు, ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, అజోవిభో సంస్థ నిర్వహిస్తున్న పోటీలలో నాటక ప్రదర్శనలు జరుగుతున్నాయి. కొందరు రచయితలు, అజోవిభో సంస్థ నాటకాలను పుస్తకాలుగా ప్రచురించుతున్నారు. నాటకాలు, నాటికలు ప్రచురిస్తున్న పుస్తక ప్రచురణ సంస్థలు ఈనాడు లేవు.

ఇక 'రక్షాబంధం' నాటకం – చాల చారిత్రాత్మక, పౌరాణిక నాటకాల లాగానే – చదువుకొని ఆనందించాల్సిన గ్రంథం. ప్రపంచాన్నంతా జయించాలన్న దురాశతో తన దాడులలో భాగంగా భారతదేశంపై దండెత్తి రాగా, తన మహోన్నత వ్యక్తిత్వంతో అతనిలో పశ్చాతాపాన్ని కలిగించినవాడు పురుషోత్తముడు.

భారతదేశంపై దండెత్తి వచ్చిన అలెగ్జాండర్‌ను ప్రేమించిన ఇరాన్ రాకుమారి రుక్సానా, భారతీయ సోదరీ సోదరుల అనుబంధాన్ని ఆలంబనగా చేసికొని అలెగ్జాండర్‌ను రక్షించుకోవడం దీని కథావస్తువు. సమరం ప్రారంభం కాబోతున్న తరుణంలో రుక్సానా సమయోచిత ప్రజ్ఞతో పురుషోత్తమునికి రక్షాబంధనం చేసి ఆయనను 'అన్నా!' అని పిలుస్తుంది. ఆ పిలుపుకు కట్టుబడిన పురుషోత్తముడు సమరరంగంలో అలెగ్జాండరు తన చేతికి చిక్కినా అతనిని సంహరించక, భారతీయ సంస్కృతీ వైభవాన్ని వివరించి, రుక్సానాను అతడికి కానుకగా అందిస్తాడు. తను ఇచ్చిన మాటకోసం కన్న కుమారుడు అమరసింహుడు చనిపోయినప్పటికీ చలించని ధీరుడు పురుషోత్తముడు. ఎనిమిది ఖండాల ఈ పద్యకావ్యాన్ని ఏడు అంకాల దృశ్య కావ్యంగా మలచారు వెంకటరత్నం.

ఇంతకుముందే 'అశోకపథం' నాటకాన్ని రచించిన ఈ రచయిత నాటక లక్షణాలన్నిటిని పాటిస్తూ, కొన్నిచోట్ల కథాంశాలకు నేపథ్యగీతాలు ఉపయోగిస్తూ 'రక్షాబంధం' రూపొందించారు.

**('రక్షాబంధం' – చారిత్రక పద్యనాటకం. రచన : చిట్టిప్రోలు వెంకటరత్నం, 1/8 డెమ్మీలో 113 పుటలు. వెల : రూ.165/- ప్రతులకు : 401 మహతిటవర్స్, బరిస్తా హోటల్‌ప్రక్క రోడ్డు, ఇన్నర్‌రింగ్‌రోడ్, గుంటూరు. ఫోన్ : 77023 58616)**

వ్యాసం

# నిండూ అమాస నాడూ... ఆడపిల్ల పుట్టినాదీ.... గద్దర్ పాట వెనక కథ...

– తాడి ప్రకాశ్, లెల్లె సురేశ్

**23** సంవత్సరాల క్రితం...

'విజయవిహారం' పత్రికలో ఓ వ్యాసం రాయడానికి గద్దర్‌ని కలిశాం... నేనూ, గాయకుడూ, కవీ లెల్లె సురేష్ – గద్దర్‌ని ఇంటర్వ్యూ చేశాము. అందులో ఒక పాట గురించి ప్రత్యేకంగా రాశాం. "నిండూ అమాసానాడూ".... అనే పల్లవితో మొదలయ్యే ఆ పాట చాలా పాపులర్.

'జనహర్ష', 'విజయవిహారం' పనులన్నీ చూసే మిత్రుడు దుర్గారెడ్డి గారిని అడిగితే, పాత పేపర్ కటింగ్ పంపించారు. అప్పుడెప్పుడో రాసిన గద్దర్ పాట, దాని వెనక కథ చదవండి.

ఈ మధ్య గద్దర్ అంటే చాలామంది చిరాకుపడుతున్నారు గానీ ఒకనాటి ఒరిజినల్ గద్దర్ – తానొక్కడే ఒక సాంస్కృతిక మహోద్యమం కదా.... ఆర్టిస్ట్ మోహన్, లెల్లె సురేష్, మల్లెల వెంకట్రావ్‌లకి, నాకూ కబుర్లు చెప్పి, పాటలు పాడి.... మాతో గంటలతరబడి గడిపిన అలనాటి ఉత్తేజం గద్దర్‌నీ, ఆయన మనోహరమైన చిరునవ్వునీ తలుచుకుంటూ.. ఈ పాత జ్ఞాపకం. ఇది 2000వ సంవత్సరం మార్చిలో అచ్చయిన వ్యాసం.

కొన్నేళ్ళ క్రితం....

ఉత్తర భారతదేశాన ఓ రాష్ట్రంలో గద్దర్ రహస్య జీవనం గడుపుతున్నాడు. రీసెర్చ్ స్కాలర్ ముసుగులో రోజులు దొర్లిస్తున్నాడు. నాగలితో వ్యవసాయం చేసే తెలంగాణ, ట్రాక్టర్తో వ్యవసాయం చేసే పంజాబ్ – ఇంకా నార్త్, సౌత్ ఇండియాలో ఉత్పాదక పద్ధతుల్లో మార్పులొచ్చినప్పుడు పాట ఎలా మారిందన్న అంశం మీద రీసెర్చ్.... ఇదో సాకు. ఆ అండర్ గ్రౌండ్ రోజుల్లో ఒకనాడు....

ఎప్పట్లాగే ఉదయం రన్నింగ్‌కు వెళ్ళాను. సూర్యోదయం అయింది. రైల్వేట్రాక్ పక్కన పరిగెడుతున్నాను. మూగిన జనం కనిపించారు. అక్కడో చెత్తకుండీ. దాని దగ్గర చింకి గుడ్డల్లో ఏడుస్తూ ఒక పసికందు. బిడ్డను తీసుకెళ్ళేవాళ్ళెవరూ లేరు. నేను మాత్రం ఎలా పెంచగలను? చూస్తున్నాం అందరం. అట్నించో ఆవు వస్తోంది. అందరూ అయ్యయ్యో అనేవాళ్ళే. బిడ్డని తీసినవాళ్ళెవరూ లేరు. లెట్రిన్లు కడిగి, బక్కెట్ పట్టుకుని ఒక పాకీమనిషి అటుగా వస్తోంది. చూడగానే క్యా ఆద్మీ ఇన్ సాన్ హై? అని తిడుతూ పసిబిడ్డని ఎత్తుకుని హృదయానికి హత్తుకుంది. జాకెట్ చించి బిడ్డకి పాలిచ్చింది. నా బిడ్డే అని ప్రకటిచించింది. పక్కనే పోలీసు క్వార్టర్లు వుండడం వల్ల హడావుడి చూసి పోలీసులు వచ్చారు. ఆమెను స్టేషనుకు తీసుకెళ్ళారు. నేనూ వెనుకనే వెళ్ళాను. నువ్వెందుకొచ్చావ్? అన్నారు పోలీసులు. ఆమెకి పిటిషన్ రాయడంలాంటి సహాయమేమన్నా చేయొచ్చని..... ఇంగ్లీషులో మాట్లాడాను. దాంతో వూరుకున్నారు.

నాకు అందరూ ఆడపిల్లలే.... ఇది నా బిడ్డే అని ఆమె చెప్పింది. పోలీసులు ఆమె భర్తను పిలిపించారు. నిజమే మాకు ముగ్గురు ఆడపిల్లలు. నేనెప్పుడో ఆపరేషన్ చేయించుకున్నాను, నాలుగో బిడ్డకు ఆస్కారం లేదని చెప్పాడు. పోలీసులు ఆమెపై కోపంతో ఊగిపోయారు. మరి ఈ ఆడపిల్లెవరు? అని గద్దించారు. మాలో పసిబిడ్డకి ముందు ఎవరు పాలిస్తే వాళ్ళే తల్లి అవుతారు, ఇది నా బిడ్డే అని చెప్పిందామె. నేను కదిలిపోయాను. అయినా ముగ్గురాడపిల్లలున్నారు కదా, ఈ పాపనెలా పెంచుతారు అని అడిగారు? ఏముందీ ముగ్గురు నలుగురు అవుతారు, పెంచుతాం అని ఆమె చెప్పింది. ఎస్సై కన్నీళ్ళు పెట్టుకున్నాడు. కాగితాల మీద భార్యాభర్తలు వేలిముద్రలు వేశారు. కొన్నాళ్ళు పోయాక మళ్ళీ ఈ బిడ్డని వాపసు ఇమ్మని అడగకండి అని ఆమె ప్రాధేయపడింది.

ఆ కథ రెండేళ్ళ తర్వాత గద్దర్ చేతిలో, గొంతులో కన్నీటి పాటై పలికింది. బిడ్డల్ని పారవేసే సంప్రదాయం మనకి లేదు. మరిప్పుడెందుకు పడేస్తూన్నారు? అలా చేస్తున్నది మధ్యతరగతి తల్లా? ధనవంతురాలైన తల్లా? వేశ్యా? కుంతి కర్ణుణ్ణి వదిలేసిన తీరా? కార్మికవర్గంలో ఎంత పేదవాళ్ళయినా ఎవరూ బిడ్డల్ని పడేయరు. పిల్లలు ఆకలితో చనిపోతే చనిపోవచ్చు. అమావాస్యనాడు ఆడపిల్లా, పున్నమినాడు కొడుకూ పుట్టాలంటారు. ఆడపిల్లని లక్ష్మి అని, వరం అనీ ఆనందిస్తారు. అయినా ఎందుకిలా జరుగుతోందంటే, అది పెట్టుబడిదారీ విషసంస్కృతి ఫలితం. బతుకూ, మానవ సంబంధాలూ అమానుషంగా మారే భయానక పరిస్థితి, గాయపడిన కవి గుండె అక్కడ పాటై పల్లవించింది. పాటలో నడక, నీళ్ళు తాగినట్టుండాలి. నెయ్యో, అమృతమో తాగినట్టుండకూడదు. అవి మూతికీ, మీసాలకూ అంటుకుంటాయి. నీళ్ళు అంటవు. గడగడా వెళ్ళిపోతాయి. అదీ ప్రజలపాట గొప్పదనం. అంత సూటిగా, స్వచ్ఛంగా ఒకదానికొకటి లింకుండే గొలుసులాగా జనం పాట హాయిగా సాగిపోతుంది. ప్రజలు.... పనీ, పాటనీ మేళవిస్తారు. నాగలి పట్టడంలో ఒక ఒడుపూ నైపుణ్యం ఉంటాయి. దానితోపాటే పాటా ఉంటుంది.... అన్నారు గద్దర్.

"నిండూ అమాసానాడు ఓ లచ్చా గుమ్మాడీ.... ఆడపిల్లా పుట్టినాదే ఓ లచ్చాగుమ్మాడీ".... ఇలా మొదలవుతుంది గద్దర్ పాట. పల్లవితోనే అది చెవిని పట్టేసుకుంటుంది. "పున్నమిదినము గోలే.... పుట్టకాడ

పడేస్తే".... అని ఓ చరణం. అసలు పుట్టకాడ ఎందుకు పడేస్తారు? తల్లి బిడ్డను చంపలేదు. తన ప్రమేయం లేకుండా చనిపోతే, నింద తనమీదకు రాదు. పుట్ట దగ్గరికి పూజకు ఆడవాళ్ళు వస్తారు. పున్నమినాడు బిడ్డ దొరికిందంటే అది అదృష్టం అనుకుంటారు. నాగమ్మ అనో, నాగయ్య అనో పేరు పెట్టుకుంటారు. ఆ అమ్మకు దేవుడు బిడ్డనిచ్చాడని వూళ్ళో పదిమందీ చెప్పుకుంటారు. కనుక నా బిడ్డ ఎక్కడున్నా పదిలంగా వుంటే చాలు అనుకుని పుట్ట దగ్గర పారేస్తుంది. "ఊపిరాడకుండానేమో బొంత మీద బొంత గప్తే సిల్లీ రంధ్రం నుండీ, పుల్కు పుల్కా నవ్వెనమ్మా".... అంటాడు మరో చరణంలో. మరణం అంచున విషాదంలోనూ జీవితపు మురుపును పట్టుకుంటాడు గద్దర్. కన్నీళ్ళ పర్యంతం చేసే ఒక సన్నివేశాన్ని కవిత్వంగా కూర్చి ఒక సజీవ దృశ్యాన్ని శాశ్వతం చేస్తాడు తన పాటతో.

ఆడదానితో అన్నమూ, మొగాడితో పిల్లలూ అంటారు. ఇద్దరూ అంత ముఖ్యం. అందుకే గద్దర్.... "మగబిడ్డ చెయ్యని నేరం ఆడబిడ్డ లేమి జేసే.... ఆడబిడ్డ లేనిదే లోకమెట్లు పుట్టె" అని అడుగుతాడు. తల్లి సమాధానపడుతుంది. తప్పు చేయనంటుంది. "నేను సెత్తల్లో పారెయ్యనమ్మా, నా పొత్తిల్లో దాసుకుంటా, నేను బావిలో పడెయ్యనమ్మా, నేను బట్టలల్ల చుట్టనమ్మా" అని కన్ ఫెస్ చేస్తుంది. అప్పటిదాకా సమస్యనీ, దాని తీవ్రతనీ, దౌర్భాగ్యాన్నీ, గుండెలు పిండేలా కవిత్వీకరించిన గద్దర్, చివర్లో సాయుధ కవై చెలరేగుతాడు.

చివరికి ప్రాణం దక్కించుకున్న ఆ పసికందుని.... "నిన్ను సమ్మక్కని చేస్తా, సారక్కని చేస్తా.... చెల్లీ కుమారిని చేస్తా, ఝాన్సీని, రుద్రమనూ" చేస్తానంటాడు ఆవేశంగా. సమ్మక్కా, సారక్కలు తెలంగాణ గ్రామీణ దేవతలు. ఝాన్సీ, రుద్రమలు భారత వీరనారీమణులు. మరి శోభక్కా కుమారీ ఎవరు? అని జనం ఆలోచించి, తెల్సుకోగలిగితే గద్దర్ కోరుకున్న ప్రయోజనం నెరవేరినట్టే. భ్రష్టుపట్టిన వ్యవస్థని బదాబదాలు చేయడానికి తుపాకీ పట్టిన విప్లవకారిణులు వాళ్ళిద్దరూ. జనాన్ని చైతన్యవంతం చేసే గొప్ప టెక్నిక్ ఇది.

పండితుడు కాకపోవడం, సిద్ధాంతాలు, విమర్శలు, తర్కం పెద్దగా తెలియకపోవడం గద్దరుకున్న పెద్ద ప్లస్ పాయింట్. గొప్ప భాషలేనోడు, గొప్ప పరిజ్ఞానం లేనోడూ కన్వే చేయడానికి దృశ్యాన్ని ఎంచుకుంటాడు. ఒకడు బాగా పొడుగ్గా ఉంటే వోడుసూడు తాడిచెట్టంత పెరిగాడు అంటారు జనం. చదువుకున్నోడు వాడి హైట్ ఫైవ్ ఎయిట్ అంటాడు.. అని అభినయిస్తూ నవ్వుతూ చెప్తాడు గద్దర్.

గద్దర్ పాటకి జీవాన్నీ, కళనీ, శాశ్వతత్వాన్నీ తెచ్చిపెట్టింది దృశ్యమే. నాలుగేసి పదాలున్న కొన్ని పొట్టి పంక్తుల్లో ఒక 70 ఎం.ఎం. దృశ్యాన్ని కళ్ళకు కడతాడు. బీడీలు చుట్టే బతుకే దరిద్రం. ఆడదీ అయ్యి, బీడీలు చుట్టేది అయితే మరింత హీనం.

ఆ దురదృష్టాన్ని మరో పాటలో గద్దర్ యిలా అంటాడు.... "మొగోల్లనోల్లల్లో.... బీడీలయ్యి కాలిపోయే ఆడోల్లం.... ఆకులన్ని కత్తిరించి, అందులో పొవ్వాకయ్యి, దారంతో కట్టివేసి బీడీ నోరూ మూసేసి ఆకుల్లో బందీలైతము.... లోకానికి దూరమైతము" అని బీడీలా కాలి బూడిదయ్యే ఆ చిన్న బతుకులో బానిసత్వం, అణిచివేత, నిస్సహాయత నిండిన పెను విషాదాన్ని పాటలో పలికించి ఏడిపిస్తాడు. ఎంత రాసినా, పాట రూపం శబ్దం, శబ్దంలో విన్నప్పుడే దాని మజా. అందుకనే పాట కవితకంటే సజీవమైనది. ఎన్ని తాత్విక మెలికలు తిరిగినా కవిత అక్షరాల పొందిక మాత్రమే. పేద తెలంగాణ మట్టి సువాసనకి పుట్టిన మంచికవి గద్దర్.

కవిత్వాన్ని, ఆర్దీ ఎక్స్ నీ కలిపి, కన్నీళ్ళలో తడిపి.... దాన్ని నీ గుండెకింద పెట్టి నీ కళ్ళముందే మీటనొక్కి పాటతో పేల్చేసే సాయుధ గాయకవి గద్దర్.

దళిత గుండె గాయాన్ని, నిద్ర గన్నేరు నిశ్శబ్దాన్నీ ప్రజాయుద్ధ గానంగా, రక్తాశ్రుగీతంగా, అరుణారుణ సంగీతంగా నరాల తీగపై పలికిస్తున్నవాడు గద్దర్. పాట కవిత్వం కాదని అనలేక పెదవి విరుస్తున్నవాళ్ళని చూసి పరిహాసంగా నవ్వుతున్నాడు గద్దర్.

## ఆ పాట

నిండు అమావాసనాడు ఓ లచ్చా గుమ్మాడీ
ఆడపిల్ల పుట్టినాదే ఓ లచ్చా గుమ్మాడీ
అత్త తొంగి సూడలేదు మొగుడూ ముద్దాడలేదు....
బట్టలల్ల సుట్టుకోని– బాయిలో పడేయబోతే
గంగమ్మ కొంగు చాపి సెల్లెదనమియ్యమంది
సెత్త గంపలేసుకుని సెత్త కుండిలెయ్యబోతే
కుక్కపిల్ల అడ్డమొచ్చి.... అక్క అట్ల సేయకనే
ఊపిరాడకుండనేమో బొంతమీద బొంత గప్తె
సిల్లీరంధ్రం నుండి సిన్నంగ చూస్తుంది
పున్నమి దినము గోలె పుట్టకాడ పడవేస్తే
నాగన్న పడిగె విప్పి గొడుగుబట్టిండమ్మ
పురిబోసినట్లు నేను నల్లబూస దారం గడితే
నెల్లపూస దండలాయె మల్లెపూల దండలాయె
పాలుతాగనని నేను పంతాలు పట్టుకొంటె
పాలసేపులు దుంకిపోయె పాపనోట్లె బడ్డదమ్మో
వరిగింజ నోట్లోవోసి గొంతుబిస్కవోతే
పెదువులేమొ అడ్డమొచ్చి పుల్కుపుల్కు నవ్వెనమ్మో
కనుకున్న కడ్పుకోత కన్నీటి దారలాయె
పేగుకోసి పెంచుకున్న నాపాప నెట్లు పారేతూ
ఆడదానితో అన్నమావిరి....మొగోనితో పిల్లలవిరి
మొగబిడ్డ చెయ్యని పాపం ఆడబిడ్డలేమి చేసే
ఆడబిడ్డలేనిదే లోకమెట్లు పుట్టిపెరిగి
కన్న బిడ్డ మీదనే కన్నతల్లె పగబడితె
నాకు దిక్కెవరే బిక్కుబిక్కు ఎడ్చె బిడ్డ
చిట్టి చిట్టి కండ్లతోనె....సూటిప్రశ్న వేసే బిడ్డ
నేను సెత్తల్లో పారెయ్యనమ్మా– నా పొత్తిల్లో దాసుకుంటా
నేను బావిలో పడెయ్యనమ్మా– నేను బట్టలల్ల చుట్టనమ్మా
నేను వొరిగింజ వేసి చంపా....నేను వురిపోసి చంపుకోను
నిన్ను సమ్మక్క చేస్తా..సారక్కను చేస్తా
అక్కా శోభక్కనూ చేస్తా...చెల్లీ కుమారిని చేస్తా.... ✺

కవిత

# ముఖపత్రం

- రఘుపాత్రుని శ్రీనివాసరావు

శ్రమను రెక్కల్లా
తొడుక్కున్న మేము
ఎంతో ఎత్తుకు ఎగరలేం..
పట్టుబడ్డ కోడిపెట్టల్లా
గంపలోనే చిక్కుకుంటాం

మేము ఆరిపోయిన కుంపట్లం
కొడిగట్టిన దీపాలం
వెలుగుతామో లేదో తెలియదు

సంక్షేమం కళ్ళజోళ్ళు తగిలించుకొని
వచ్చీరాని అంకెలు
జేబులో వేసుకొని
అలా నడిచేస్తూ ఉంటాం
ఎంత దూరం వెళ్తామో చెప్పలేం

అభివృద్ధిని గురించి
ఆలోచించే తీరికే మాకు లేదు
మేము, సూర్యుడు ఒకటే
ఆయనది ఏడు చక్రాల బండి
మాది ఏడుపు చక్రాల బండి

మా కడుపులకు రూపాయి
కిలో బియ్యం మూట
ఎప్పుడూ వేలాడుతూ ఉంటుంది
బతుకు పట్ల కంగారు పడే
నిత్య కంగారూలం మేం..

అభివృద్ధి అంటే
మా దృష్టిలో ఆకలి తీరడమే..
ఉత్తుత్తి వాగ్దానాల
చూపుడువేలు అంది పుచ్చుకొని
రోడ్డు మీద జెండాలవుతాం
అందరి ఆశల అజెండాలమవుతాం..

పార్టీల మేనిఫెస్టోల్లో మా ఆకలి
పెద్ద పెద్ద అక్షరాల్లో కనిపిస్తుంది
అక్కడ మేము
రంగురంగుల బట్టలతో
మెరిసిపోతూ దర్శనం ఇస్తాం

ఒక్కసారి ఆ పుస్తకాన్ని మూసేస్తే
ఇగిరిపోయిన రంగుల్లా
వెలిసిపోతాం..
చిరిగిపోయిన కాగితాలమై
ఎగిరిపోతాం..

చెమట పక్షులం మేము..
ఎక్కడ కాసిన్ని గింజలు దొరికితే
తట్టా బుట్టా సర్దుకొని
అక్కడే వాలిపోతాం..
దేశం ముఖపత్రంపై
అమలు కాని హామీలమై
మిగిలిపోతాం.

# ప్రసిద్ధ ఆంగ్లకవి జయంత మహాపాత్ర మరణం

**ఒరిస్సాలోని** కటక్‌కు చెందిన ఒడియా - ఇంగ్లీసు కవితల ప్రసిద్ధ కవి జయంత మహాపాత్ర తన 95వ యేట కటక్‌లో 27-8-2023న మరణించారు. ఆయన కటక్‌లో 22-10-1928న దిగువ మధ్యతరగతి ఒడియా క్రిస్టియన్ కుటుంబంలో జన్మించారు. జయంత మహాపాత్ర బీహార్‌లోని పాట్నా విశ్వవిద్యాలయంలో భౌతికశాస్త్రంలో ఎం.ఎస్‌సి చదివి 1949 నుండి ఫిజిక్స్ అధ్యాపకునిగా సంబల్‌పూర్, భువనేశ్వర్, బాలసోర్, కటక్ ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసి, రీడర్‌గా 1986లో ఉద్యోగ విరమణ చేశారు.

ఆయన తన 38వ ఏట కవిత్వ రచన ప్రారంభించారు. మొదటి కవితాసంపుటి 1971లో ప్రచురించారు. మహాపాత్ర రచించిన 27 కవితాసంపుటాలలో 7 ఒడియా భాషలోవి కాగా, మిగిలిన 20 ఇంగ్లీషు సంపుటాలే. ఇంకా ఆయన ఒక కథల సంపుటి, తన జ్ఞాపకాలు రాశారు. ఒడియా నుండి ఇంగ్లీషులోకి అనువాదాలు చేశారు. 1970లలో మహాపాత్ర 'చంద్రభాగ' అనే సాహిత్య పత్రిక నడిపారు.

ఆయన కవితలలో ప్రధాన వస్తువు మానవ సంబంధాలు. ఆంగ్ల కవితారచన చేసిన మనదేశ రచయితలలో మొదటి ముగ్గురిలో మహాపాత్ర ఒకరు. 1981లో సాహిత్య అకాడమీ అవార్డు, ఇంకా ఎన్నో దేశ, విదేశ అవార్డులందుకున్నారు. 2009లో పద్మశ్రీ పురస్కారం లభించింది. కాని పాలకవర్గాల 'అసహనా'న్ని తప్పు పడుతూ వివిధ రచయితలతో పాటు దానిని తిరిగి ఇచ్చేశారు.

వ్యవస్థలో మార్పు కోరుతూ రాసిన ఆయన రచనల్లో 'ఇండియన్ సమ్మర్', 'హంగర్' డాన్ ఎట్ పూరి కవితలు విశిష్టమైనవి.

## స్పందన-2

# సుప్రీంకోర్టు - "Hand Book of Combating Stereo Types" పై స్పందన

**- ఒ. మనస్విని**

**"ఢిల్లీలో** ఒక మెడికల్ విద్యార్థినిని, నలుగురు దుండగులు అమానుషంగా అత్యాచారం చేసి, చావు బతుకుల మధ్య రోడ్డుపై వదిలేసి పారిపోయారు".

"అయ్యో పాపం! అయినా అంత రాత్రివేళ ఆ అమ్మాయి మాత్రం బయటికి ఎందుకు వెళ్ళాలట? ఆధునిక సంస్కృతి పేరిట జీన్సు ప్యాంటులూ, టీషర్టులూ వేసుకొని బరితెగించి తిరుగుతున్నారు. ఇలా కాక ఇంకెలా జరుగుతుందిలే మరి?".

దేశమంతటా సంచలనం రేపిన నిర్భయ హత్యాచార ఘటనకు దాదాపు అందరి నోటివెంట వచ్చిన మొదటి స్పందన కూడా ఇదే. సాధారణ ప్రజలూ, రాజకీయవేత్తలూ, ఇతరత్రా సెలబ్రిటీలూ ఇలా స్పందించడం అంత ఆశ్చర్యపడాల్సిన విషయం కాదుగానీ, న్యాయ వ్యవస్థలో భాగం అయిన జడ్జిలూ, న్యాయవాదులూ సైతం ఇటువంటి అభిప్రాయాలు వ్యక్తం చేయడాన్ని "ఇండియాస్ డాటర్" డాక్యుమెంటరీలో చూశాం. ఒక నిర్భయ సంఘటన మాత్రమే కాదు, అంతకు ముందు జరిగిన, ఆ తర్వాత జరుగుతూ వస్తున్న ఎన్నో నేరాల విషయంలో దాడికి పాల్పడటం ఒక నిందితుల తప్పు మాత్రమే కాదనీ, దాడికి గురయిన మహిళల పాత్ర కూడా ఎంతో కొంత ఉంటుందనే పురుషాధిపత్య వ్యవస్థ గీసిన గీతల్లో ఇమడని మహిళలంతా దాడులకు గురవడం సహజమేనని ఇటువంటి "మాటలు" చెప్తున్నాయి.

పురుషాధిపత్య, భూస్వామ్య భావజాలానికి అనుగుణంగా "అణుకువగా" ఉండకపోవడం, తమపై జరిగే దాడులను స్వాగతించడమే అనేటువంటి ఈ ధోరణిని దుయ్యబడుతూ ప్రజాతంత్ర మేధావులు ఎంతగా గొంతు చించుకొని అరుస్తున్నా, ఇప్పటికీ మహిళలను ఇలా "స్టీరియో టైపింగ్" చేయడం కొనసాగుతూనే ఉంది. ఈ పరిస్థితిని గుర్తిస్తూ, భారత సుప్రీంకోర్టు 16 ఆగస్టు 2023న "ద హ్యాండ్ బుక్ ఆఫ్ కంబాటింగ్ స్టీరియో టైప్స్" అనే 30 పేజీల డాక్యుమెంటును విడుదల చేయడం హర్షించదగిన విషయం. ఈ పుస్తకానికి ముందుమాట రాస్తూ, సుప్రీంకోర్టు ఛీఫ్ జస్టిస్ చంద్రచూడ్ "మహిళల విషయంలో మూస పదాల వినియోగం అనేది మొత్తాన్ని మహిళల విషయంలో నిష్పక్షపాతంగా న్యాయాన్ని అందనీయకపోవడమే. ఇది అందరికీ సమానంగా న్యాయాన్ని అందించాలన్నదే బాధ్యతగా తీసుకున్న ప్రమాణాన్ని ఉల్లంఘించడమే" అన్నారు.

న్యాయపరమైన విషయాలలో ఇటువంటి మూస పదాల వాడుక అనేది న్యాయాన్ని, తీర్పులను ప్రభావితం చేయడం మాత్రమే కాకుండా, సమాజంలో కూడా సహజంగా ఉండాల్సిన అవగాహనను, పురోగతిని అడ్డుకుంటుంది. అందువలన మూసపదాలు, వ్యాఖ్యలను న్యాయపరమైన విషయాల్లో వినియోగించడాన్ని నివారించడానికి ప్రయత్నిస్తూ, ప్రత్యామ్నాయంగా, మహిళలను కించపరచని, అవమానించని పదజాలాన్ని సూచించడం కూడా ముఖ్యమైన విషయం అని ఈ పుస్తకం తెలియజేస్తుంది. అందులో భాగంగా, "మూస పద్ధతులను ప్రేరేపించే భాష మరియు ప్రత్యామ్నాయ భాష", మహిళలపట్ల స్టీరియో టైప్ అభిప్రాయాలు మరియు వాస్తవం" మధ్య తేడాలను వివరిస్తూ, అసలు మూస పద్ధతులంటే ఏమిటి? ఈ భాష సమాజాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది? తద్వారా న్యాయానికి ఎలా నష్టం జరుగుతుంది? అనే విషయాలను ఈ పుస్తకంలో చర్చించారు. ఉద్యోగంలేని, పెళ్ళైన స్త్రీలను "హౌస్ వైఫ్"లుగా సంబోధించే సమస్య నుండీ, అత్యాచారానికి గురయిన స్త్రీ, ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డ వ్యక్తినే వివాహం చేసుకోవడం వలన ఆమె శీలానికి భంగం కలుగదు అనేటువంటి దుర్మార్గమైన ఆలోచన వరకూ ఇటువంటి ఎన్నో విషయాల్ని ఈ పుస్తకం వివరించింది. నానాటికీ భద్రత అనేది ప్రశ్నార్థకంగా మారిపోతున్న నేటి పరిస్థితుల్లో, సుప్రీంకోర్టు ఈ భాషా సమస్యను గుర్తించడం ఆహ్వానించదగిన విషయమే. అయినప్పటికీ, ఇల్లు అలుకగానే పండుగ కాదు అన్నట్లు ఇక్కడితో సంతృప్తి పడిపోతే చాలదు. మహిళల వ్యక్తిత్వాల్ని కించపరిచే పదజాలం వాడడం అనేది నిష్పక్షపాతంగా న్యాయాన్ని అందజేయటంలేదన్నది సరే.... కానీ మాటలు రాని చిన్నారులపైనా, నడవలేని ముసలి వాళ్ళపైనా జరుగుతున్న లైంగిక దాడులకూ, కులమతాల, ఆధిపత్య కొట్లాటల మధ్య బలైపోతున్న ఆడవాళ్ళకూ న్యాయం జరిగేది ఎప్పుడు? ఇటువంటి ఒక పుస్తకాన్ని తీసుకురావాలన్న కృషి కరోనా కాలంలోనే అంటే 2019లో మొదలయ్యింది కానీ, 2023 ఆగస్టు వరకూ బయటికి రానేలేదు. ఈ పుస్తకంలో చర్చించిన చాలా విషయాలు ఇప్పటికీ అంతో, ఇంతో చాలావరకూ ప్రజలు గుర్తించలేకపోలేదు. పైగా 30 పేజీలు మాత్రమే ఉన్న ఈ చిన్న పుస్తకాన్ని బయటకు తీసుకురావటానికి నాలుగేళ్ళ సమయం పట్టిందంటే ఏమనుకోవాలి?


"భాష" ప్రాధాన్యతను చర్చించడం కోసమే అయితే ఈ పుస్తకం ఇప్పుడు కాదు, ఆనాడు నిర్భయ సంఘటన జరిగినపుడే రావాలి. అత్యాచారాలకూ, దాడులకూ గురవడం ఆడవారి తప్పేనంటున్న వారి నోళ్ళు మూయించే విధంగా ఆనాటినుండీ జరుగుతున్న చర్చను సుప్రీంకోర్టు గుర్తించి ఉండాలి. ఒకపక్క మహిళల పట్ల అరాచకాలకు పాల్పడుతున్నవారి కేసులను కొట్టివేస్తూ, వాకపల్లి, బిల్కిస్‌బానో ఉదంతాలలోకి నిందితులను సత్ప్రవర్తనపేరిట విడుదల చేస్తూ, బ్రిజ్

భూషణ్ లాంటి ఎంతోమందిని స్వేచ్ఛగా తిరగనిస్తూ, మూసపదజాలాన్ని అర్జంటుగా నివారించాల్సిన కర్తవ్యం గుర్తురావడం అంటే బాధితుల పక్షాన నిలబడుతున్నట్లు ప్రకటించి నేరస్థులకు కొమ్ముకాయడమే. కాసేపు పక్కన పెట్టేద్దాం. మణిపూర్ అక్కచెల్లెళ్ళకు చెప్పడానికి మన దగ్గర ఏం సమాధానం ఉంది?

ఒక మగవాడ్ని దూషించాలన్నా అతడి తల్లినీ, చెల్లినీ అవమానించే స్థితిలో ఉంది నేటి సమాజం. స్త్రీ, పురుషుల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలుండాలంటే, పురుషులు స్త్రీలను వస్తువులుగా చూసే పద్ధతి మారాలంటే మహిళలపట్ల ఉన్న స్టీరియో టైప్ అభిప్రాయాలను గుర్తించి, నివారించడం మాత్రమే సరిపోదు. అసమానతలు సమాజంలో ఉండటానికి గల కారణాలను తొలగించాలి. తరతరాలుగా సమాజంలో వేళ్ళూనుకొనిపోయిన అపోహలు, సాటి మనిషిని వస్తువుగా, బానిసగా చూసే పరిస్థితి, కులాలు, మతాలు, జెండర్ ప్రాతిపదికలతో మనల్ని మనం విడగొట్టుకొంటున్న పరిస్థితి ఇటువంటి పై పూతల వలన హఠాత్తుగా మారిపోదు. శాస్త్రీయ విద్య ద్వారా భవిష్యత్తు తరాలూ, ప్రజాస్వామిక సంస్కృతిని పెంపొందించటం ద్వారా ప్రస్తుత సమాజమూ మారుతుంది. సమస్య మూలాల నుండీ పరిష్కారం అందించే ఈ విషయాన్ని విస్మరించి మనం ఎన్ని సంస్కరణలు చేపట్టినా ప్రజల భావజాలం మారిపోదు. వారి జీవన పరిస్థితులూ మారిపోవు. దీనిని అర్థం చేసుకొని స్త్రీ-పురుషులు, కుల-మత బేధాలు, ఏవిధమైన అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రజాతంత్రవాదులంతా ఐక్యమై కృషి చేస్తూనే ఉండాలి. ✺

### ప్రసిద్ధ లౌకికవాదీ, పాత్రికేయుడు, 'సియాసిత్' ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్

# జహీరుద్దీన్ ఆలీఖాన్ అకాలమరణం



**హైదరాబాద్** పాతబస్తీకి, తెలుగు సమాజానికి మధ్య స్నేహవారధిగా వున్న లౌకికవాది, 'సియాసిత్' ఉర్దూపత్రిక అధిపతి జహీర్‌భాయ్ తన 63వ యేట 07-08-2023న హైదరాబాదులో ప్రసిద్ధ వాగ్గేయకారుడు గద్దర్ అంతిమయాత్రలో నడుస్తూనే గుండెపోటుతో మరణించారు.

మతసామరస్యాన్నీ, లౌకికవాదాన్నీ బలంగా నమ్మిన జహీరుద్దీన్‌తోనూ, 'సియాసిత్' పత్రికతోనూ జనసాహితికి సన్నిహిత సంబంధం వుంది. 2004లో 'ఉపఖండంలో శాంతి, ప్రజాస్వామ్యం కోసం సాహిత్యం' అనే 'ప్రజాసాహితి' ప్రత్యేక సంచికకు 'సియాసిత్' ఎంతో సహకరించింది. అలాగే 2012లో షహీద్ హసన్ నాసిర్‌పై ఉర్దూలో టి.ఎన్. మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన పుస్తకం ఆవిష్కరణ సభ ఆ పత్రిక కార్యాలయంలోనే జరిగింది. 1999లో ఇండియా - పాకిస్తాన్ ఉమ్మడి క్రికెట్ జట్టు ఆవశ్యకతపైనా, మతతత్త్వం - సంస్కృతిపైనా జనసాహితి ఇంగ్లీషులో ప్రచురించిన చిన్న పుస్తకాల పట్ల ఖాన్ సోదరులు ఎంతో ఆసక్తి ప్రదర్శించారు. 1996 నుండి కలకత్తా, బెంగుళూరు, కరాచీలలో జరిగిన "శాంతి, ప్రజాస్వామ్యం కోసం భారత - పాకిస్తాన్ ప్రజావేదిక" సమావేశాలకు హాజరైన జనసాహితి కార్యాచరణపట్ల ఆయనకెంతో గౌరవం.

గత 35 సంవత్సరాలుగా పాత్రికేయ వృత్తికి అంకితమైన జహీరుద్దీన్ ప్రసిద్ధ సామాజిక కార్యకర్త, నిజమైన మానవతావాది. తన పత్రిక ద్వారా, వివిధ సంస్థల ద్వారా ప్రజాస్వామిక లౌకిక విలువల కోసం, మత సామరస్యం కోసం, సామాజిక న్యాయం కోసం అవిరామమైన కృషి చేశారు. ఆయన ప్రజాస్వామిక, ప్రగతిశీల, దళిత, విప్లవ సంస్థలకు సన్నిహితుడు.

సియాసిత్ సంస్థలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ఆయన చెప్తుండేవారు.

1994 నుంచీ అబీద్ ఆలీఖాన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ కార్యదర్శిగా ఆయన చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా 6 లక్షల 24 వేలమంది ఉర్దూ, అరబిక్ భాషలు నేర్చుకున్నారు. వారిలో 11 వేలమంది ఉర్దూ టీచర్లుగా ఉద్యోగాలు సంపాదించారు. వీరిలో 70 శాతం మంది మహిళలే. మహిళలకు కుట్టుపని, చేతివృత్తుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటుచేశారు.

2007 నుండీ ముస్లిం యువతీ యువకుల ప్రత్యక్ష సమావేశాలు నిర్వహించి 7 వేల జంటలకు తమ సంస్థ తరఫున ఆర్థికపరమైన బాధ్యతలు వహించి ఆదర్శ వివాహాలు జరిపించారు. మైనారిటీ అభివృద్ధి వేదిక పక్షాన మురికివాడల్లోని ముస్లిం, దళిత, క్రైస్తవ, సిక్కులకు సహాయం అందించేవారు. ఉచిత వైద్య సౌకర్యం కల్పించారు. వికారాబాద్‌లో 'సుకూన్' అనే 100 పడకల వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఆయన మతతత్త్వ పార్టీలైన బి.జె.పి.నీ, ముస్లిం ఎమ్.ఐ.ఎమ్‌లను వ్యతిరేకించారు. ఇరాన్‌పై అమెరికా దురాక్రమణ ఖండిస్తూ హైదరాబాద్‌లో ఏర్పడిన యుద్ధ వ్యతిరేక వేదికలో కీలకమైన పాత్ర వహించారు. బీహార్, గుజరాత్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలోని 4 కోట్ల 22 వేలమంది పేద ముస్లిములకు సియాసిత్ మిల్లాత్ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించారు.

2002లో గుజరాత్ గాయ బాధితులకు, కాశ్మీర్‌లో రాజ్యహింస బాధితులకూ పలు పర్యాయాలు సహాయపడ్డారు. కోవిడ్ సమయంలో మేడ్చల్‌లోని వలస కార్మికుల సహాయ శిబిరం ఏర్పాటుచేశారు. ఇలా బహుముఖాలుగా సామాజికసేవలు అందిస్తూ, హైదరాబాదు పాత, కొత్త నగరాల వారధిగా వున్న జహీర్ భాయ్ మరణానికి జనసాహితి ప్రగాఢ సంతాపాన్ని తెలియచేస్తోంది. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటిస్తోంది. ✺

# నేడు ఒక సాధారణ విమర్శ కూడా శిక్షార్హమే!

'**అన్** అకాడమీ' అనేది ఒక ఆన్‌లైన్‌లో పాఠాలు నేర్పే సంస్థ. మొదట యూట్యూబ్‌గా ప్రారంభమై అది ఏర్పడిన 2015 నుండి క్రమంగా ఎదిగి ఆన్‌లైన్ సంస్థగా పాఠాలు నేర్పుతోంది. వీడియోల ద్వారా దీనిలో పనిచేసే ట్యూటర్లు పాఠాలు చెబుతుంటారు. బెంగుళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఈ బహుళజాతి సంస్థ నిర్వాహకులు గౌరవ్ మంజల్, రోమన్ సైనీ, హేమేశ్‌సింగ్‌లు.

కరణ్ సాంగ్వాన్ అనే అధ్యాపకుడు తన పాఠంలో భాగంగా, "విషయాన్ని అర్థం చేసుకోగల చదువుకున్నవారిని ఎన్నికల్లో ఎన్నుకోండి. పేర్లు మాత్రం మార్చగల్గినవారిని ఎన్నుకోవద్దు. సరైన నిర్ణయం తీసుకోండి" అని చెప్పారు. ఈ పాఠం ప్రసారమైన అగస్టు 17నే సాంగ్వాన్ ఉద్యోగం ఊడకొట్టారు. ఇదే వీడియోలో ఆయన "ప్రస్తుతం అమలులోకి వచ్చిన 'సరికొత్త భారత సాక్ష్య చట్టం' (ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్) పాత బ్రిటిష్‌వారి చట్టమే. దానిలోని అధ్యాయాలను అటూ, ఇటూ మార్చి, కొత్తవి కొన్ని చేర్చి, ఇది ఒక కొత్త చట్టం అంటున్నారు" అని కూడా ఆయన విమర్శించారు. భారతీయ స్ఫూర్తిని నింపుతూ చేసిన చట్టం అని అభివర్ణించినా ఆ స్ఫూర్తి ఏదీ దీనిలో లేదు" అని కూడా విశ్లేషించారు.

పాలకుల విధానాలను పరోక్షంగా విమర్శించటం కూడా తప్పు పట్టి శిక్ష విధించటమే ఫాసిస్టు ధోరణి. ✺

# 2023 జులై 29, 30 తేదీలలో జరిగిన సాహిత్యోత్సవం 10వ అఖిల భారత దళిత సాహిత్య సమ్మేళనం

**కర్నాటకలోని** విజయపురలో ఈ సమ్మేళనాన్ని 29వ తేదీన గుల్బార్గా విశ్వవిద్యాలయంలో కన్నడ భాషాశాఖలో అధ్యాపకులైన హెచ్.టి.పోతే ప్రారంభించారు. ఆయన తన ఉపన్యాసంలో వివిధ భాషల్లో వున్న దళిత సాహిత్యాన్ని అన్ని కులాలకు చెందిన యువత అధ్యయనం చేయాలనీ, ఈనాడు దళిత సాహిత్యం ఉత్తమోత్తమ కళారూపంగా అభివృద్ధి పొంది అగ్రవర్ణాలవారి కళ్ళు తెరిపించిందనీ, రాజ్యాంగ పీఠికలోని స్ఫూర్తిని విద్యార్థులు అందుకోవాలనీ అన్నారు. ఆయన తన ప్రసంగంలో పూర్వ బీజాపూర్ జిల్లాకు చెందిన మధుర చెన్నా, సి.పి. లింగన్న, ధూలాసాహెబ్, కపసీ రేవప్పలనేగాక ఆధునికులైన కె.కె.పోల్, ఎమ్.ఎమ్. కుల్బుర్గిలను జ్ఞాపకం చేశారు. అంబేద్కర్ సహచరులైన దళిత మేధావులు సిద్ధార్థ అరకెరి, ఎం.ఆర్.కాలే, హెచ్.ఆర్.షిండే, ఎల్.ఆర్.నాయక్‌ల కృషిని వివరించారు. తాను బాల్యంలో విజయపురిలోని హన్‌జగి గ్రామంలో పేదరికంలో మగ్గిపోయిన సంగతులు చెప్పారు. ఆనాటి వారి ఉపధ్యాయులు మల్లికార్జునమర్, గుడిబాయి మేడం, ఘంటా మాస్టర్ – విశ్వవిద్యాలయంలో అధ్యాపకుడు చెన్నన్న వలీకర్‌లను గుర్తుకు తెచ్చుకొని వారికి నివాళులు తెలిపారు.

ఈ సమ్మేళనంలో యువ రచయితలు, విమర్శకులు అయిన సుభాష్ రాజమణి, కిరణ్ గంజనూర్, విద్యావతి అంకలాగి, రుక్మిణి అగసార్, భువనేశ్వరి కాంబ్లే, మొదలగువారు వివిధ సెషన్స్‌లో పాల్గొన్నారు.

జిల్లా బాధ్యుడు, భారీ పరిశ్రమల మంత్రి ఎం.బి.పాటిల్ హాజరైన ఈ సమ్మేళనం ఈ క్రింది తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది.

1. దేశవ్యాప్తంగా పాకీ దొడ్లని శుభ్రం చేసే పనిని పారిశుద్ధ్య కార్మికులతో కాక యంత్రాలతో చేయించాలి.
2. దళిత సాహిత్య అభివృద్ధి మండలినీ, డా॥ అంబేద్కర్ సాహిత్య అకాడమీని స్థాపించాలి.
3. దళిత సాహిత్య పరిషత్తుకు శాశ్వత ఆర్థిక సహాయం అందించే ఏర్పాటుచేయాలి.
4. నయా బౌద్ధ అభివృద్ధి బోర్డును స్థాపించాలి.

ఎనిమిది దశాబ్దాలు గడిచినా, ఈనాటికీ దళితులు, ఆదివాసులపై అకృత్యాలు తగ్గుముఖం పట్టలేదు. సామాజిక సమానత్వం ఇప్పటికీ సాధించలేదు. దళిత మేధావులు, నాయకులు, షెడ్యూలు కులాలలో వివిధ గ్రూపుల మధ్య వున్న వైషమ్యాలను తగ్గించే చైతన్యం కలుగ చేయాలని సమ్మేళనం పిలుపునిచ్చింది.

సుజాత, చలవాది తీర్మానాలను ప్రవేశపెట్టి, చివర్లో 11వ సమ్మేళనం 2024 జనవరిలో రాయచూర్‌లో జరుగుతుందని ప్రకటించారు. ✺

# అశోక విశ్వవిద్యాలయంలో విద్యాసంబంధిత స్వేచ్ఛ కొరకు సాగుతున్న ఆందోళన

**మానవీయ** శాస్త్రాలు, సామాజిక శాస్త్రాలు, ప్రకృతి శాస్త్రాలు బోధించే 'ప్రతిష్ఠాత్మక' అశోక విశ్వవిద్యాలయం హర్యానాలోని సోనేపట్‌లో 25 ఎకరాల స్థలంలో 2014 మే 2న స్థాపింపబడింది. ఈ ప్రైవేటు విశ్వవిద్యాలయం 200 మంది అధ్యాపకులు, 4500 మంది విద్యార్థులతో సాగుతోంది.

2023 జులై 25న ఆర్థికశాస్త్ర విభాగంలోని అసిస్టెంట్ ప్రొఫెసర్ సవ్యసాచిదాస్ "ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యంలో వెనుకపట్టు పడుతున్న ప్రజాస్వామ్యం" అనే శీర్షిక గల తన పరిశోధనాపత్రాన్ని వాషింగ్టన్‌లో జరిగిన కాన్ఫరెన్స్‌లో సమర్పించారు. అది 2019లో ఇండియాలో జరిగిన ఎన్నికలపై విశ్లేషణ. దానిలో ఆయన ఈ ఎన్నికలలో కొంత మోసం జరిగిందనీ, ఆ మోసం జరగకపోయినా మోదీయే గెలిచేవాడనీ వ్యాఖ్యానించారు.

ఈ వ్యాఖ్య ఢిల్లీలోని పాలకుల కంటబడింది. ఫలితంగా అశోక విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు సోమన్‌రాయ్ చౌదరి (ఆ పదవిలో ఆయన 2023 జనవరిలో చేరారు) ఆగస్టు 1న ఒక ప్రకటన చేస్తూ, "ఆ పరిశోధనా వ్యాసంతో తమ విశ్వవిద్యాలయానికి సంబంధంలేదనీ, ఆ రంగంలో పరిణతినొందినవారి అంగీకారం దానికి లేద"నీ బహిరంగ ప్రకటన చేశారు. దీనిపై స్పందనగా ఆ పత్ర రచయిత, సహాయ ఆచార్యుడు సవ్యసాచిదాస్ తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చారు. వైస్ ఛాన్సలర్ ఆగస్టు 14న ఆ రాజీనామాను వెంటనే అంగీకరించారు.

కానీ ఆర్థికశాస్త్ర శాఖలో పనిచేస్తున్న ఇతర అధ్యాపకులు సవ్యసాచిదాస్‌కు సంఘీభావం ప్రకటిస్తూ "దాస్ విద్యాసంబంధమైన విధానాలు ఉల్లంఘించలేదనీ, బేషరతుగా ఆయనకు ఉద్యోగం ఇవ్వాలనీ, విశ్వవిద్యాలయ గవర్నింగ్ బాడీకి పరిశోధనలపై వ్యాఖ్యానించే హక్కు లేదనీ" అన్నారు.

అదే ఆర్థికశాస్త్ర శాఖలో ఆచార్యుడైన పులాప్రే బాలకృష్ణన్ కూడా విశ్వవిద్యాలయం వారు సవ్యసాచిదాస్ చేత రాజీనామా చేయించడాన్ని తప్పుపడుతూ తను గూడా రాజీనామా చేశారు. ఆయన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో, ఇండియన్ స్టాటిస్టికల్ సంస్థ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ప్రపంచ బ్యాంకుల్లో పనిచేసి 2015లో అశోక విశ్వవిద్యాలయంలో చేరారు. ఆయన రాసిన "నెహ్రూ నుండి మోడీ వరకు భారత ఆర్థికవ్యవస్థ" అన్న పుస్తకాన్ని 2022లో పర్మినంట్ బ్లాక్, అశోక విశ్వవిద్యాలయం సంయుక్తంగా ప్రచురించాయి.

సవ్యసాచిదాస్‌ను బేషరతుగా ఉద్యోగంలోకి తిరిగి తీసుకోవాలనీ, విద్యాసంబంధిత స్వేచ్ఛకు విశ్వవిద్యాలయ పాలకవర్గం ఆటంకం కలిగించరాదనీ, అలా చేసేవరకూ తాము కూడా తరగతులు తీసుకోమనీ ఇప్పటివరకూ ఆ విశ్వవిద్యాలయంలోని రాజకీయార్థికశాఖ, ఇంగ్లీషుశాఖ, సోషియాలజీశాఖ, ఆంత్రపోలజీశాఖ, సృజనాత్మక రచనా శాఖవారు దాస్‌కు సంఘీభావం ప్రకటించారు.

గతంలో ఇదే విశ్వవిద్యాలయానికి వైస్‌ఛాన్సలర్‌గా పనిచేసిన ప్రతాపభానుమెహతా, మోడీ విధానాలను విమర్శించినందుకు మార్చి 2021లో రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆనాడు ఆయనతోపాటు మరొక అధ్యాపకుడు అర్విండ్ సుబ్రహ్మణియన్ కూడా రాజీనామా చేశారు.

విశ్వవిద్యాలయంలోని పి.హెచ్.డి. విద్యార్థులు కూడా ఈ సందర్భంగా 'విద్యా విషయిక స్వేచ్ఛ' కొరకు ఆందోళన చేస్తూ సవ్యసాచి సేన్‌కు సంఘీభావాన్ని ప్రకటించారు.

**(ది వైర్, స్క్రోల్ ఆధారంగా)**

# హాలీవుడ్‌లో ఏక కాలంలో సాగుతున్న రచయితల, నటుల కళాకారుల రెండు సమ్మెలు

**ఏప్రియల్** 18 నుండి, లాస్ ఏంజెల్స్‌లో గల చలనచిత్ర మరియు టెలివిజన్ చిత్రాల నిర్మాతల సంఘం యొక్క విధానాలకు వ్యతిరేకంగా అమెరికా దేశపు రచయితల గిల్డు ఆధ్వర్యంలో సమ్మె జరుపుతున్నారు. అమెరికా దేశపు రచయితల గిల్డులో 11,000 మంది సభ్యులున్నారు. చలనచిత్ర మరియు టెలివిజన్ నిర్మాతల సంఘంలో పేరొందిన స్టూడియోలు, స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలు అయిన వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ, ఏపిల్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్, డిస్నీ, పారమౌంట్ లాంటి బడా సంస్థలున్నాయి.

తమ వేతనాల చెల్లింపుల సమస్యపై రచయితలు సమ్మెలోకి దిగారు. ఒ.టి.టి. ప్లాట్‌ఫాంల వలన తమ చెల్లింపులకు ఏర్పడిన సవాళ్ళను పరిష్కరించమంటూ రచయితలు సమ్మెలోకి దిగారు. తమను పనిలో నియమించుకొనేదాని స్వభావం రచయితలు ఎదుర్కొంటున్న సమస్యల్లో ఒకటి. ఇప్పుడు వారు పనిలో నియమించబడే కాలం గతంలో దానికన్నా 40% తగ్గిపోయింది. అంటే వారి పనికాలం కుదించబడింది. గతంలో అయితే రచయితలకు, ఎపిసోడ్‌లను చేసినపుడు ప్రతీ ప్రసారంపైనా అవశేష ఆదాయం చెల్లింపబడేది. కానీ ప్రస్తుతం స్ట్రీమింగ్ ప్లాట్‌ఫాంలు తాము ఎపిసోడ్‌లను స్ట్రీమ్' (ప్రవహింప) జేస్తున్నాం కానీ ప్రసారం చేయటల్లేదు అనే సాంకేతిక

సాకును చూపించి రచయితలకు అవశేష ఆదాయం దాదాపు చెల్లించటం మానివేశారు. గతంలో చెల్లింపబడే అవశేష ఆదాయం వలన, హాలీవుడ్ లాంటి ప్రాంతంలో తాము అతి కష్టంమీద తమ అవసరాలు తీర్చుకొంటూ బ్రతుకుతూ వున్నామని యిప్పుడు దాన్ని చెల్లించటం మానివేయటం వలన జీవితాలను యీదృటం కష్టతరంగా మారింది అంటున్నారు. ఈ విధానాల వల్లే తమ బ్రతుకులు కష్టాలపాలైతే, యిప్పుడు మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టుగా చిత్ర నిర్మాణసంస్థలు, తాము నిర్మించే చిత్రాలకు అవసరమైన 'విషయాన్ని' (కథలు తదితర సృజనాత్మక కల్పనలు) కృత్రిమ (ప్రత్యామ్నాయ) మేధస్సు ద్వారా సమకూర్చుకోవటం అన్నది తమకు మరింత అభద్రత కలిగిస్తూందని రచయితలు వెల్లడిస్తున్నారు. పైన పేర్కొన్న ఈ మూడు సమస్యలను, పరిష్కరించాలని డిమాండు చేస్తూ సమ్మెకు దిగారు. ప్రత్యేకించి కృత్రిమ మేధస్సు ఉపయోగం ద్వారా మూల కథలను సృష్టించటం, వ్రాయటం లేదా తిరిగి వ్రాయటం అన్న పద్ధతిపై నియంత్రణలుండాలని వారు డిమాండు చేస్తున్నారు.

అయితే డిస్నీ, నెట్‌ఫ్లిక్స్ లాంటి బడా సంస్థలు తాము భవిష్యత్తులో కృత్రిమ మేధస్సును వినియోగించకుండా వుండబోమని తెగేసి చెప్పారు. వారు రచయితల యీ మవులిక డిమాండ్‌ను తిరస్కరించారు. ఆరు వారాలపాటు యిరువర్గాల మధ్యా చర్చలు జరిగినా బడా నిర్మాణ సంస్థలు మొండి వైఖరిని చేబట్టటంతో, రచయితలకు మద్దతుగా, హాలీవుడ్‌లో వున్న అతిపెద్ద సంఘమైన ఎన్.ఎ.జి. – ఎఫ్‌టిఆర్ఎల ఫెడరేషన్ (స్క్రీన్ ఏక్టర్స్ గిల్డ్ – అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టెలివిజన్ అండ్ రేడియో ఆర్టిస్ట్స్) సమ్మెలోకి దిగింది. ఇందులో నటులు, కళాకారులు మొత్తంగా 15,000 మంది చిత్ర – టీవిచిత్ర నటులున్నారు. పెద్దపెద్ద హాలీవుడ్ నటులు, హాస్యనటులు, సెలబ్రిటీలు యీ సమ్మెకు మద్దతుగా నిలిచి వుండటంతో దాదాపుగా చిత్రాల – టివి చిత్రాల నిర్మాణం హాలీవుడ్‌లో నిలిచిపోయింది. నటులు న్యూయార్క్, లాస్ ఏంజెల్స్ నగరాలలోని పికెటింగ్‌లలో పాల్గొంటున్నారు.

ఈ సమ్మె ప్రభావం వలన వెనిస్ నగరంలో జరిగే 80వ అంతర్జాతీయ చిత్రోత్సవంలో ప్రారంభచిత్రాన్ని మార్చి దాని స్థానంలో మరో చిత్రంతో ప్రారంభించటానికి ఆ ఉత్సవ నిర్వాహకులు నిర్ణయించు కోవలసి వచ్చింది. లుకాగాడిగ్నినో యొక్క 'ఛాలెంజర్స్' చిత్రం స్థానంలో, ఐడ్వర్డో డి ఏంజిలిస్ యొక్క 'కమాండేట్' చిత్రాన్ని ప్రారంభ చిత్రంగా ప్రదర్శించటానికి నిర్వాహకులు నిర్ణయించారు.

1960 తర్వాత, హాలీవుడ్‌లో ఒకేసారి రెండు సమ్మెలు జరగటం అన్నది మళ్ళీ యిప్పుడు జరుగుతోంది.

సృజనాత్మకతను అమ్మకపు వస్తువుగా కుదించి, మార్చివేసిన పెట్టుబడిదారీ విధానం, యిప్పుడు కృత్రిమ మేధస్సు ఉపయోగించి సృష్టించి – మానవ సృజనాత్మకతను రూపుమాపటానికి చేసే బడా చిత్రనిర్మాణ కార్పొరేషన్ల మొండి వైఖరిని 'ప్రజాసాహితి' నిరసిస్తోంది!

తమ న్యాయమైన సహజసిద్ధమైన హక్కుల కోసం పోరాడుతున్న సినీ, టీవీ. రచయితలకు, నటులకూ, కళాకారులకూ తన సంఘీ భావాన్ని ప్రకటిస్తోంది! ✺

పాట

# ఎత్తరా! జెండా ఎత్తరా!!

– పి. మోహనరావు

పల్లవి :
ఎత్తరా! జనజండా - ఎత్తరా!!
మన దేశం బాగుకై
నడంకట్టి సాగుదాం!

ఎత్తరా... ఎర్రజెండ ఎత్తరా!
శ్రమ విముక్తి కోసమై
పిడికిలెత్తి పోరుదాం!!

1 చరణం :
పరపీడన పాలనలో
చితికెను మన భరతమాత!

పోరు సల్పి ప్రాణమిచ్చి
ఎదురొడ్డిరి అమరులు!!

అర్ధరాత్రి వంచనలో
అధికారం మార్పిడాయె!

ప్రజాస్వామ్య ఛాయలే
చెరిగిపోయె రోజులివి!! ॥ ఎత్తర ॥

2 చరణం :
సహజ వనరులెన్నెన్నో
తరలించే పాలనలో -

నీ దేశం మట్టి నీకు
నీ నోటనె కొడుతుంటే -

రాజ్యాంగం సాక్షిగా -
కుప్పకూలె ప్రజాస్వామ్యం!!

నోరెత్తే హక్కు కూడ
దేశద్రోహమే నేడు!!

నీ వేలితో నీ కంటిని
పొడుచుకునే ఎన్నికలపై - ॥ ఎత్తరా! ॥ ✺

# చైతన్యవాహిని

**19-8-2023**న తుమ్మపూడిలో సంజీవదేవ్ వర్ధంతి సందర్భంగా వారి ఇల్లు 'రసరేఖ' ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు బి. లలితానంద్ సంజీవదేవ్‌పై రాసిన వ్యాస సంపుటి. "ఎప్పటికీ.... అందరికీ : సంజీవదేవ్" ఆవిష్కరణ సభ జరిగింది. దీనికి 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు అధ్యక్షత వహించారు. సంజీవదేవ్ ఫౌండేషన్ బాధ్యులు వై.వి.రావు స్వాగతం పలికారు. రవిబాబు మాట్లాడుతూ, "చిత్రకళారంగంపై అనర్గళంగా ఉపన్యాసాలిచ్చి మెప్పించినవారిలో తెలుగునాట అడివి బాపిరాజు తర్వాత సంజీవదేవ్ తప్ప మరొకరు లేరు. గతంలో మాసపత్రికలలో చిత్రకళకు కొంత స్థానముండేది. నేడు 'మిసిమి', 'ప్రజాసాహితి', 'సాహితీ ప్రస్థానం' పత్రికల్లో మాత్రం సమకాలీన చిత్రకారుల చిత్రాలు ప్రచురిస్తున్నారు. చిత్రకారుల చిత్రాల ప్రదర్శన కోసం ప్రభుత్వం "ఆర్ట్ గ్యాలరీలను ఏర్పాటు చేయాలి. ఎన్ని ఇబ్బందులనైనా ఎదుర్కొంటూ ఈనాడు చిత్రకారులు తమ చిత్రాలను అక్కడక్కడా ప్రదర్శిస్తున్నారు. ఈ సందర్భంగా బెంగాలీ చిత్రకారుడు చిత్తప్రసాద్ ప్రజా చిత్రకళలో చేసిన కృషిని గుర్తు తెచ్చుకోవాలి. సంజీవదేవ్, శీలా వీర్రాజు, టీవీ మొదలగు చిత్రకారులు చిత్రించిన కళాఖండాలను ప్రదర్శించే మ్యూజియంను ప్రభుత్వం ఏర్పాటు చేయాలి" అన్నారు. లలితానంద్ రాసిన పుస్తకాన్ని సంజీవదేవ్ పెద్దకుమారుడు, ఆర్థిక శాస్త్రవేత్త, ప్రసిద్ధ ఆంగ్ల వారపత్రిక 'ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ' సంపాదకుడు ఎస్. మహేంద్రదేవ్ ఆవిష్కరించి, వారి నాన్నగారికి దేశంలో వున్న విస్తృత సంబంధాలను వివరించారు.

విశ్రాంత ఆచార్యుడు డా॥ మన్నవ సత్యనారాయణ మాట్లాడుతూ 8వ తరగతి మాత్రమే చదివిన సంజీవదేవ్ విదేశీ విశ్వవిద్యాలయాల్లో కూడా ప్రసంగించడం ఒక అద్భుతం అన్నారు. ఐహికము, పారమార్థికానికి అతీతంగా ఒక వింత లోకంలో ఆయన జీవించారు అని వ్యాఖ్యానించారు.

'చినుకు' మాసపత్రిక సంపాదకులు నండూరి రాజగోపాల్ తన ప్రసంగంలో సంజీవదేవ్ ప్రకృతి ప్రేమికుడన్నారు. ఆయన ఇతరుల గురించి తప్ప తన గురించి ఎక్కడా చెప్పలేదన్నారు. మరణించే ముందు తను చిత్రించిన ప్రకృతి చిత్రాల ఆల్బమ్‌ను పక్కనే వుంచుకున్నారన్నారు. ఆయనకు చిత్రకళతోపాటు, కవిత్వమన్నా, వర్షమన్నా, కాలువలో వెళ్తున్న పడవలన్నా చాల ఇష్టమన్నారు. "చిత్రంతో మనం మాట్లాడటం కాదు – చిత్రాలు కూడా మనతో మాట్లాడతాయని" ఆయన అనేవారని గుర్తు తెచ్చుకున్నారు.

డా॥ పాటిబండ్ల దక్షిణామూర్తి, డా॥ జితేంద్రబాబు సంజీవదేవ్ గారితో తమ పరిచయాలు, తమపై వారి ప్రభావం వివరించారు. రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'ఉపన్యాసాలు చెప్పడమే కాదు – వ్యవసాయం, కూలిపని చేయడం కూడా గొప్పే'నని సంజీవదేవ్‌గారనేవారని చెప్పారు.

చివర్లో లలితానందప్రసాద్ మాట్లాడుతూ జీవితంలోని అన్ని పార్శ్వాలను తడిమి సమన్వయం చేసుకోవడం సంజీవదేవ్ ప్రత్యేకత అన్నారు.

తెనాలి, గుంటూరు, విజయవాడ, హైదరాబాదు మొదలైన ప్రాంతాల నుండి వచ్చిన చిత్రకళాభిమానులు సాహితీవేత్తలు సంజీవదేవ్ మిత్రులతో సభ కళకళలాడింది. ✷

---

కవిత

# ధరిత్రీ దినం

ఇంగ్లీషు : అజ్ఞాత రచయిత

తెలుగు : కొత్తపల్లి రవిబాబు

నేను ధరిత్రిని!
నీ స్వగృహాన్ని!
కాని నీవు నా తోలు వలుస్తున్నావు
ఎముకలు చిదగ్గొట్టుతున్నావు!

అయినా నిన్ను క్షమిస్తా!
మరచిపోతా నీ ద్రోహం!
నిన్ను బతకనిస్తా!
అందుకే పశ్చాత్తాప పడతా!

నీకు అర్థం అవుతోందా!
నీ ఏకైక ఆశను నేను
నిరాశతో, నిస్పృహతో
నాకు అడ్డం రాకు!

పొదుపునాకవసరం
అదొక్కటే నీనుంచి
నాకు కావలసింది
ప్లాస్టిక్ వద్దనే వద్దు
వ్యర్థ పదార్థాలసలే వద్దు!

అతి త్వరితంగా అదృశ్యమౌతున్నాను గనుక
నాకు నీ అనురాగం కావాలి!
నా గాలిని కల్మషంతో నింపుతున్నావు గనుక
నాకు నీ ఆప్యాయత కావాలి!

**('పర్యావరణంపై నిర్వహించిన పోటీలో మొదటి బహుమతిని అందుకున్న కవిత)** ✷




**ఆయన జీవితమే ఒక సందేశం : దరిశి చెంచయ్య (వ్యాస సంకలనం)** సంకలనం – సంపాదకత్వం : **గౌరవ్**

గదర్ వీరులలో ఒకరైన దర్శి చెంచయ్య స్వీయ చరిత్ర 'నేను – నా దేశము' ప్రచురణకు 70 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా, నేటి తరాలకు ఆయన స్ఫూర్తినందించడానికి ప్రచురించిన పుస్తకం ఇది. చెంచయ్య 1890 డిసెంబరు 28న జన్మించి, 1964 డిసెంబరు 30న తన 74వ యేట మరణించారు.

మొట్టమొదట 'నేనూ – నా దేశము' పుస్తకాన్ని గద్దె లింగయ్య సంపాదకుడుగా ఆదర్శ గ్రంథమండలి (విజయవాడ) 1952 సెప్టెంబరులో ప్రచురించింది. ఆ తర్వాత 1992 ప్రాంతంలో జయంతి పబ్లికేషన్స్ తరఫున పెరుమాళ్ళు రెండుసార్లు ప్రచురించారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ (గుంటూరు) రెండేళ్ళక్రితం ప్రచురించింది. దీనిని ఇంగ్లీషులోకి నాగపూర్‌కు చెందిన దర్శి శ్రీదేవి అనువదిస్తున్నట్లు తెలిసింది. దీనికి పీఠిక రాసిన నార్ల మాటల్లో "ఇది మనదేశ చరిత్ర. పోయిన అర్ధశతాబ్దిలో మనదేశంలో ఆర్థిక, సాంఘిక, రాజకీయ, సాంస్కృతికరంగాలలో వచ్చిన ప్రతి మహోద్యమం చెంచయ్య జీవిత దర్పణంలో తన ప్రతిబింబాన్ని మిగిల్చింది".

ఐదు భాగాలుగా విభజించిన ఈ వ్యాస సంకలనంలోని మొదటి భాగంలో గౌరవ్ రాసిన ఆరు వ్యాసాలలో దర్శి చెంచయ్యను ఆయన చేసిన కృషిని విస్మరించిన తెలుగువారందరినీ తీవ్రంగా విమర్శించారు. ఈ సంకలనం కోసం రాయించిన 10 వ్యాసాలు రెండవ భాగంలో వున్నాయి. మూడవ భాగంలో చెంచయ్య గురించి వివిధ గ్రంథాలలో నల్లూరి వెంకటేశ్వర్లు, వకుళాభరణం రామకృష్ణ, నంబూరి పరిపూర్ణ రాసిన విషయాలు పొందుపరిచారు. నాలుగవ భాగంలో శతజయంతి ప్రత్యేక సంచికలోని 14 వ్యాసాలు పునః ముద్రించారు. ఐదవ భాగంలో చెంచయ్య రాసిన మూడు కథనాలను అందించారు. కోల్‌కతాకు చెందిన ఐకా బాలాజీ గదర్ వుద్యమంపై రాసిన 50 పుటల సమగ్ర వ్యాసం అనుబంధంగా అందించారు.

గదర్ ఉద్యమానికి సంబంధించిన అనేక అపురూపమైన చిత్రాలను పుస్తకంలో సందర్భోచితంగా ముద్రించారు. హిందుస్థాన్ గదర్ పార్టీ కేంద్ర కార్యాలయ భవనాన్నీ, పార్టీ జెండాను, చెంచయ్య చిత్రాన్ని – కొమగతమారు ఓడను చక్కగా అమర్చిన ముఖచిత్రాన్ని ఐకా కవిత (కోల్‌కతా) రూపొందించారు. దీనిని రెండు తెలుగు రాష్ట్రాల ప్రత్యామ్నాయ సాంస్కృతిక సమాఖ్య జులై 2023న ప్రచురించింది. 1/8 డెమ్మీలో 240 పుటలు. వెల : అమూల్యం. వివరాలకు : 90320 94492. email : gouravmesea@gmail.com

**ఎప్పటికీ.... అందరికీ.... సంజీవదేవ్ : (వ్యాస సంకలనం).** రచన : **బి. లలితానందప్రసాద్**

తెలుగు సాహితీ ప్రపంచంలో, కళాప్రపంచంలో సూర్యదేవర సంజీవదేవ్ ఒక విశిష్ట వ్యక్తి. 8వ తరగతి వరకే చదివి, యాత్రాభిలాషతో హిమాలయాలు సందర్శించి, స్వయంకృషితో 14 భాషలలోని సాహిత్యంతో పరిచయం సంపాదించి, చిత్రకారుడై, చిత్రకళా విమర్శకుడై తన పూర్వీకుల గ్రామమైన తుమ్మపూడిలో స్థిరపడి, ప్రపంచ కళారంగంలో స్థానం సంపాదించిన కళామర్మజ్ఞుడు సంజీవదేవ్.

ఆయన 1914 జులై 3న జన్మించి తన 85వ యేట 1999 అగస్టు 25న మరణించారు. ఆయన శతజయంతి సందర్భంగా ఆయన చేసిన కృషిపై తెలుగు దినపత్రికలలో, విశ్రాంత ఆచార్యులు లలితానంద్ రాసిన ఏడు రచనల సంపుటి ఇది. ఈ వ్యాసాలతో పాటు బాలబంధు బి.వి. నరసింహారావు, ఎ.బి.కె. ప్రసాద్, సింగమనేని నారాయణ, ఎస్.వి.ఎల్. నరసింహారావులు వివిధ సందర్భాలలో సంజీవదేవ్‌పై రాసిన రచనలను అనుబంధంగా అందించారు. నాలుగు సందేవ్ రచనలను ఇచ్చారు.

దీనికి ముందుమాటలు డా॥ వావిలాల సుబ్బారావు, డా॥ జంపాల చౌదరి, సంజీవదేవ్ పెద్దకుమారుడు మహేంద్రదేవ్ (ప్రస్తుతం ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ – ఇ.పి. డబ్ల్యు ముంబాయి సంపాదకుడు) రాశారు. చివర్లో సంజీవదేవ్ రచనల జాబితా, సంజీవదేవ్ గురించి ఇతరులు ప్రచురించిన రచనల జాబితాలను ఇచ్చారు. ముఖచిత్రంగానూ, రెండవ, మూడవ అట్టలపై సంజీవదేవ్ చిత్రించిన 11 ప్రకృతి చిత్రాలను అందించారు.

1/8 డెమ్మీలో 96 పుటల ఈ పుస్తకం వెల : రూ. 150/– తేజ–దీప్తి ప్రచురణలు. దుగ్గిరాలవారు అందిస్తున్న లలితసాహితి పరంపరలో ఇది మొదటిది. మొదటిముద్రణ : 19 అగస్టు 2023. ప్రతులకు : బి. లలితానందప్రసాద్, రిటైర్డ్ ప్రొఫెసర్, 12–24 సృజన, రథశాల వీధి, దుగ్గిరాల–522330. ఫోన్ : 92474 99715.

**అర్కస్మృతి : (Stray Thoughts).** రచన : **ముంగర జాషువ**

కళా విమర్శకుడు, తత్త్వవేత్త ముంగర జాషువ అప్పుడప్పుడు వ్రాసిన తాత్త్విక భావాల సంపుటి ఇది. వీరు డా॥ సంజీవదేవ్ శిష్యులు.

"ప్రపంచ సమాజం తొంభై శాతం అస్తవ్యస్తం. అపరిపక్వం, అసంపూర్ణం కావడానికి మతమే కారణం. మతం ఒక అపరిణితమైన ఆలోచన.... మతాన్ని అవలంబించడం అయిదువేల సంవత్సరాల వెనుక జీవించడం ఔతుంది".

"రాజ్యహింస వున్నంతవరకు ప్రతిఘటన, ప్రతిహింస ఎప్పుడూ ఉంటుంది. సామాజిక న్యాయం అనేది సుందర స్వప్నం కాదు. కఠిన వాస్తవం"

"మార్క్సిజం కేవలం మనిషి కనీస అవసరాలకు మాత్రమే దృష్టిలో పెట్టుకొన్నది అనే అభిప్రాయం సమంజసం కాదు. ఇటువంటి అభిప్రాయంతో చాలమంది విజ్ఞులు సైతం మార్క్సిజంపట్ల ఒక అపోహను ఏర్పరచుకున్నారనడం వాస్తవం".

28 పుటలలో ఇటువంటి ఆలోచనలతో కూడిన సంపుటి ఇది. 2001లో ఏప్రిల్‌లో మొదటిముద్రణ వెలువడగా, ఫిబ్రవరి 2022లో ఈ ద్వితీయముద్రణ వెలువడింది. మొత్తం 1/8 డెమ్మీలో 46 పుటల ఈ పుస్తకం వెల : రూ. 75/- పొన్నెకంటి పోతురాజుగారి మిత్రమండలి – కొలకలూరు వారి ప్రచురణ. ప్రతులకు : రాచకొండ సంజీవదేవ్, బి/2038, కెనాల్స్, హిల్‌కాలనీ – 508202. నల్లగొండజిల్లా. ఫోన్ : 8639362415, 9581810406.

**Kashmir Betrayed :** పి. ప్రసాద్ రాసిన 'కన్నీటి ధారల్లో కాశ్మీర్‌లోయ' పుస్తకానికి ఇది అనిసెట్టి శంకర్ చేసిన ఇంగ్లీషు అనువాదం. అర్విణి రాజేంద్రబాబు ముందుమాట రాశారు.

అనిసెట్టి శంకర్ ఇటీవల తెలుగు పుస్తకాలను ఇంగ్లీషులోకి అనువదిస్తున్నారు. సాహు, అల్లం రాజయ్య రాసిన 'కొమరం భీం', నవలను ఇంగ్లీషులోకి అనువదించారు. 'డీమానిటైజేషన్' పై తెలుగు వ్యాసాలను ఆంగ్లంలో అనువదించారు.

1/8 డెమ్మీలో 232 పుటల ఈ పుస్తకం వెల : రూ. 160/- స్నేహ ప్రచురణలు. మొదటిముద్రణ : 2023. ప్రతులకు : తుర్లపాటి లక్ష్మి, 204, శారద సుందర రెసిడెన్సీ, బాపూనగర్, చౌడీదగ్గర సరూర్‌నగర్, హైదరాబాద్ – 500035. ఫోన్ : 98666 30739, 97042 25469.

**అండమాను జైలు – ముస్లిం స్వాతంత్ర్య సమరయోధులు :** రచయిత : **సయ్యద్ నశీర్ అహమ్మద్**

భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్ర రచనలో ముస్లిముల త్యాగపూరిత పోరాటాలకు తగినంత స్థానం లభించకపోవడాన్ని గమనించిన నశీర్ అహమ్మద్ ఆ పోరాటాలను, త్యాగాలను వివరిస్తూ ఇప్పటికి 20 సాధికారిక గ్రంథాలు రచించి ప్రచురించారు. న్యాయవాదిగా, పాత్రికేయునిగా, కవిగా, కార్టూనిస్టుగా, వ్యాస రచయితగా, పత్రికా సంపాదకునిగా పనిచేసిన నశీర్, వాటన్నిటినీ వదిలేసి – ఏకైక లక్ష్యంతో భారత స్వాతంత్ర్యోద్యమంలో ముస్లిముల పాత్రపై విశేష పరిశోధనలు, క్షేత్ర పర్యటనలు చేసి ఈ పుస్తకాల రచనా యజ్ఞాన్ని 1998లో ప్రారంభించి కొనసాగిస్తున్నారు.

దీనిలో 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య పోరాటంలోనూ, ఆ తర్వాత జరిగిన ప్రజాపోరాటాలలోనూ, 1909–1921 వరకు పోరాడిన పోరాట యోధులు, 1922–1931 నాటి మలబారు మోప్లా మొనగాళ్ళు, 1932–1938 నాటి విప్లవోద్యమ వీరులు – 1942–45 నాటి సమరయోధులు అండమాన్‌లోని సెల్యూలార్ జైలులో అనుభవించిన దుర్భర జీవితాలను వివరంగా 322 పుటల్లో పొందుపరిచారు.

భారత చరిత్ర పుస్తకాలలో ముస్లిముల గురించి వున్న అతి తక్కువ సమాచారాన్ని కూడా ఈనాటి హిందూ మతోన్మాద ప్రభుత్వం తొలగిస్తున్న సందర్భంలో నశీర్ రాసిన పుస్తకాలు మన ముస్లిం సోదరుల గురించి ఎన్నో వివరాలను అందిస్తున్నాయి. పుస్తక ప్రచురణేగాక 300 మంది ముస్లిం యోధుల చిత్రాల ప్రదర్శన కూడా నశీర్ పలు చోట్ల దేశవ్యాప్తంగా ఏర్పాటుచేశారు.

తన బాల్యంలో అమ్మ బీబీజాన్ వద్ద పాలు లేకపోవడం వల్ల పక్కఇంట్లో వుండే యశోదమ్మ నశీర్‌కు ఉదయం, సాయంత్రం పాలు ఇచ్చి ప్రాణం నిలిపినందుకు కృతజ్ఞతగా ఈ గ్రంథాన్ని ఆమెకు (1931–2011) అంకితం ఇవ్వడం సముచితంగా వుంది.

1/8 డెమ్మీ బౌండ్ – వెల : రూ. 500/- ప్రథమముద్రణ : 2023. ఆజాద్ ప్రెస్ అఫ్ పబ్లికేషన్స్‌వారి 26వ ప్రచురణ. ప్రతులకు : తెలుగు బుక్‌హౌస్, హైదరాబాదు. ఫోన్ : 9247446497. రచయిత ఫోన్ నెం. 9440241727.

**వేమన గీతం.... ప్రగతికి పట్టం.... కనదగునెవ్వరు గీచినా.... :**

ప్రజానుకూలమైన, ప్రజాతంత్ర భావాలతో నిండిన 44 వేమన పద్యాలను – వాటికి తగిన చిత్రాలతో ఆల్బమ్ లాగా విజయవాడ జాషువా సాంస్కృతిక వేదిక ప్రచురించింది. దీనిని ఇంత అందంగా, ఆకర్షణీయంగా రూపొందించినవారు ఎ. సునీల్‌కుమార్, వౌరప్రసాద్, అనిల్ డ్యానీలు. కవర్ డిజైన్, బుక్ మేకింగ్ గిరిధర్ అరసవల్లి చేశారు.

దట్టమైన 58 ఆర్ట్ షీట్లపై అందంగా ముద్రించిన ఈ పుస్తకం ప్రథమముద్రణ : మార్చి 2023. వెల : రూ. 25/- ప్రచురణ : జాషువా సాంస్కృతిక వేదిక. ఆకులవారివీధి, గవర్నర్‌పేట, విజయవాడ–2. ఫోన్ : 9951540671.

**దాహం.... దాహం : దీర్ఘకవిత.** రచన : **చిన్ని నారాయణరావు**

ఈ రచయిత ఎనిమిదో పుస్తకం ఇది. ఇది వారి రెండవ దీర్ఘకవిత. మొదటిది 'మాట'.

తెలుగు వచన కవితా ప్రస్థానంలో దీర్ఘకవితలనగానే కవిరాజమూర్తి, శైలజామిత్ర, జూకంటి జగన్నాథం, హిమజ్వాల, కాంచనపల్లి, ప్రసేన్, సుంకిరెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి, దప్పోళ్ళ రమేశ్, జూలూరి గౌరీశంకర్, దర్భశయనం, వెంకట్, ఎస్.ఆర్. పృథ్వి, ఎండ్లూరి సుధాకర్, రేణుకా అయోల, కుందుర్తి, శీలా వీర్రాజు, నగ్నముని, శివారెడ్డి, ఛాయరాజ్, దేవిప్రియ, విద్యాసాగర్, పెరుగు రామకృష్ణ, శీలా సుభద్రాదేవి, సినారే, వరవరరావు, శేషేంద్ర, పెన్నా శివరామకృష్ణ, కరీముల్లా, ఇటీవల డా॥ జి.వి. కృష్ణయ్య, సబ్బని లక్ష్మీనారాయణ మొదలగువారు గుర్తు వస్తారు. ఇప్పుడు ఈ జాబితాలో చిన్ని నారాయణరావు చేరారు.

'మాట'లో భాష గురించి రాయగా ఈ 'దాహం'లో మనిషిని పట్టి పీడిస్తున్న ధన దాహం, కీర్తి దాహం, కామ దాహం, ప్రేమ దాహం, మైకు దాహం, వారసత్వ దాహం, సెల్ దాహం మొదలైన అంశాలతో 13 భాగాలుగా ఈ కవితను విస్తరించారు. కవితలలోని భావాన్ని స్ఫురింపచేసే చిత్రాలను వేయించారు.

'మనిషీ నీవొక వేటగాడివై దాహ తాపత్రయాలను అణచివేసే దిశగా యుద్ధం చెయ్' అంటూ సందేశం ఇచ్చారు.

1/8 డెమ్మీ 90 పుటలు. వెల : రూ. 120/- ప్రథమముద్రణ : 2023 ఏప్రిల్, నవమల్లెతీగ ప్రచురణ. ప్రతులకు : 9440202942 ✺

కవిత

# ఒడువని ముచ్చట

- కందుకూరి అంజయ్య

శంకరా !
కొట్లాడి మలుపుకొన్న
కొయ్యకాలు చేను
ఎంత పాతం చేసినా
ఎన్ని నీళ్లు కట్టినా
కొతిమీర కూడా మొలుస్త లేదు

ఎండిన మడుల
కడుపు నిండా
జల్లు కురుస్తదనుకొంటే
నల్లటి మేఘాలన్నీ
నడక మార్చి
సముద్రం మీదికి ఉరికి
వంగుతున్నయి

కలాలన్ని
కండ్లు మూసుకున్నయి
గళాలన్ని మూగ పోయినయి
ఆట పాట అంగడి సొమ్మయింది
ఓటును కొనే
కేటుగాళ్ళు మోపయింద్రు

నక్కలు కావలి
కుక్కలమని
మందసుట్టు తిరిగి
ఊళ పెడుతున్నయి

శంకరా !
మనసుల మరుగుతున్న
ఉప్పెన
పెదవి దాటుతలేదు
మెదళ్ళను దండకుచ్చి
దండ యాత్ర సాగించి
మలుపు తిప్పిన మారుతాత్మజులు
చల్లని చూపు కోసమో
కమ్మని కౌగిలింతల సుఖం కోసమో
పగటి కలలు కని
పక్క తడుపు కొన్నరు

శంకరా !
ఇప్పుడు మనుషులను
కూడగట్టే మానిసి లేదు
మంచి చెడులను విప్పి చెప్పే
సాత్వికుడు లేదు
అంతా
వడ్లు పెరుగు కలిపినట్టుంది
పడని కాడ వస్త్రగాలం
పట్టినట్టుంది
ఈన గాస్తే నక్కల పాలయింది
అంతా మొదటి కచ్చింది
ఒడువని ముచ్చటై కూసుంది.

గుర్రం జాషువా 128వ జయంతి సెప్టెంబర్ 28 సందర్భంగా....

కులమతాలు గీసుకున్న గీతలు జొచ్చి
పంజరాన గట్టు పడను నేను
నిఖిల లోక మెట్లు నిర్ణయించిన నాకు
తిరుగు లేదు విశ్వ నరుడ నేను."!!



PRAJA SAAHITI September 2023 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023
No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month

# కాలం అవసరం నించి పుట్టుకొచ్చిన వాళ్ళం



(భగత్‌సింగ్, సుఖదేవ్ లాహోరు కుట్రకేసులో ముద్దాయిలు. లాహోరు సెంట్రల్ జైలులో వున్నారు. కోర్టు ఇద్దరికీ ఉరిశిక్ష విధించింది. ఇద్దరూ ఉరితీతకి ఎదురు చూస్తున్నారు. దేశవ్యాపితంగా ఈ ఉరిశిక్షలకి వ్యతిరేకంగా పెద్దఎత్తున ఆందోళన చెలరేగింది. సుఖదేవ్ అతి భావుకుడు. అతనిలా అనుకున్నాడు. – 'ఉవ్వెత్తున లేచిన ప్రజాందోళన ఫలితంగా మనకి ఉరిశిక్షలు ఆగిపోయి, యావజ్జీవ కారాగారశిక్షగా మారిపోవచ్చును. 14 ఏళ్ల పాటు ద్వీపాంతర వాసశిక్ష అనుభవించేక, జీవచ్ఛవాలుగా మారిపోతాం. అలాంటి పరిస్థితిలో బతకడం కన్నా, ఆత్మహత్య చేసుకోవడం మేలు!' ఇలా ఆలోచించి సుఖదేవ్ తన అభిప్రాయాలను పొందుపరుస్తూ భగత్‌సింగ్‌కి ఓ ఉత్తరం రాశాడు. దానికి జవాబుగా భగత్‌సింగ్ రాసిన లేఖలోని కొంత భాగం యిది. - సం॥)

ఎందుకంటే జైలు వాతావరణం అతని ఆలోచనలన్నిటినీ కాలరాచి నాశనం చేసేస్తుంది. నిన్ను ఒక ప్రశ్న వేయనా? పోనీ నువ్వే చెప్పు–జైలు వెలుపలి వాతావరణం ఎన్నడయినా మన ఆలోచనలకి అనుగుణంగా ఉండేదా? అయినా వైఫల్యాలు ఎదురవుతున్నాయని చెప్పి, అసలు కార్యాచరణే మానెయ్యమంటావా? మనం ఈ రంగంలోకి దిగి వుండకపోతే ఎలాంటి విప్లవచర్యా జరిగి వుండేదికాదని నీ ఉద్దేశమా? అదే నీ ఉద్దేశ్యమయిన పక్షంలో నువ్వు పెద్ద పొరబాటు చేస్తున్నావంటాను. దేశంలోని వాతావరణాన్ని మార్చడానికి మనం కూడా చాలా మట్టుకు సహకరించామన్నది నిజమే ఐనా మనం కేవలం కాలం అవసరం నించి పుట్టుకొచ్చినవాళ్ళం.

వాస్తవానికి ఐరోపాలో పారిశ్రామిక విప్లవం ఓ కొత్త తరహాగా ఆలోచించే వ్యక్తుల నించి పుట్టి వుండకపోతే, మార్క్స్ సామ్యవాదం అనే ఆలోచన వచ్చి వుండకపోను. ఆ ప్రత్యేక తరహాగా ఆలోచించే వ్యక్తుల్లో మార్క్స్ ఒకరు. తనున్న స్థానంలో మార్క్స్ కూడా కొంతమేరకు కాలచక్రాన్ని ఒక ప్రత్యేక పద్ధతిలో త్వరితంగా ముందుకు నడిపించడంలో సాయపడ్డారు. అందుకు సందేహంలేదు.

ఈ దేశంలో సోషలిజాన్నీ, సామ్యవాద సిద్ధాంతాన్నీ నేనుగాని, నువ్వు గాని ఆరంభించలేదు. నిజానికి మన మీద నాటి కాలం, నాటి పరిస్థితులు కల్పించిన ప్రభావ ఫలితం అది. నిస్సందేహంగా మనం ఈ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకుపోవడానికి కొన్ని సాధారణమయిన, కొన్ని తుచ్ఛమయిన పనులు సైతం చేశాం. అందుకే నేననేదేమిటంటే– ఇంత కష్టమయిన పనిని మనం చేపట్టినపుడు దాన్ని కొనసాగిస్తూ, ముందుకు తీసుకుపోవాలే తప్ప కష్టాలు ఎదురయ్యాయని చెప్పి, ఆత్మహత్య చేసుకుంటే అది ప్రజలకి మార్గదర్శకం వహించడం కాదు. మీదు మిక్కిలి రియాక్షనరీ చేసే పని కూడా.

**భగత్‌సింగ్ 116వ జయంతి సెప్టెంబర్ 28 సందర్భంగా....**

(జనసాహితి ప్రచురణ 'మా నెత్తురు వృథా కాదు' పుస్తకం నుండి) ✳

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada
A PUBLICATION OF JANASAAHITHI